
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 329
శనివారం 12-8-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



టైటిల్ పోరుకు భారత్
ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరిక - 13లో



'ఆర్‌బీఐ' ఆగినా..
వడ్డీ రేట్లు పెంచిన బీవోజీ, బీవోఎం ఆగస్ట్ 12 నుంచి అమలు - 13లో



మణిపూర్ మండుతూంటే జోకులా?
మణిపూర్‌లో హింస జరుగుతుంటే ప్రధాని మోదీ పార్లమెంట్‌లో జోకులు వేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు.
వివరాలు 6లో ►



రాజ్యసభ ఎంపీ చద్దా సస్పెన్షన్
అనుచిత ప్రవర్తన ఆరోపణలపై ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా రాజ్యసభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు.
వివరాలు 6లో ►



నటి జయప్రదకు జైలు శిక్ష
ఈఎస్ఐను మోసం చేసిన కేసులో మాజీ ఎంపీ జయప్రదకు ఎగ్మూర్ కోర్టు 6 నెలల జైలుశిక్ష విధించింది.
వివరాలు 6లో ►



ఒత్తిడి కోటా ఎక్కువై...
రాజస్తాన్ కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడం లేదు.. ఒత్తిడి తట్టుకోలేక వారం రోజుల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.
వివరాలు 6లో ►

ఫ్యాక్ట్ చెక్

కనపడటంలేదా వ్యవ'సాయం'?

- వాస్తవాలు తెలిసి కూడా ఈనాడు అబద్ధాలు
- వర్షాభావ పరిస్థితులపై ముందస్తు ప్రణాళికతో ప్రభుత్వం
- బెట్ట ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు
- 80 శాతం సబ్సిడీపై విత్తనం పంపిణీకి ఏర్పాట్లు
- ఏడు జిల్లాల్లో 60వేల క్వింటాళ్ల విత్తనం సిద్ధం
- ఆర్బీకేల్లో వివరాలు నమోదు చేసుకుంటున్న రైతులు

5 లో

అది బాబు వదిలేసిన పార్కే..

- 2017లో తంగడంచలో మెగా సీడ్ పార్క్‌కు బాబు శంకుస్థాపన
- 670 కోట్ల ప్రాజెక్టు.. పైసా మంజూరు చేయలేదు
- తర్వాత ఏడాదిన్నర అధికారంలో ఉన్నా పట్టించుకోలేదు
- 2018లోనే రూ.100 కోట్లు మంజూరంటూ అబద్ధపు రాతలు
- ఇప్పుడు వైఎస్ జగన్ సర్కార్‌పై నిందలు

- వివరాలు 3లో


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

అంతు చూస్తారట!

అందుకే వారికి అధికారం ఇవ్వాలట..

బాబు, అతని దత్తపుత్రుడు, సొంత పుత్రుడిపై నిప్పులు చెరిగిన సీఎం జగన్

- యాత్రలు, సభలు పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు
- అంగళ్లులో చంద్రబాబే రెచ్చగొట్టి గొడవలు సృష్టించారు
- అనుమతి లేకుండా పుంగనూరులోకి వెళ్లాలని ప్రయత్నించారు
- క్యాడర్‌ను రెచ్చగొట్టి 47 మంది పోలీసులపై దాడి చేయించారు
- ఒక పోలీసు సోదరుడి కంటి చూపే పోగొట్టారు
- వీరు సంక్షేమం, అభివృద్ధి చేస్తామంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- పేదలకు ఇంగ్లిష్ మీడియం వద్దన్న చరిత్ర ఎవరిది?
- నాడు ఈ పథకాలు, సామాజిక న్యాయం మాటేమిటి?
- ఈయన పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తుకు వస్తుందా?

2 లో

"75 ఏళ్ల ముసలాయన, ఆయన దత్తపుత్రుడు, సొంత పుత్రుడు మాట్లాడుతున్న మాటలు వినండి. అధికారం ఇస్తే ఏం చేస్తారో వీళ్ల నోటితో వీళ్లే చెప్పారు. తనకు అధికారం ఇస్తే ఎవరినీ వదలడట.. తనకు గిట్టని వారి అంతు చూస్తాడట.. మట్టుబెడతాడట.. ఉగ్రరూపం చూపిస్తాడట.. ఏకంగా నరకం చూపిస్తాడట.. ఇందుకోసం ఆయనకు అధికారం ఇవ్వాలట! ఇదీ ఈ పెద్దమనిషి నైజం. ఇలాంటి ఆయన కోసం ఆయన దత్తపుత్రుడు పరుగెడుతున్నాడు. ఈ పెద్దమనిషికి ఏనాడైనా ప్రజలకు మంచి చేసిన చరిత్ర ఉందా? ఫలానా పని చేశానని చెప్పుకోవడానికి ఏమీ లేకే రెచ్చగొట్టి గొడవలు సృష్టించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. ఇదేం రాజకీయం?

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి




మీరు దేశానికే ఆదర్శం

- నాలుగో విడత వైఎస్సార్ సున్నా వడ్డీ సొమ్ము జమ చేస్తూ అక్కచెల్లెమ్మలతో సీఎం జగన్
- సున్నా వడ్డీ కింద 1.05 కోట్ల మంది ఖాతాల్లో రూ.1,353.76 కోట్లు జమ

2 లో

లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా



మూక దాడికి మరణమే

మైనర్లపై అత్యాచారానికి సైతం మరణశిక్షే

- మూడు నేర న్యాయ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బ్రిటిష్ చట్టాలకు రాం..రాం.. ఇక స్వదేశీ 'న్యాయం'..
- ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లకు చెల్లుచీటీ
- వాటి స్థానంలో భారతీయ చట్టాలు.. తొలిసారిగా ఉగ్రవాదానికి నిర్వచనం
- రాజద్రోహం సెక్షన్ పూర్తిగా ఎత్తివేత

6 లో

పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

ఏయూ జేఏసీ అధ్యక్షుడు జి.రవికుమార్ డిమాండ్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) పై చౌకబారు విమర్శలు చేయడాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మానుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) అధ్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్ ఖండించారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలతో ఉద్యోగులు, విద్యార్థుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏయూపై అసత్య ఆరోపణలు చేసినందుకుగాను బహిరంగ క్షమాపణ చెప్పాలని పవన్ కళ్యాణ్‌ను డిమాండ్ చేశారు.

10 లో

సాధికారత సాక్షాత్కారం



మహిళలు చేస్తున్న డిపాజిట్లు ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికం

- 2019–23 వరకు మహిళలు చేసిన డిపాజిట్లలో పెరుగుదల
- రాష్ట్రంలో మొత్తం డిపాజిట్లలో 35 శాతానికి పైగా మహిళల పేరిటే
- తలసరి డిపాజిట్లలోనూ ఏపీ మహిళలదే ఆధిక్యత
- దేశ తలసరి డిపాజిట్ మొత్తం రూ.4,618.. ఏపీలో రూ. 6,444
- దేశంలో గతేడాది మహిళలు చేసిన డిపాజిట్లలో 20.5శాతం పెరుగుదల
- ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో సగం డిపాజిట్లు మహిళలవే
- 2019లో 25% కాగా.. 2023లో 30 శాతానికి పెరుగుదల
- ఎస్‌బీఐ నివేదిక వెల్లడి

3 లో

పసుపు @ రూ.11,750



ప్రభుత్వ జోక్యంతో నెలలోనే రెట్టింపైన ధర

- జూన్‌లో రూ.5,300 నుంచి రూ.6,250 మధ్య ధర
- సీఎం ఆదేశాలతో ఎమ్మెస్పీ రూ.6,850 చొప్పున కొనుగోలు.. రూ.34.39 కోట్ల విలువైన 5,020 టన్నుల పసుపు సేకరణ
- ప్రభుత్వ జోక్యంతో వ్యాపారుల మధ్య పెరిగిన పోటీ
- కనీస మద్దతు ధరకు మించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ప్రస్తుతం రూ.8,200 నుంచి 11,750 మధ్య పలుకుతున్న పసుపు ధర
- ఈసారి రూ.15 వేలు దాటే అవకాశం ఉందని అంచనా

10 లో

కామాంధులకు 20 ఏళ్ల జైలు, జరిమానా



నంద్యాల, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కన్న కూతుళ్లపైనే లైంగికదాడి

- శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల గ్రామంలో 13 ఏళ్ల బాలికపై ఓ వ్యక్తి అఘాయిత్యం
- ముగ్గురికీ కఠిన శిక్షలు విధిస్తూ న్యాయస్థానాల తీర్పు
- బాధితులకు పరిహారంపై ప్రభుత్వానికి సిఫారసులు

5 లో

కామంతో కళ్లు మూసుకుపోయి వేర్వేరు ప్రాంతాలకు చెందిన అభం శుభం తెలియని చిన్నారులపై లైంగికదాడికి పాల్పడిన ముగ్గురు కామాంధులకు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయస్థానాలు శుక్రవారం సంచలన తీర్పులిచ్చాయి.

నేడు మోస్తరు వర్షాలు


5లో

ఇదండీ సంగతి



విద్యుదుత్పత్తిని ఆపేయండి

- తెలంగాణ జెన్‌కోకు కృష్ణాబోర్డు ఆదేశం
- కృష్ణాబేసిన్‌లో సగటు వర్షపాతం కంటే తక్కువ కురిసే అవకాశం
- దీంతో శ్రీశైలం ప్రాజెక్టులో తగ్గనున్న నీటిలభ్యత.. నీటినిల్వలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది
- ఇకపై ఎడమగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేయవద్దు
- వాటిని బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి



సాక్షి, అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తిని తక్షణమే నిలిపేయాలని తెలంగాణ జెన్‌కోను కృష్ణా బోర్డు ఆదేశించింది. నీటి కేటాయింపులు చేయాలని ఎలాంటి ప్రతిపాదన పంపకుండా, బోర్డు అనుమతి లేకుండా విద్యుదుత్పత్తి చేస్తూ ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు తరలిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు తెలంగాణ జెన్‌కో సీఎండీకి కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ శుక్రవారం లేఖ రాశారు. శ్రీశైలం ప్రాజెక్టులో

మిగతా 5వ పేజీలో ►

ఐరాస సదస్సుకు కేజీబీవీ విద్యార్థిని



ఐక్యరాజ్యసమితి సదస్సుకు అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా ఎటపాక కేజీబీవీ విద్యార్థిని మోతుకూరి చంద్రలేఖ ఎంపికైంది. ఈమె పదో తరగతిలో 523 మార్కులు సాధించి జిల్లాలోని కేజీబీవీల్లో టాపర్‌గా నిలిచింది. పాఠశాలల టాపర్స్‌కు జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా గత నెలలో ఆన్‌లైన్‌లో పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ పరీక్షలో చంద్రలేఖ 100 మార్కులకు గాను 94 మార్కులు సాధించింది. ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరచి ఐరాస సదస్సుకు ఎంపికైంది.

3 లో

హస్తినకు 'పొందూరు' కళాకారులు



దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోటలో జరుగనున్న స్వాతంత్య్ర దినోత్సవాలను వీక్షించేందుకు శ్రీకాకుళం జిల్లా పొందూరుకు చెందిన ముగ్గురు ఖాదీ కార్మికులకు ప్రత్యేక ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వ 'జన్ భాగీదారి' దార్శనికతకు అనుగుణంగా దేశంలోని 75 మంది వడుకు, నేత కార్మికులకు ఎర్రకోటలోని వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించింది. అందులో పొందూరుకు చెందిన బల్ల భద్రయ్య–లక్ష్మి దంపతులతో పాటు జల్లేపల్లి సూర్యకాంతంకు అదృష్టం దక్కింది.

3 లో

'అన్‌లాగ్'కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులు 9 మంది అమెరికన్ బహుళజాతి సెమీ కండక్టర్ కంపెనీ అయిన అన్‌లాగ్ డివైజెస్‌కి ఎంపికయ్యారు. ఆ సంస్థ ప్రతినిధులు వీరిని ఏడాది పాటు లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. ఇంటర్న్‌షిప్ సమయంలో వీరికి నెలకు రూ.40వేలు చొప్పున స్టయిఫండ్ ఇస్తారు. ఇంటర్న్‌షిప్ పూర్తయిన తర్వాత వారి పని తీరు ఆధారంగా విద్యార్థులను ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

14 లో





పచ్చనిసీమ... కుమ్మరించెను ప్రేమ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో మహిళల అభివాదం..



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సీఎం జగన్‌కు కోనసీమ బ్రహ్మరథం




సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన సంతోషంలో మహిళలు, యువతులు..

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, అమలాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కోనసీమలో మహిళలు, యువకులు బ్రహ్మరథం పట్టారు. అమలాపురం రూరల్ జనుపల్లిలో శుక్రవారం వైఎస్సార్ సున్నా వడ్డీ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఆయనకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. అమలాపురం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి అక్కడికి ఒకటిన్న కిలోమీటర్ దూరం ఉన్న జనుపల్లిలోని స్టేడియం సభాస్థలికి చేరుకోవడానికి అరగంటకు పైగా పట్టింది. అడుగడుగునా ప్రజలు జైజగన్ నినాదాలు చేస్తుండగా.. వారందరికీ ఆయన అభివాదం చేస్తూ.. ముందుకు సాగారు. ప్రాంగణం బయట, రోడ్లపైన జనం బారులు తీరారు. అమలాపురం, ఎర్రవంతెన–నల్లవంతెన మార్గం తిరునాళ్లను తలపించింది.

బాధితులకు సీఎం ఓదార్పు..

తాడేపల్లి తిరిగి వేళ్లే సమయంలో హెలిప్యాడ్ వద్ద బాధితులు సీఎం జగన్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వికలాంగులు, వృద్ధులు, అభాగ్యులు, అనారోగ్యంతో బాధపడుతున్న సుమారు 146 మంది విన్నపాలను సీఎం జగన్ రెండు గంటలపాటు ఎంతో ఓపిగా ఆలకించారు. తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆదేశించారు. వారంతా భోజనం చేయలేదని తెలుసుకుని, వారందరికీ భోజనాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అంతకు ముందు సీఎం జగన్ అమలాపురం–బెండమూర్లంక మధ్య రూ.17.44 కోట్లతో 8 కిలోమీటర్ల రోడ్డు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. బెండమూర్లంక ఓహెచ్ఆర్‌సీ ట్యాంకు నుంచి ఓఎన్జీసీ ప్లాంట్ వరకు రూ.7.62 కోట్ల ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి, సాంఘిక సంక్షేమ నిధులు రూ.12.16 కోట్లతో అంబేడ్కర్ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.



సీఎం జగన్ వస్తున్న బస్సుపై పూలవర్షం కురిపిస్తున్న జనం



సభా ప్రాంగణం వెలుపల భారీ జనసమూహంతో నిండిపోయిన ఓ రహదారి

మీరు దేశానికే ఆదర్శం

నాలుగో విడత వైఎస్సార్ సున్నా వడ్డీ సొమ్ము జమ చేస్తూ అక్కచెల్లెమ్మలతో సీఎం జగన్



స్వయం సహాయక సంఘాల మహిళలకు 'వైఎస్సార్ సున్నా వడ్డీ' సాయం చెక్కు అందిస్తున్న సీఎం జగన్

- వారి అభ్యున్నతి కోసం అన్ని విధాల భరోసా కల్పిస్తున్నాం
- ప్రతి అడుగులోనూ అక్కచెల్లెమ్మల పక్షపాత ప్రభుత్వంగా నిలిచాం
- 99.67 శాతం రికవరీతో స్వయం సహాయక సంఘాలు స్ఫూర్తిదాయకం
- మన ప్రభుత్వ హయాంలో 25 లక్షల మంది సభ్యులు పెరిగారు
- మన ప్రభుత్వ పనితీరుకు ఇదే నిదర్శనం
- బ్యాంకులను ఒప్పించి రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించాం
- అప్పుల ఊబి నుంచి వెలుగుల వైపు అడుగులు వేసేలా చర్యలు
- వివిధ పథకాల ద్వారా ఆర్థిక, సామాజిక సాధికారతకు ఊతం
- సున్నా వడ్డీ కింద 1.05 కోట్ల మంది ఖాతాల్లో రూ.1353.76 కోట్లు జమ
- 9.48 లక్షల డ్వాక్రా సంఘాలకు లబ్ధి.. నాలుగేళ్లలో రూ.4,969 కోట్లు సాయం

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, అమలాపురం : 'మన అక్కచెల్లెమ్మలు దేశానికే ఆదర్శం. 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ మన పల్లెల నుంచే సాధికారతతో ఆవిర్భవించాలి. అందుకే మహిళా పక్షపాత ప్రభుత్వంగా వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. దేశంలో మరే రాష్ట్రంలో అమలు చేయనటువంటి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత.. తదితర పథకాల ద్వారా ప్రతి అడుగు అక్క చెల్లెమ్మల కోసమే వేస్తున్నాం. ఈ నాలుగేళ్ల కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే సంకల్పంతో ఖర్చుకు వెనుకాడకుండా నిర్ణయాలు తీసుకున్నాం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9.48 లక్షల డ్వాక్రా సంఘాల్లోని కోటి ఐదు లక్షల 13 వేల 365 మంది అక్కచెల్లెమ్మలు బ్యాంకులకు చెల్లించిన వడ్డీని వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద వరుసగా నాలుగో ఏడాది శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వేదికగా కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా రూ.1,353.76 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన అక్కచెల్లెమ్మలు సంతోషంగా ఉంటేనే మన కుటుంబాలు సంతోషంగా ఉంటాయని చెప్పారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు రూ.4,969 కోట్లు లబ్ధి కలిగించామన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

నారా వారిది నారీ వ్యతిరేక చరిత్ర

గత చంద్రబాబు ప్రభుత్వంలో అంతా మోసమే. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల రుణాలన్నీ పూర్తిగా మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు 2014 – 2019 మధ్య రూ.14,205 కోట్లు చెల్లించకుండా మోసం చేసి అక్కచెల్లెమ్మలను నడిరోడ్డు మీద పడేశాడు. దీనికి తోడు సున్నా వడ్డీ పథకాన్ని సైతం 2016 అక్టోబర్ నుంచి రద్దు చేసి వారిని మరింతగా కష్టాల్లోకి నెట్టాడు. దీంతో ఏ, బి గ్రేడ్‌లలో ఉన్న సంఘాలన్నీ సీ, డీ గ్రేడ్‌కు దిగజారిపోయాయి. రూ.3,036 కోట్లు ఎదురు వడ్డీ కట్టాల్సి వచ్చింది. మొత్తంగా అప్పులన్నీ తడిసి మోపెడై 2019 ఏప్రిల్ నాటికి రూ.25,571 కోట్లకు ఎగబాకాయి. బాబు చేసిన మోసానికి 2019లో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి అక్కచెల్లెమ్మలు తీసుకున్న రుణాలలో 18.36 శాతం మొండి బకాయిలుగా తేలాయి. అదీ నారా వారి నారీ వ్యతిరేక చరిత్ర. ఇప్పుడు మనందరి ప్రభుత్వం, మీ బిడ్డ ప్రభుత్వం అక్కచెల్లెమ్మల కోసం తోడుగా నిలబడింది. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూతతో ప్రతి అడుగులోనూ తోడుగా నిలబడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ అడుగులు ముందుకు వేస్తున్నాం. ఫలితంగా ఈ రోజు పొదుపు సంఘాలలో మొండి బకాయిలు కేవలం 0.3 శాతం మాత్రమే. 99.67 శాతం రికవరీ రేటుతో మన అక్కచెల్లెమ్మలు దేశానికి ఆదర్శంగా నిలిచారు. తేడా మీరే చూడండి.

అప్పుల ఊబి నుంచి బయటకు తెచ్చాం

మనందరి ప్రభుత్వానికి ముందు పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు దాదాపు 90 లక్షలు ఉన్నారు. మనపై నమ్మకం పెరగడం వల్ల ఈ రోజు ఆ సంఖ్య 1.16 కోట్లకు పెరిగింది. అంటే 25 లక్షలకుపైగా పెరిగారు. సున్నా వడ్డీతో పాటు రూ.3 లక్షల వరకు రుణం అతి తక్కువ వడ్డీకే ఇప్పిస్తున్నాం. చంద్రబాబు ప్రభుత్వంలో 12–14 శాతం వడ్డీ వసూలు చేశారు. మనం దానిని 9.5 నుంచి 8.5 శాతం వరకు తగ్గించగలిగాం. ఇవన్నీ ఒక ఎత్తయితే 2019 ఎన్నికల నాటికి రాష్ట్రంలో పొదుపు సంఘాలకు ఉన్న రుణాలు రూ.25,571 కోట్లు. ఆ రుణాల మొత్తాన్ని నాలుగు విడతల్లో వారి చేతికే ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పాం. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే 3 పర్యాయాలు రూ.19,178 కోట్లు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా వారి చేతుల్లో పెట్టి వారిని అప్పుల ఊబి నుంచి బయటకు తీసుకొచ్చాం.

పలు విధాలా భరోసా

- జగనన్న అమ్మ ఒడి ద్వారా 44.48 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు నాలుగేళ్లలో రూ.26,067 కోట్లు ఇచ్చాం. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45–65 వయసున్న నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలైన 26.39 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.14,219 కోట్లు అందించాం. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 3.56 లక్షల మందికి రూ.1518 కోట్లు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద 4.39 లక్షల మందికి రూ.1257 కోట్లు సాయం అందించాం.
- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా 1,05,13,365 మంది అక్కచెల్లెమ్మలకు నాలుగేళ్లలో రూ.5,000 కోట్లు సాయం చేశాం. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా విద్యా దీవెన ద్వారా 26.99 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు మేలు చేస్తూ పిల్లల చదువులకు అయ్యే ఖర్చు పూర్తిగా వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నాం. ఇందుకోసం రూ.10,636 కోట్లు నేరుగా అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేశాం.
- పిల్లల భోజన, వసతి ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన పథకం ద్వారా 25.17 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.4,275 కోట్లు ఇచ్చాం. ఈ పథకం కింద డిగ్రీలు, ఇంజనీరింగ్, డాక్టర్ చదువులు చదువుతున్న పిల్లలకు ఏడాదికి రూ.20 వేలు, పాలిటెక్నిక్ చదువుతున్న పిల్లలకు రూ.15 వేలు, ఐటీఐ చదువుతున్న పిల్లలకు రూ.10 వేలు రెండు దఫాల్లో ఇస్తున్నాం. ఇలాంటి పథకాలు దేశంలోనే ఎక్కడా లేవు.

సొంత గూడు కోసం 30 లక్షల ఇళ్ల పట్టాలు

- చరిత్రలో ఇదివరకెన్నడూ లేని విధంగా నా అక్క చెల్లెమ్మల పేరిట 30 లక్షల ఇళ్లపట్టాలు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాం. ఒక్కో ఇంటి స్థలం విలువ ఏరియాను బట్టి రూ.2.5 లక్షల నుంచి రూ.15 లక్షల దాకా ఉంది. అంతటితో ఆగక 22 లక్షల ఇళ్ల నిర్మాణం వేగంగా చేపట్టాం. ఇళ్ల నిర్మాణం పూర్తయితే ఒక్కో దాని విలువ రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉంటుంది. ఈ ఒక్క పథకం ద్వారా రెండు మూడు లక్షల కోట్లు అక్క చెల్లెమ్మల చేతిలో పెట్టినట్లయింది.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా 35.70 లక్షల మంది గర్భిణులు, బాలింతలు.. ఆరేళ్ల వయసు వరకు ఉన్న పిల్లలకు మంచి చేస్తున్నాం. వీరి కోసం గతంలో రూ.400 కోట్లు ఖర్చు చేస్తే గొప్ప అనుకునే పరిస్థితి ఉండేది. ఈ రోజు మనం ఏటా రూ.2 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకానికి ఇంతవరకు రూ.6,141 కోట్లు వెచ్చించాం.

సూర్యోదయానికి ముందే..

- దేశంలో ఎక్కడా కనీ వినీ ఎరుగని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చాం. ఒకటో తారీఖున సూర్యోదయానికి ముందే అది ఆదివారమైనా, సెలవు దినమైనా సరే చిక్కటి చిరునవ్వుతో తలుపులు తట్టి, అవ్వా గుడ్‌మార్నింగ్ అని చెబుతూ పింఛన్ ఇచ్చేలా మనవడు, మనవరాళ్లను మీ ఇంటికి పంపిస్తున్నాను.
- గతంలో వెయ్యి రూపాయలు పింఛన్ ఇస్తే గొప్ప అనే పరిస్థితి నుంచి మీ బిడ్డ హయాంలో రూ.2,750కి పెంచాం. వైఎస్సార్ పెన్షన్‌కానుక కోసం నాలుగేళ్లలో మీ బిడ్డ చేసిన ఖర్చు రూ.75 వేల కోట్లు. ఇందులో నా అవ్వలు, అక్కచెల్లెమ్మలకు మహిళా పక్షపాత ప్రభుత్వంగా రూ.49,845 కోట్లు వెచ్చించాం.
- రూపాయి లంచం, వివక్షకు తావు లేకుండా ఈ నాలుగేళ్లలో నేరుగా రూ.2,31,123 కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేయడం ఒక చరిత్ర.
- నా అక్కచెల్లెమ్మలు రాజకీయంగా ఎదగాలని నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టుల్లోనూ సగభాగం ఇచ్చేలా చట్టం చేసి అమలు చేస్తున్నాం. వారి భద్రత కోసం దిశ పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను తీసుకొచ్చాం. దిశ యాప్‌ను 1 కోటి 24 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆపద వేళ పది నిమిషాల్లో సాయం అందేలా చూస్తున్నాం. ఇప్పటిదాకా ఇలా రాష్ట్రంలో 30,369 మందిని కాపాడగలిగాం.

అక్కచెల్లెమ్మలతో మాటామంతి



స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులతో సీఎం జగన్

సీఎం జగన్ వేదిక వద్ద డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువుల ప్రదర్శనను పరిశీలించారు. అక్కచెల్లెమ్మలతో ఆప్యాయంగా మాట్లాడారు. మహిళలు చేస్తున్న వ్యాపార కార్యకలాపాలను కలెక్టర్ హిమాన్షు శుక్లా సీఎంకు వివరించారు. ఆ సమయంలో దూరంగా ఉన్న మంత్రి విశ్వరూప్‌ను దగ్గరకు పిలిపించుకుని పక్కన కూర్చోబెట్టుకుని, అందరితో కలిసి గ్రూపు ఫొటో దిగారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు చెల్లుబోయిన వేణు, జోగి రమేష్, ఆదిమూలపు సురేష్, ఎంపీలు పిల్లి సుబాష్ చంద్రబోస్, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చింతా అనూరాధ, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సతీష్‌కుమార్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

రూ.20 లక్షల రుణం.. రూ.80 వేల వడ్డీ రాయితీ



అన్నా.. గతంలో మాలాంటి పేదోళ్లకు అప్పు పుట్టేది కాదు. పుట్టినా రూ.5 నుంచి రూ.10 వరకు వడ్డీలు కట్టేవాళ్లం. మీరు సీఎం అయ్యాక వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా నాలాంటి డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని అప్పు వస్తోంది. నేను ఆర్థికంగా నిలదొక్కుకుని సొంతంగా వ్యాపారం చేసుకునే ధైర్యాన్ని కలిగించావు. నేను రూ.20 లక్షల వరకు రుణం, రూ.80 వేల వరకు వడ్డీ రాయితీ పొందాను. ఈ రోజు నేను జిరాక్స్ సెంటర్, టిఫిన్ సెంటర్‌తో నా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మీ పథకాలతో నాలుగేళ్లలో మా కుటుంబం రూ.3 లక్షలకు పైగా లబ్ధి పొందింది. మీ మేలు ఎప్పటికీ మరువం.

– దుర్గా భవాని, ఉప్పులగుప్తం, భీమనపల్లి మండలం

మేనమామగా నిరూపించుకున్నారు



వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నన్నెంతగానో ఆదుకుంది. గతంలో ఏదైనా వ్యాపారం చేయాలంటే అప్పులతో భయమేసేది. మీ వల్ల నేను ఈ రోజు పాల వ్యాపారం చేస్తూ నెలకు రూ.7వేలు సంపాదిస్తున్నాను. ఇంటికి కొడుకులా, మా బిడ్డలకు మేనమామగా ఉంటానని చెప్పిన మీ మాట అక్షరాలా నిజమని నిరూపించారు. విద్యా పథకాల ద్వారా నా కుటుంబం రూ.2.40 లక్షల వరకూ లబ్ధి పొందింది. మీరు తెచ్చిన వలంటీర్ల వ్యవస్థ సేవలు మరువలేనివి.

– పి.ధనలక్ష్మి, బండార్లంక, అమలాపురం రూరల్ మండలం

అంతు చూస్తారట!

బాబు, అతని దత్తపుత్రుడు, సొంత పుత్రుడిపై నిప్పులు చెరిగిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, అమలాపురం: 'చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంత పుత్రుడు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ఎక్కడా చెప్పడం లేదు. అలా చెబితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అందుకే గొడవలు సృష్టించి ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారు. యాత్రలు, సభల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. అమలాపురంలో వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగో విడత నిధుల విడుదల సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఈ రోజు నిజంగా వీళ్లందరి ఆలోచన ఏ స్థాయిలో ఉందో ప్రజలు గమనించాలని కోరారు. 'వారు మంచి చేస్తామంటే ప్రజలు నమ్మరని వాళ్లకు తెలుసు. కాబట్టే ప్రజల్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారు. అబద్ధాలు చెబుతున్నారు. ప్రతి రోజూ మోసాలు చేస్తారు. మీటింగులు పెట్టి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. చివరకు 47 మంది పోలీసులపై దాడి చేశారు. ఇలాంటి రాక్షసులకు ఎందుకు సెక్యూరిటీ ఇవ్వాలని అనిపించింది. ఎక్కడికక్కడ ప్రజల్ని రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్న వారి పట్ల మనమంతా చాలా జాగ్రత్తగా ఉండాలి' అని సూచించారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

శవ రాజకీయాలు చేస్తున్నారు.

- మొన్న అంగళ్లలో చంద్రబాబు తానే స్వయంగా రెచ్చగొట్టి గొడవలు చేయించారు. మళ్లీ పుంగనూరులో ఒక రూటుకు అనుమతి తీసుకొని ఆ రూట్లో పోకుండా పుంగనూరుకు వచ్చి వేరే రూట్లో పోవాలని ప్రయత్నించారు. అప్పుడే పోలీసులు మీకు అనుమతి లేదని, అక్కడ అధికార పార్టీవాళ్లు నిరసన కార్యక్రమం చేసుకుంటున్నారు, లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తుందని చెప్పారు.
- దీంతో చంద్రబాబు వారిని ఇష్టమొచ్చినట్లు తిట్టాడు. వాళ్ల క్యాడర్‌ను రెచ్చగొట్టి 47 మంది పోలీసులను గాయపరిచారు. ఒక పోలీసు సోదరుడికి కన్ను కూడా పోగొట్టాడు. కారణం గొడవలు జరగాలి. శవ రాజకీయాలు చేయాలన్నదే ఆలోచన. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 వాళ్లదే. వాళ్లు ఏం చెబితే అది రాస్తారు. మైకులు పట్టుకొని దత్తపుత్రుడు రెడీగా ఉన్నాడు కాబట్టి శవ రాజకీయాలు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంటే చులకన

- ఈ పెద్దమనిషి చంద్రబాబు మనస్తత్వం చూడండి. దళితులను చీల్చి వారికి నరకం చూపించాడు. ఎస్సీ కులాల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా? అని చెప్పి వారిని నానా ఇబ్బందులకు గురిచేశాడు. బీసీల తోకలు కత్తిరిస్తా, తోలు తీస్తా, తాట తీస్తా అని బెదిరించాడు. బీసీలకు 143 వాగ్దానాలిచ్చి వెన్నుపోటు పొడిచి మరీ వాళ్లకు నిలువునా దగా చేశాడు.
- మైనార్టీలకు, ఎస్టీలకు కనీసం ఒక్కటంటే ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకుండా మైనార్టీ ఓటు బ్యాంకుతో చెలగాటం ఆడటాన్ని అదే పనిగా పెట్టుకొన్న విషయం గుర్తుకు తెస్తున్నా. ఎస్టీలకు ఏనాడూ న్యాయం చేయకుండా కనీసం ఒక్క ఎకరా ఆర్వోఎఫ్ఆర్ పట్టా ఏ రోజు ఇవ్వకుండా తన పెత్తందార్లకు మన్యాన్ని అప్పగించి మోసం చేశాడు.
- అక్కచెల్లెమ్మలను సైతం మోసం చేశాడు. కోడలు మగ పిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా అని అగౌరవ పరిచాడు. ఇటువంటి పెద్ద మనిషి ఈరోజు మైకు పట్టుకుని ఊదరగొడుతున్నాడు.



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

నోరు తెరిస్తే అబద్ధాలే

- 2014కు ముందు ఈయన మాట్లాడిన మాటలు గుర్తుకు తెచ్చుకోండి. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు రావాలి అన్నారు. రైతుల రుణాలు మాఫీ కావాలంటే బాబు రావాలట. అక్కచెల్లెమ్మలకు పొదుపు సంఘాల రుణాలు మాఫీ కావాలంటే బాబు రావాలట. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే బాబు రావాలంటూ మోసం చేశాడు. రూ.85,712 కోట్ల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి, చేయకుండా రైతులను నిలువునా మోసం చేశాడు.
- రూ.14,207 కోట్ల పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశాడు. చివరకు చదువుకుంటున్న పిల్లలనూ వదల్లేదు. ఉద్యోగం ఇస్తాను లేదా ఉపాధి కల్పిస్తాను అని నిస్సిగ్గుగా అబద్ధాల వాగ్దానాలు చేశాడు. లేదంటే ఇంటింటికీ రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. ప్రతి ఇంటికీ రూ.2 వేలు అంటే ప్రతి పిల్లాడికీ ఏటా రూ.24 వేలు అలా ఐదేళ్లలో రూ.లక్షా 20 వేలు మోసం చేశాడు.
- మాటంటే విలువ లేదు. విశ్వసనీయత లేదు. ఎన్నికలు అయ్యాక ప్రజల్ని గాలికి వదిలేయాలి అనే తలంపుతో పరుగెత్తుతున్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, చంద్రబాబు, దత్తపుత్రుడు.. వీళ్లందరూ దోచుకోవడానికి, పంచుకోవడానికి, తినుకోవడానికి మాత్రమే అధికారం కావాలి. జన్మభూమి కమిటీలతో మొదలు పెడితే.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబు, దత్తపుత్రుడితో ఎండ్ అవుతుంది.



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నాడు, నేడు అదే బడ్జెట్..

- చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇదే బడ్జెట్, ఇదే రాష్ట్రం. అప్పులు కూడా అప్పటి కన్నా ఇప్పుడే తక్కువ. కేవలం ముఖ్యమంత్రి మారాడు. మీ బిడ్డకు ఓటు వేయకపోయినా పర్వాలేదు.. కచ్చితంగా వారికి రావాల్సినవి రావాలని ప్రయత్నం చేశాడు. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు. అప్పట్లో ఇదే చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడని ఆలోచించండి.
- మీ బిడ్డ మీ కోసం ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా రూ.2.31 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి మీ అకౌంట్లలోకి పంపించాడు. ఈ నాలుగేళ్లలో ఇంతటి సంక్షేమాభివృద్ధిని ఏనాడైనా చూశామా? చంద్రబాబు హయాంలో సామాజిక న్యాయం ఉందా? నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగా ఇన్ని పదవులు ఏనాడైనా ఇచ్చారా? ఏనాడైనా మీ బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచన చేశాడా? చివరకు పేదింటి పిల్లలు ఇంగ్లిష్ మీడియం చదవాలంటే కూడా వద్దన్న చరిత్ర ఆయనది. వాళ్ల పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లకు మాత్రం ఇంగ్లిష్ మీడియం కావాలి.
- చంద్రబాబు అధికారంలో ఉండగా ఇలా 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చి.. ఇళ్లు కట్టించడం ఎప్పుడైనా చేశారా? ఇలా చేయలేకపోయిన ఈ 75 ఏళ్ల ముసలాయన వాటిని అడ్డుకోవడంలో మాత్రం ముందుంటారు. దత్తపుత్రులు ఎందుకిలా పరుగెడుతున్నాడంటే ఆయన సీఎం కావడానికి కాదట. ఈ ముసలాయన్ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టడానికట. ఇలాంటి వ్యక్తి సీఎం అయితే మనకు మంచి జరుగుతుందా?
- మీకు మంచి చేయడానికి వస్తున్న వలంటీర్లను కూడా వదలకుండా ఎంత దారుణంగా మాట్లాడారు. రాబోయే రోజుల్లో వీళ్ల నీచ రాజకీయాలు, అబద్ధాలు ఇంకా ఎక్కువ అవుతాయి. మీ బిడ్డ నమ్ముకున్నది దేవుడి దయ, మీ దీవెనలనే. మీకు మంచి జరిగి ఉంటే నాకు మద్దతివ్వండి.

అమలాపురంలో మూడు వంతెనలకు రూ.10 కోట్లు

అమలాపురంలో మూడు పాత బ్రిడ్జిలు ఉన్నాయి. వాటిని పునర్ నిర్మించాలని మంత్రి విశ్వరూప్ అడిగారు. ఇందుకోసం కోసం రూ.10 కోట్లు కేటాయిస్తున్నాను. మా దగ్గర 84 సచివాలయాలున్నాయి.. మాది ఇబ్బందికర ప్రాంతం.. వర్షాలు వస్తే ఇబ్బంది పడతాం.. అని విశ్వరూప్ చెప్పారు. అందుకు మంత్రి విశ్వరూప్‌ను, లేదా అతని కుమారుడు డాక్టర్ శ్రీకాంత్‌ను బాగా తిరగాలని చెప్పాను. ప్రతి సచివాలయానికి జీజీఎంపీ కింద రూ.40 లక్షలు మంజూరు చేస్తానని చెప్పాను. మీ గ్రామాలను అభివృద్ధి చేయడానికి మీ బిడ్డ ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుంది.

క్లుప్తంగా...

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీగా గంధం చంద్రుడు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా గంధం చంద్రుడు నియమితులయ్యారు. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆయన్ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు కార్పొరేషన్ ఎండీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు చూస్తున్న జేవీ మురళీని ఆ విధుల నుంచి రిలీవ్ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైద్యశాఖలో 2,384 మందికి షోకాజ్ నోటీసులు

సాక్షి, అమరావతి: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 2,384 మంది ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేసే ఉద్యోగులు షోకాజ్ నోటీసులు అందుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం, సక్రమంగా హాజరు వేయనందుకు వారి నుంచి వివరణ తీసుకోవాలని కమిషనర్ డాక్టర్ వెంకటేష్ శుక్రవారం డీసీహెచ్ఎస్‌లకు ఆదేశాలు జారీ చేశారు. నోటీసులు అందుకున్న ఉద్యోగులు గత నెలలో ఐదు, అంతకన్నా ఎక్కువ రోజులు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు వేయలేదని గుర్తించారు. ఈ మేరకు కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

18న గోదావరి బోర్డు సమావేశం

సాక్షి, అమరావతి: బోర్డు పరిధిని నిర్దేశిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ 2021, జూలై 15న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలు..అనుమతి లేని ప్రాజెక్టుల డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదికలు)లు ఇవ్వడమే అజెండాగా ఈ నెల 18న గోదావరి బోర్డు సమావేశమవుతోంది. చైర్మన్ ఎంకే సిన్హా అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాల జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శులు, ఈఎన్‌సీలు పాల్గొననున్నారు. అనుమతి లేకుండా ఇరు రాష్ట్రాలు చేపట్టిన ప్రాజెక్టులకు ఏడాదిలోగా అనుమతి తెచ్చుకోవాలని బోర్డు నిర్దేశించింది. పోలవరం కుడి కాలువ సారంగాల సామర్థ్యాన్ని 20 వేల నుంచి 40 వేల క్యూసెక్కులకు పెంచే పనులకు సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే గోదావరి బోర్డు ద్వారా సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం)కి ఏపీ ప్రభుత్వం సమర్పించింది. సీతారామ ఎత్తిపోతల, తుపాకులగూడెం బ్యారేజ్, కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా మూడో టీఎంసీల తరలింపునకు సంబంధించిన డీపీఆర్‌లను తెలంగాణ సమర్పించింది.. గోదావరి జలాలను ఇప్పటిదాకా 2 రాష్ట్రాలకు పంపిణీ చేయలేదని..వినియోగంపై ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కూడా కుదరలేదనే అంశాలను ఎత్తిచూపుతూ తెలంగాణ సర్కార్ సమర్పించిన డీపీఆర్‌లను మదింపు చేయవద్దని, వాటికి అనుమతి ఇవ్వొద్దని ఏపీ సర్కార్ ఇటు గోదావరి బోర్డుకు.. అటు కేంద్ర జల్ శక్తి శాఖకు లేఖలు రాసింది. ఈ నేపథ్యంలోనే గోదావరి బోర్డు సమావేశమవుతోంది.

ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

- 25 నుంచి 4 కేంద్రాల్లో ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్‌ఐ పోస్టుల ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 25 నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర పోలీస్ నియామక మండలి నిర్ణయించింది. ఎస్‌ఐ పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో 57,923 మంది అర్హత సాధించారు. వారిలో 56,116 మంది దేహదారుఢ్య పరీక్ష(స్టేజ్-2)కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలు కేంద్రాల్లో ఈ దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. అర్హత సాధించిన వారిలో విశాఖపట్నంలో 17,371 మంది, ఏలూరులో 9,685 మంది, గుంటూరులో 12,956 మంది, కర్నూలులో 16,104 మంది ఉన్నారు. దేహదారుఢ్య పరీక్ష(స్టేజ్- 2)లకు ముందుగా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించేందుకు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని పోలీస్ నియామక మండలి సూచించింది. కాగా, అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 25 నుంచి దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యేందుకు కాల్ లెటర్లను ఈ నెల 14 నుంచి పోలీస్ నియామక మండలి వెబ్‌సైట్ www.slprb.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దాంతో పాటు స్టేజ్-2 పరీక్షల దరఖాస్తు ఫామ్ కాపీతోపాటు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలి.

యథాతథంగా ఆర్టీసీ సబార్డినేట్ నిబంధనలు

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో పదోన్నతులు, బ్యాక్‌లాగ్ పాయింట్లతోపాటు కమ్యూనల్ రోస్టర్ పాయింట్ల కోసం ప్రస్తుత విధానమే కొనసాగనుంది. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు అందరికీ అవే నిబంధనలు వర్తిస్తాయని ఆర్టీసీ స్పష్టం చేసింది. కొత్తగా ఉద్యోగాల భర్తీకి విద్యార్హతను నిర్ణయించేందుకు ఆర్టీసీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. దీనిపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది. విద్యార్హతలు మినహా సబార్డినేట్ రూల్స్‌లో ఎలాంటి మార్పులు ఉండబోవని పేర్కొంది. అన్ని ప్రాంతీయ, జోనల్ కేటగిరీలో ఖాళీలను నిర్ణీత ఫార్మట్‌లో ఈ నెల 16లోగా సమర్పించాలని అధికారులను ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఆదేశించింది. ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు, బ్యాక్‌లాగ్ పాయింట్ల రోస్టర్ పాయింట్లను యథాతథంగా కొనసాగించాలన్న నిర్ణయంపై నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

సాధికారత సాక్షాత్కారం

మహిళల బ్యాంకు డిపాజిట్లలో టాప్‌లో ఆంధ్రప్రదేశ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళా సాధికారత సాక్షాత్కారమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్లుగా అందజేస్తున్న చేయూతతో రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలు వారి జీవన స్థితిగతులను మెరుగుపరుచుకుంటూ అభ్యున్నతి దిశగా సాగిపోతున్నారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని మహిళలకు అన్ని విధాలుగా అండదండలు అందిస్తూ వారు విద్య, వ్యాపార రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేస్తున్నారు. ఇందుకయ్యే వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. బ్యాంకుల్లో మహిళలు చేస్తున్న డిపాజిట్ల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. ఎస్‌బీఐ రిసెర్చ్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2019 నుంచి 2023 సంవత్సరాల మధ్య డిపాజిట్లు, రుణాలపై సవివర నివేదిక విడుదల చేసింది. 'మహిళలు చేస్తున్న డిపాజిట్లు పెరగడానికి ప్రధాన కారణం ప్రభుత్వాలు మహిళా సాధికారతకు తీసుకుంటున్న చర్యలే. స్థిరమైన మహిళా సాధికారతకు ఇవి నిదర్శనం' అని ఆ నివేదిక పేర్కొంది. దేశంతో పాటు రాష్ట్రంలో మహిళలు చేస్తున్న డిపాజిట్లు పెరగడంతో పాటు మహిళలకు బ్యాంకు రుణాలు కూడా పెరుగుతున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. రాష్ట్రంలో మొత్తం బ్యాంకు డిపాజిట్లలో మహిళలు చేసినవే 35 శాతానికిపైగా ఉన్నాయని తెలిపింది. దేశంలో 2019 - 2023 మధ్య మహిళలు చేసిన తలసరి డిపాజిట్ మొత్తం రూ.4,618కి పెరగ్గా, ఆంధ్రప్రదేశ్‌లో రూ. 6,444కు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో 2023 మార్చికి మొత్తం డిపాజిట్లు రూ. 4.56 లక్షల కోట్లు ఉండగా అందులో మహిళలు చేసినవి రూ.1.59 లక్షల కోట్లు' అని ఆ నివేదిక వివరించింది. పంజాబ్, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో కూడా మహిళల డిపాజిట్లు 35 శాతానికి పైగా ఉన్నట్లు తెలిపింది. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, తెలంగాణలో మహిళల డిపాజిట్ల పెరుగుదల తక్కువగా ఉందని పేర్కొంది. ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల్లో డిపాజిట్లు 10.2 శాతం పెరిగాయని, వీటిలో వ్యక్తుల వాటా తగ్గిందని తెలిపింది. ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం డిపాజిట్లలో మహిళా కస్టమర్ల వాటా 20.5 శాతానికి పెరిగిందని విశ్లేషించింది.

గ్రామీణ ప్రాంతాల్లోనూ పెరుగుదల

దేశంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ మహిళలు చేస్తున్న డిపాజిట్లు పెరుగుతున్నట్లు నివేదిక పేర్కొంది. కోవిడ్ సంక్షోభం ముందు సంవత్సరం 2019లో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు చేస్తున్న డిపాజిట్ల వాటా 25 శాతం ఉండగా 2023కి 30 శాతానికి పెరిగినట్లు తెలిపింది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో మహిళలు చేస్తున్న డిపాజిట్లు బాగా పెరుగుతున్నాయని, 2019 నుంచి 2023 మధ్య కాలంలో ఇవి 50 శాతానికి చేరాయని పేర్కొంది. మొత్తం డిపాజిట్లలో 37 శాతం 40 నుంచి 60 సంవత్సరాల వయస్సు లోపల వారివేనని, వారి వ్యక్తిగత డిపాజిట్లు రూ. 34.7 లక్షల కోట్లని తెలిపింది. 60 సంవత్సరాల పైబడిన సీనియర్ సిటిజన్ల డిపాజిట్లు రూ. 36.2 లక్షల కోట్లు అని, ఈ వ్యక్తిగత డిపాజిట్లు 38 శాతమని తెలిపింది. 60 సంవత్సరాల పైబడిన సీనియర్ మహిళల వ్యక్తిగత డిపాజిట్లు రూ.13.2 లక్షల కోట్లుగా తెలిపింది.

పెరిగిన మహిళల పరపతి

మరో పక్క గత తొమ్మిదేళ్లుగా మహిళలకు వ్యక్తిగత బ్యాంకు రుణాల మంజూరు బాగా పెరిగిందని నివేదిక తెలిపింది. గత తొమ్మిదేళ్లలో దేశంలో కొత్తగా 7.6 కోట్ల మహిళలకు రూ.10.3 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో 2019 నుంచి మహిళలకు బ్యాంకు రుణాల మంజూరు బాగా పెరిగిందని తెలిపింది. 2019 మార్చికి రాష్ట్రంలో మహిళలకు ఇచ్చిన బ్యాంకు రుణాలు రూ.47,548 కోట్లు ఉండగా 2023 మార్చికి ఏకంగా రూ.1,44,792 కోట్లకు పెరిగినట్లు తెలిపింది. అంటే ఈ నాలుగేళ్లలో రుణాలు మూడింతలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అమలు చేస్తున్న పథకాలు సత్ఫలితాలనిస్తున్నాయనడానికి ఈ నివేదికే తార్కాణమని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడి జీవనం కొనసాగిస్తున్నారని, దీంతో డిపాజిట్లు, వారి పరపతి పెరగడంతో వారికి రుణాలివ్వడానికి బ్యాంకులు కూడా ముందుకు వస్తున్నాయని విశ్లేషిస్తున్నారు.

హస్తినకు 'పొందూరు' కళాకారులు

పంద్రాగస్టు వేడుకలను వీక్షించే అవకాశం



బల్ల భద్రయ్య, లక్ష్మి



జల్లేపల్లి సూర్యకాంతం

పొందూరు: దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోటలో జరుగనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను వీక్షించేందుకు శ్రీకాకుళం జిల్లా పొందూరుకు చెందిన ముగ్గురు ఖాదీ కార్మికులకు ప్రత్యేక ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వ 'జన్ భాగీదారి' దార్శనికతకు అనుగుణంగా దేశంలోని 75 మంది వడుకు, నేత కార్మికులకు ఎర్రకోటలోని వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. అందులో పొందూరుకు చెందిన బల్ల భద్రయ్య-లక్ష్మి దంపతులతో పాటు జల్లేపల్లి సూర్యకాంతంకు అదృష్టం దక్కింది.

గుర్తింపు లభించిందిలా..

పొందూరులోని చేనేతవాడకు చెందిన బల్ల భద్రయ్య 35 ఏళ్లుగా చేనేత వృత్తిలో ఉన్నారు. పొందూరు ఏఎఫ్‌కేకే సంఘంలో 15 ఏళ్లు ఫైన్ ఖాదీ పంచెలు (దోవత్) నేయడంలో ఎంతో నైపుణ్యం గల వ్యక్తిగా గుర్తింపు పొందారు. నూరవ కౌంట్ (ఫైన్) చిలపను తయారు చేసి వస్త్రం నేసేందుకు సంప్రదాయంగా అవసరమైన దారాన్ని తీయడంలో జల్లేపల్లి సూర్యకాంతం మంచి నేర్పరితనం కనబరచడంతో స్వాతంత్య్ర దినోత్సవంలో పాల్గొనేందుకు ఆమెకు అవకాశం వచ్చింది.

ఐరాస సదస్సుకు ఎటపాక కేజీబీవీ విద్యార్థిని



ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఐరాస సదస్సుకు అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా ఎటపాక కేజీబీవీ విద్యార్థిని మోతుకూరి చంద్రలేఖ ఎంపికైంది. 2022-23 విద్యాసంవత్సరం పదవ తరగతిలో 523 మార్కులు సాధించి జిల్లాలోని 19 కేజీబీవీల్లో టాపర్‌గా నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల పాఠశాలల టాపర్స్‌కు జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా గత నెలలో ఆన్‌లైన్‌లో పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ పరీక్షలో చంద్రలేఖ 100 మార్కులకు గాను 94 మార్కులు సాధించి ఆన్‌లైన్ ఇంటర్వ్యూకు ఎంపికైంది. ఈమెతో పాటు శ్రీకాకుళం జిల్లాలో కేజీబీవీల నుంచి ఇద్దరు ఇంటర్వ్యూకు హాజరు కాగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన చంద్రలేఖ ఐరాస సదస్సుకు ఎంపికైంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి శుక్రవారం ఆమెకు సమాచారం అందింది. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మకమైన విద్యా ప్రమాణాలపై ఐరాస సదస్సులో చంద్రలేఖ మాట్లాడనున్నట్లు గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి కె.సూర్యకుమారి తెలిపారు. త్వరలో విద్యార్థిని యూఎస్‌ఏ వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. కాగా, సీఎం జగన్ సంకల్పం నెరవేరుతోందనడానికి ఈ పేదింటి విద్యార్థిని ఇప్పుడు ఐరాస సదస్సుకు వెళ్లడమే నిదర్శనం.

లబ్ధిదారుల ఇళ్లకే రేషన్.. భేష్

- కర్ణాటక పౌరసరఫరాల శాఖ మంత్రి మునియప్ప ప్రశంస
- తమ రాష్ట్రంలోను ఈ వ్యవస్థ ఏర్పాటుకు అధ్యయనం
- విజయవాడలో మంత్రి కారుమూరితో కలిసి గోడౌన్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన



మునియప్పను సత్కరిస్తున్న మంత్రి కారుమూరి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇళ్లకు ఎండీయూల్లో రేషన్ అందించడం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కర్ణాటక రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కె.హెచ్.మునియప్ప ప్రశంసించారు. తమ రాష్ట్రంలో కూడా ఇలాంటి విధానాన్ని ప్రవేశపెట్టే దిశగా అధ్యయనం చేస్తామని చెప్పారు. ఆయన శుక్రవారం విజయవాడలో పౌరసరఫరాల శాఖ గోడౌన్ల నిర్వహణ, ఎండీయూ వాహనాలు, రేషన్ సరుకుల ప్యాకేజింగ్, పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. పేదలకు పౌష్టికాహార బియ్యంతో పాటు రాయలసీమ జిల్లాల్లో చిరుధాన్యాలు, పట్టణ ప్రాంతాల్లో ఫోర్టిఫైడ్ గోధుమపిండి పంపిణీ గురించి తెలుసుకుని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన్ని మంత్రి కారుమూరి సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ ప్రారంభం

ఏఎన్‌యూలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరుతో ఏర్పాటు



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ మాధవపెద్ది సురేష్ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన 'గానగంధర్వ పద్మ విభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్'ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి మ్యూజిక్ డైరెక్టర్ మాధవ పెద్ది సురేష్ ముఖ్యఅతిథిగా, ఏపీ సమాచార శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్ శిలాఫలకాన్ని విజయ్‌కుమార్‌రెడ్డి, ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని మాధవపెద్ది సురేష్ ఆవిష్కరించారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ పాల్గొన్నారు.

బాబు ప్రాజెక్టుల సందర్శన విడ్డూరం

- ఆయన మాయ మాటలు ప్రజలందరికీ తెలుసు
- ఉత్తరాంధ్రపై బాబు, పవన్‌లకు ఎందుకంత కోపం?
- మంత్రి సీదిరి అప్పలరాజు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల సందర్శన పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే నమ్మే స్థితిలో ఎవరూలేరని పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. వైఎస్సార్ శ్రీకారం చుట్టిన ప్రాజెక్టుల్లో ఒక్కటైనా చంద్రబాబు పూర్తిచేసి ప్రారంభించిన దాఖలాల్లేవన్నారు. శ్రీకాకుళంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. చంద్రబాబు ప్రాజెక్టులను సందర్శించి విమర్శించడం చాలా విడ్డూరంగా ఉంది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారాలు అందించి ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. జిల్లాలో ప్రధాన ప్రాజెక్టు వంశధార ఫేజ్-2, స్టేజ్-2ని, ఆఫ్‌షోర్ వంటి పనులను ప్రారంభించింది వైఎస్సార్ అని, వాటిని పూర్తిచేసేందుకు వైఎస్ జగన్ నిధులు కేటాయించారు. హిరమండలం రిజర్వాయర్‌లో 19 టీఎంసీల నీరు చేరేలా లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుమతులిచ్చారు. అలాగే, నేరడి బ్యారేజీ అడ్డంకులు తొలగించేందుకు ఒడిశా సీఎంతో మాట్లాడేందుకు జగనన్నే స్వయంగా వెళ్లారు. ఉద్దానం ప్రాంతంలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు అన్ని పనులు చేస్తున్నాం. జిల్లాలోని అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, కూన రవికుమార్‌లు ఏనాడైనా జిల్లాలో ప్రాజెక్టులపై దృష్టిపెట్టారా? నిర్వాసితుల పరిహారాలను తెలుగు తమ్ముళ్లు మింగేయలేదా? ఇక వంశధార-నాగావళి నదుల అనుసంధానం పనులు శరవేగంగా చేస్తున్నాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని వైఎస్సార్ హయాంలో ప్రారంభిస్తే ఇద్దరు సీఎంలు మారినా ఏ ఒక్కరూ పట్టించుకోకుండా గాలికొదిలేశారు.

బాబు, పవన్‌లకు ఎందుకంత కోపం..

విశాఖలో రాజధాని ఏర్పాటుచేస్తున్నామనే అక్కసుతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌లు రాద్ధాంతం చేస్తున్న తీరుచూస్తే ఉత్తరాంధ్ర ప్రజలపై ఎంత కోపం ఉందో అర్థమవుతోంది. విశాఖలో పవన్, శ్రీకాకుళం జిల్లాలో బాబు ఒకేరోజు సందర్శించి ప్రాజెక్టులపై దుష్ప్రచారం చేస్తే ప్రజలు నమ్ముతారనుకోవడం వారి అవివేకం. తెలంగాణ రాష్ట్రం విడిపోవడానికి కారణం జగన్ అని అనడం చాలా హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రం విభజనకు చంద్రబాబే సహకరించి ఇప్పుడు ఏమీ తెలియనట్లు యాక్టింగ్ చేస్తున్నాడు. ఇక విద్యుత్, గ్యాస్, పెట్రోలు, నిత్యావసర ధరల పెంపు దేశవ్యాప్తంగా ఉన్నాయా ఒక్క ఏపీలోనే ఉన్నాయా అనేది ప్రజలందరూ గమనించాలి.

ఏపీ విద్యాసంస్కరణలపై తెలంగాణ ఆసక్తి

- ఐటీ విధానాలను పరిశీలించిన టీఎస్ అధికారులు
- ఆన్‌లైన్ అటెండెన్స్, యాప్స్, డిజిటల్ బోధనను తెలుసుకున్న వైనం



తెలంగాణ అధికారులకు ఏపీ విద్యా సంస్కరణలు, ఐటీ వినియోగంపై వివరిస్తున్న రాష్ట్ర అధికారులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలను అందిపుచ్చుకునేందుకు తెలంగాణ ఆసక్తి చూపుతోంది. గత నాలుగేళ్లుగా మన విద్యాశాఖలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని వినియోగించి అనేక విజయాలు సాధించారు. విద్యార్థి దినచర్యను పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రిన్సిపల్ కార్యాదర్శి, ముఖ్యమంత్రి వరకు పరిశీలించేలా ఏర్పాట్లు చేశారు. దీంతోపాటు బడిబయటి పిల్లలను ట్రాక్ చేయడంలో సాధించిన విజయాలు, మధ్యాహ్న భోజనం అమలు తీరును తెలంగాణ అధికారులు పరిశీలించారు. ఇటీవల ఏపీకి వచ్చిన తెలంగాణ సమగ్ర శిక్ష అధికారులు ఇక్కడి అధికారులతో సమావేశమై ఐటీ వినియోగంతో సాధించిన విజయాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఉన్న 58,685 పాఠశాలలు, 70.64 లక్షలమంది విద్యార్థులు, మూడులక్షలకు పైగా ఉపాధ్యాయులను నూరుశాతం పర్యవేక్షిస్తున్న తీరుకు ఫిదా అయ్యారు. ముఖ్యంగా స్కూల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (సిమ్స్) ద్వారా పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయులను ఒక్కటి చేయడాన్ని అడిగి తెలుసుకున్నారు. యాప్స్ ద్వారా విద్యార్థుల హాజరు తీసుకోవడం, అదే సమయంలో మధ్యాహ్న భోజనం చేసేవారి సంఖ్యను లెక్కించడం, పాఠశాల ప్రాంగణంలోనే ఉపాధ్యాయుల హాజరును ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా నమోదు చేయడాన్ని అభినందించారు. రాష్ట్ర స్థాయిలో రియల్ టైమ్ గవర్నెన్స్ అమలును తమ రాష్ట్రంలోను ప్రవేశపెట్టేందుకు ఆసక్తి చూపించారు.

సిమ్స్, యాప్స్ పనితీరును వివరించిన అధికారులు

విద్యాశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కూల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (సిమ్స్), దానికి అనుసంధానంగా కీలక విభాగాలకు మొబైల్ యాప్స్ రూపకల్పన ద్వారా విద్యార్థి ట్రాకింగ్‌ను ఏపీ సమగ్ర శిక్ష అధికారులు తెలంగాణ అధికారుల బృందానికి వివరించారు. ఇందులో ప్రధానంగా స్కూల్ ఇన్ఫర్మేషన్ విభాగంలో పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం అమలు, చేస్తున్న మార్పులను నమోదు చేస్తారు. టీచర్స్ ప్రొఫైల్‌లో వారి హాజరు, ఎస్‌వోసీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సెలవులు, గ్రీవెన్స్ వంటివి, విద్యార్థుల విభాగంలో ఆధార్ నంబరు ఆధారంగా విద్యార్థి పాఠశాలలో ఉన్నారా, బడిబయట ఉన్నారా అని ట్రాకింగ్ చేసి, గ్రామ, వార్డు కార్యదర్శుల ద్వారా వివరాలు సేకరించి వారిని తిరిగి బడిలో చేరుస్తున్నారు. ఇలా గత విద్యాసంవత్సరంలో సుమారు లక్షమంది పిల్లలను తిరిగి బడిలో చేర్చారు. ఐటీ సంస్కరణలతో తక్కువ కాలంలోనే వేగవంతమైన విజయాలు నమోదు చేయడాన్ని తెలంగాణ అధికారులు అభినందించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రతి పాఠశాలను, విద్యార్థిని ప్రతిరోజు పర్యవేక్షించడం, వారి పనితీరును తెలుసుకోవడాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీటిలో కొన్నింటిని తెలంగాణలోను అమలు చేయాలని నిర్ణయించారు. గతంలో మన రాష్ట్ర ప్రభుత్వం 'మనబడి: నాడు-నేడు' పథకాన్ని ప్రవేశపెట్టి సాధించిన విజయాన్ని పరిశీలించిన తెలంగాణ అధికారులు వారి రాష్ట్రంలో 'మన ఊరు-మన బడి' పేరుతో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు.

అది బాబు వదిలేసిన పార్కే..

సాక్షి, అమరావతి: మెగా సీడ్ పార్క్ అంటూ చంద్రబాబునాయుడు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఏడాదిన్నర అధికారంలో ఉన్నా ప్రాజెక్టుకు పైసా కూడా విదల్చలేదు. ఆయన వేసిన వేల శంకుస్థాపన శిలాఫలకాల్లో ఇదీ ఒకటిగా మిగిలిపోయింది. అయినా ఏనాడూ నోరుమెదపని రామోజీరావు ఈ పార్కును జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ విషప్రచారానికి ఒడిగట్టారు. ఓ అబద్ధాల కథనాన్ని ఈనాడు అచ్చేసింది. విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతన్న చేయి పట్టుకొని నడిపిస్తున్న ప్రభుత్వంపై బురదజల్లుతూ ఈ కథనం వండివార్చింది. వాస్తవాలేమిటో ఒక్కసారి పరిశీలిద్దాం.

సాధారణంగా పంటల సాగు కోసం బ్రీడర్ సీడ్ నుంచి ఉత్పత్తి చేసిన ఫౌండేషన్ సీడ్‌ను రైతులకు ఇచ్చి వారి ద్వారా రాష్ట్ర అవసరాలకు తగినట్టుగా విత్తనోత్పత్తి చేస్తుంటారు. ఇలా ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తికి రాష్ట్రంలో తొమ్మిది సీడ్ ఫామ్స్ ఉన్నాయి. వీటి ద్వారా 70 వేల క్వింటాళ్ల ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి చేస్తారు. ఈ సీడ్‌ను రైతులకు అందజేసి అవసరమైన విత్తనాన్ని తయారు చేస్తారు. ఏటా 10 లక్షల క్వింటాళ్ల వరి, వేరుశనగ, కందులు, శనగలు, చిరు ధాన్యాల విత్తనాలను తయారు చేసి రైతులకు అందజేస్తున్నారు.

ఇలా ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి చేసే ఫామ్స్‌లో కర్నూలు జిల్లా తంగడంచ సీడ్ ఫామ్ ఒకటి. 630 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సీడ్ ఫామ్‌లో స్థానికంగా డిమాండ్ ఉన్న కందులు, శనగల ఫౌండేషన్ సీడ్‌ను రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి చేస్తున్నారు. ఇదే ప్రాంగణంలో రూ.670 కోట్లతో మెగా సీడ్ పార్కు నిర్మించాలని చంద్రబాబు ప్రభుత్వం సంకల్పించింది. పైసా విదల్చకుండానే 2017 అక్టోబర్‌లో హడావుడిగా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఏడాదిన్నర పాటు అధికారంలో ఉన్నప్పటికీ దీనిని పట్టించుకోలేదు. అయితే ఈ తంగడంచలోని సీడ్ పార్కును వివిధ పంటల హైబ్రిడ్ సీడ్ మూల విత్తన ఉత్పత్తి క్షేత్రంగా రూపొందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వాస్తవాలు ఇలా ఉంటే ఈ పార్కు కోసం 2018లోనే అప్పటి ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిందంటూ ఓ పెద్ద అబద్ధాన్ని ఈనాడు అచ్చేసింది. నిజంగా నిధులు కేటాయించి ఉంటే శంకుస్థాపన చేసిన తర్వాత ఏడాదిన్నర పాటు అధికారంలో ఉన్న బాబు ఎందుకు గాలికొదిలేశారో రామోజీకే తెలియాలి.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

- హైకోర్టులో టీడీపీ నేతలు దేవినేని ఉమా, నల్లారి కిషోర్ పిటిషన్లు
- పూర్తి వివరాల సమర్పణకు సోమవారానికి విచారణ వాయిదా



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఉసిగొల్పి పోలీసులపై దాడి చేయించి గాయపరిచిన వ్యవహారంలో తమపై అన్నమయ్య జిల్లా, ముదివీడు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన వేర్వేరు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ నేతలు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు విచారణ జరిపారు. పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ టీడీపీ నేతల దాడిలో దాదాపు 30 మంది పోలీసులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అందువల్ల తనకు ఈ కేసులకు సంబంధించిన వివరాలు తెలుసుకునే అవకాశం లేకపోయిందన్నారు. పూర్తి వివరాలను తెలుసుకుని కోర్టు ముందుంచేందుకు విచారణను వాయిదా వేయాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ విచారణను 14కి వాయిదా వేశారు. కాగా, ఈలోపే పిటిషనర్లను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందువల్ల సోమవారం వరకు పిటిషనర్లకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని దేవినేని ఉమా, కిషోర్ కుమార్‌రెడ్డి తరపు న్యాయవాదులు హైకోర్టును అభ్యర్థించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి సోమవారం వరకు పిటిషనర్లను అరెస్ట్ చేయవద్దని ఏఏజీ సుధాకర్‌రెడ్డికి మౌఖికంగా స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే..ఇదే వ్యవహారంలో తనపై ముదివీడు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ నేత పులవర్తి నాని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కూడా హైకోర్టు సోమవారం విచారణ జరపనుంది.

తదుపరి చర్యలు నిలిపివేయండి

మార్గదర్శిపై రిజిస్ట్రార్ల బహిరంగ నోటీసు విషయంలో హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ చిట్ గ్రూపుల మూసివేత నిమిత్తం అభ్యంతరాలను ఆహ్వానిస్తూ చిట్ రిజిస్ట్రార్లు జారీ చేసిన బహిరంగ నోటీసు విషయంలో తదుపరి చర్యలు నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని చిట్ గ్రూపుల మూసివేత ఉత్తర్వులను సవాలు చేస్తూ చందాదారులు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో మూసివేత ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని గుర్తు చేసింది. అభ్యంతరాలను ఆహ్వానిస్తూ తాజాగా జారీ చేసిన నోటీసు ఆధారంగా తదుపరి చర్యలేమైనా తీసుకుంటే అది చందాదారులను తీవ్రంగా ప్రభావితం చేయడమే కాక, మార్గదర్శిపై తీవ్ర ప్రభావం చూపుతుందని హైకోర్టు తెలిపింది. చందాదారులు దాఖలు చేసిన వ్యాజ్యంతో మార్గదర్శి యాజమాన్యం దాఖలు చేసిన ఈ వ్యాజ్యాలను జత చేస్తున్నట్లు తెలిపింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, చిట్ రిజిస్ట్రార్లను ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలు, నిధుల మళ్లింపు జరిగినట్లు నిర్ధారణకు వచ్చిన చిట్ రిజిస్ట్రార్లు చిట్ గ్రూపుల మూసివేతకు అభ్యంతరాలను ఆహ్వానిస్తూ ఇటీవల బహిరంగ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ మార్గదర్శి యాజమాన్యం వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య మధ్యంతర ఉత్తర్వులపై తన నిర్ణయాన్ని వాయిదా వేశారు. శుక్రవారం ఆయన తన నిర్ణయాన్ని వెలువరించారు.



అన్ని కోరికలను వదిలి, అహంకార మమకారాలు వీడి సంచరించే పురుషుడు శాంతిని పొందుతాడు.
– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 12 ఆగస్టు 2023

మణిపూర్‌కు దక్కిందేమిటి?

గత మూడు నెలలుగా అత్యంత ఘోరమైన, దారుణమైన పరిణామాలను చవిచూస్తున్న మణిపూర్ రాష్ట్రంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉండిపోయారని ఆరోపిస్తూ లోక్‌సభలో విపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానం గురువారం వీగిపోయింది. మోదీ వాక్పటిమ గురించి ఎవరికీ సందేహాలు లేవు. ఆయన రెండు గంటల పది నిమిషాల సుదీర్ఘ ప్రసంగం మరోసారి ఆ విషయాన్ని రుజువు చేసింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు తొలగి, ఆయన సభకు రావటం అటు విపక్షాలతోపాటు ఇటు అధికార పక్షానికి కూడా కలిసొచ్చింది. విపక్ష స్వరం దీటుగా వినబడటానికి రాహుల్ దోహదపడితే... ఆయనపైనా, కాంగ్రెస్‌పైనా నిప్పులు చెరిగేందుకు అధికారపక్షానికి అవకాశం చిక్కింది. అయితే క్షతగాత్రగా మారిన మణిపూర్‌కు ఏమాత్రం సాంత్వన చేకూర్చామన్నది ఇరుపక్షాలూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సివుంది. ఇది గతంలో అనేకమార్లు సభలో చర్చకొచ్చిన అవిశ్వాస తీర్మానాలవంటిది కాదు. రాఫెల్ ఒప్పందంలో అవినీతి దాగుందంటూ 2018లో విపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాసంతో కూడా దీన్ని పోల్చలేం. ఇది యావత్తు సమాజమూ సిగ్గుతో తలదించుకోవాల్సిన దురదృష్టకర ఉదంతాల పర్యవసానంగా చర్చకొచ్చిన అవిశ్వాస తీర్మానం. మణిపూర్‌లో దాదాపు అంతర్యుద్ధ పరిస్థితులేర్పడటం, పరస్పరం భౌతిక దాడులు చేసుకోవటం, నివాసాలు తగలబెట్టుకోవటంతో మొదలై... చివరకు మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టే హీన స్థితికి చేరుకోవటం చరిత్రలో కనీవినీ ఎరుగనిది. ఊళ్లకు ఊళ్లే ఖాళీ చేసి ప్రజలు చెట్టుకొకరూ, పుట్టకొకరూ కావటం, అలా వెళ్లలేనివారిని సాయుధ మూకలు చిత్రవధ చేయటం, పోలీసులే తమ కస్టడీలో ఉన్న మహిళలను సాయుధ గుంపులకు అప్పగించాన్న ఆరోపణలు రావటం మామూలు విషయం కాదు. ఈ హింసాపర్వం మొదలై మూడు నెలలు దాటుతున్నా ఇప్పటికీ అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనకపోవటం, పోలీసులూ, కేంద్ర బలగమైన అస్సాం రైఫిల్స్ పరస్పరం నిందారోపణలు చేసుకోవటం దిగ్భ్రాంతికరం. ఆఖరికి లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై ప్రధాని జవాబిస్తున్న సమయంలో కూడా మే 3 నాటి మరో దారుణ ఉదంతం వెలుగులోకొచ్చింది. ఒక మహిళపై సామూహిక అత్యాచారం జరిపి, ఆమె ఇంటిని తగులబెట్టారన్నది ఆ ఉదంతం సారాంశం. ఇప్పటికీ స్వస్థలాలకు వెళ్లే సాహసం చేయలేనివారు వేలాదిమందివుంటే, వెళ్లినవారు భయాందోళనల్లో మునిగి తేలుతున్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను సంజాయిషీ ఇచ్చుకునేలా చేయటంలో అవిశ్వాస తీర్మానం బ్రహ్మాస్త్రం వంటిది. అందునా రాక్షసమూకల కొమ్ముకాసిందన్న ఆరోపణలెదుర్కొంటున్న మణిపూర్ సర్కార్‌పై కఠిన చర్యలు తీసుకోవటంలో తాత్సారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని తూర్పారబట్టడానికి దీనికి మించిన ఆయుధం లేదు. మూడురోజులపాటు ఇరుపక్షాల నేతలూ ప్రసంగించారు. అయితే ఆ వాగ్దాటి హోరులో మణిపూర్ విషాదం మరుగున పడిందన్న అభిప్రాయం ఏర్పడింది. ప్రధాన అంశాన్ని మరిచి సవాళ్లూ, ప్రతిసవాళ్లూ, అర్థరహితమైన ఆరోపణలూ విసురుకుంటూ రెండు పక్షాలూ కాలక్షేపం చేశాయి. వర్తమాన దుఃస్థితికి గతంలో పాలించిన కాంగ్రెసే కారణమని అధికారపక్షం అంటే... కేంద్ర బలగాలను ఉద్దేశపూర్వకంగానే వినియోగించుకోలేదనీ, అందువల్లే ఇంతటి హింస చెలరేగిందనీ విపక్షాలు ఆరోపించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మణిపూర్ గురించి సవివరమైన ప్రకటనే చేశారు. అమిత్ షాయే మాట్లాడతారని మొదటినుంచీ అధికారపక్షం చెబుతోంది. కాదు, ప్రధానే మాట్లాడాలన్నది విపక్షం డిమాండ్. ప్రధాని సుదీర్ఘ ప్రసంగంలో మణిపూర్ ప్రస్తావన వచ్చింది. దుండగులపై చర్య తీసుకుంటామని, శాంతి నెలకొల్పుతామన్న హామీ కూడా ఇచ్చారు. ఈశాన్యానికి తమ హృదయంలో కీలక స్థానమున్నదని చెప్పారు. మణిపూర్ మహిళలతో భుజం భుజం కలిపి నడుస్తామన్నారు. కానీ ఇది మాత్రమే సరిపోతుందా? అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్న మణిపూర్ ప్రజానీకానికి ఈ సభావేదిక నుంచి సహానుభూతి ప్రకటిస్తూ, ఈ ఉదంతాలు పునరావృతం కానీయబోమనీ, దోషులను కఠినంగా దండిస్తామనీ వాగ్దానం చేస్తూ ఏకగ్రీవ తీర్మానం ఆమోదించివుంటే దాని ప్రభావం వేరుగా ఉండేది. వారి పునరావాసానికి అవసరమైన పథకాలు ప్రకటిస్తే బాగుండేది. అధికార పక్షం వీటిని విస్మరించిందనుకున్నా ప్రతిపక్షం మాత్రం చేసిందేమిటి? ప్రధాని ప్రసంగం పూర్తిగా వినకుండానే వాకౌట్ చేసింది.

అధికార పక్షానికి తిరుగులేని మెజారిటీ ఉన్న సభలో అవిశ్వాసం చివరికేమవుతుందో అందరికీ తెలుసు. అయినా ఆ సందర్భంగా జరిగే చర్చలను ప్రజానీకం ఆసక్తిగా గమనిస్తుంది. విపక్షం ఏయే అంశాలపై అధికారపక్షాన్ని నిలదీస్తున్నదో, వాటికి అధికారపక్షం ఏం చెబుతున్నదో తెలుసుకోవటమే ఆ ఆసక్తిలోని ఆంతర్యం. ఆ సందర్భంగా ఎవరి మంచిచెడ్డలేమిటో బేరీజు వేసుకుంటారు. ముఖ్యంగా మణిపూర్ ప్రజలూ, ఈశాన్య రాష్ట్రాల ప్రజానీకం తమకు జరగబోయే న్యాయం గురించి ఆలోచిస్తారు. కానీ రాబోయే సార్వత్రిక ఎన్నికలు, అందులో గెలుపోటములే చర్చల్లో ప్రధానంగా వినబడ్డాయి. ఇది సరైందేనా? మణిపూర్ విషాదంపై సుప్రీంకోర్టు ఇప్పటికే చొరవ తీసుకుని లైంగిక హింసపై సాగే సీబీఐ దర్యాప్తు పర్యవేక్షణకు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమించింది. పునరావాసం, పరిహారం, ఆవాసాల, ప్రార్థనామందిరాల పునర్నిర్మాణం తదితర అంశాలను పర్యవేక్షించేందుకు ముగ్గురు రిటైర్డ్ మహిళా న్యాయమూర్తులతో కమిటీ ఏర్పరిచింది. తనవంతుగా చేయబోయేదేమిటో కేంద్రం ప్రకటిస్తే ఈ అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు అర్థవంతమైన ముగింపు ఉండేది.

ప్రకృతి హిత జీవనమే పరిష్కారం

విశ్లేషణ



దొంతి నరసింహారెడ్డి

ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల భారీ వరదలు వచ్చి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించడం సాధారణ దృశ్యం అయ్యింది. ఇందుకు నానాటికీ పెరిగిపోతున్న కాలుష్యమే అసలు కారణం. ఈ కాలుష్యానికి అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న ప్రకృతి విధ్వంసమే హేతువని సైన్స్ చెబుతోంది. భూ స్వరూపాలను ఇష్టమొచ్చినట్లు మార్చడం, పేరాశతో సహజవనరులను విచక్షణారహితంగా వినియోగించడం, ప్రకృతి నియమాలకు ఎదురీదాలని ప్రయత్నించడం నేటి కరువులకూ, వరదలకూ అసలైన కారణాలని అధ్యయనాలు చెబుతున్నాయి. సహజ ప్రకృతి నియమాలకు అనుగుణంగా మనిషి జీవించడం ఒక్కటే ప్రకృతి విపత్తుల నుంచి బయటపడడానికి ఉన్న ఏకైక పరిష్కారం.

వాతావరణ మార్పులు, పెరుగుతున్న విపరీతమైన వాతావరణ సంఘటన వల్ల గత 50 ఏళ్లగా ప్రకృతి వైపరీత్యాలు పెరుగు తున్నాయి. ఇవి పేద దేశాలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ), యూఎన్ ఆఫీస్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ సంస్థలు చెబుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వరదలు వస్తున్న వార్తలు ఇటీవల ఎక్కువగా చూస్తున్నాం. ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒకే రోజు పడే వర్షం ఎక్కువగా ఉండడం వాతావరణంలో వచ్చిన మార్పుల పరిణామం. అందులో అనుమానం లేదు. వాతావరణంలో విపరీత మార్పులకు మానవ కార్యకలాపాల నుంచి ఉద్భవించిన కాలుష్య ఉద్గారాలు కారణం. కర్బన ఉద్గారాల వల్ల భూమి ఉష్ణోగ్రత పెరిగి, సముద్ర జలాలు, గాలి, మంచు వంటి వాటిమీద దుష్ప్రభావం పడుతోంది. వరదలు నివారించాలంటే కాలుష్యం తగ్గించడమే ఉత్తమమైన మార్గం. అంటే, మానవులు ఏర్పరచుకున్న 'శక్తి' వనరులలో తీవ్రమైన, సత్వర మార్పులు చేస్తేనే కాలుష్యం తొందరగా తగ్గుతుంది. ఈ విధంగా చూస్తే వరదలకు 'స్థానిక' కారణాలు ఉన్నట్టు అనిపించదు. ఎందుకంటే, కాలుష్యం ఒక భౌగోళిక పరి ణామం కాబట్టి.

చైనాలో వరదల బీభత్సం ఈ మధ్య ఎక్కువ అయ్యింది. ఈ ఏడాదే దాదాపు 3 కోట్ల మంది ప్రజలు వరదల బారిన పడ్డారు. బీజింగ్‌లో 2012లో సంభవించిన వరదల్లో 79 మంది ప్రాణాలు కోల్పోయిన తరువాత తీవ్రమైన వర్షాల నుంచి రక్షించడానికి చైనా ఇటీవలి సంవత్సరాల్లో బిలియన్ల డాలర్లను పెట్టుబడి పెట్టింది. అధ్యక్షుడు జిన్‌పింగ్ 'స్పాంజ్‌ల వంటి నగరాలను' నిర్మించాలని పిలుపునిచ్చారు. మిద్దె తోటలు, నీరు ఇంకే ఫుట్‌పాత్‌లు, భూగర్భ నిల్వ ట్యాంకులు, ఇతర స్పాంజ్ లాంటి వ్యవస్థలను ఉపయోగించి భారీ వర్షపాతాన్ని ఇంకే విధంగా చేసి, తరువాత నెమ్మదిగా నదులు లేదా జలాశయాల్లోకి విడుదల చేయడం. చైనాలో వరదల నివారణకు 'స్పాంజి' నగరాల కార్యక్రమం చేపట్టినా ఫలితం కానరాలేదు. ప్రకృతి సహజంగా చేసే 'స్పాంజి' పని... మానవ నిర్మిత వ్యవస్థల ద్వారా సాధ్యం కాదు అని రుజువు అయ్యింది.

భారత దేశంలో అనేక రాష్ట్రాలలో ఈ మధ్య కాలంలో ప్రతి ఏటా వరదలు వస్తున్నాయి. కోస్తా నగరాలైన ముంబాయి, చెన్నైల్లో వస్తున్న వరదలు అక్కడి భౌగోళిక పరిస్థితుల్లో తీవ్ర మార్పుల వల్ల సంభవిస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. బెంగళూరు, హైదరాబాద్ నగరాలలో చెరువులు, వరద నీటి కాలువలు, నదులు కబ్జా కావడం వల్ల వరదలు వస్తున్నాయి.

2023 జులైలో లోక్‌సభలో కేంద్ర మంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా ఇచ్చిన సమాచారం గమనించదగింది. 'కేంద్ర జల కమిషన్' ప్రకారం గత మూడేళ్లగా (2020, 2021, 2022) దేశంలో 465 తీవ్రమైన, అతి తీవ్రమైన వరదలు సంభవించాయి. ఈ సంవత్సరం కూడా



వరదలు పెరిగాయి. 23 రాష్ట్రాలలో అత్యధికంగా బిహార్ (99), ఉత్తర ప్రదేశ్ (75), అసోం (60)లలో తీవ్రమైన, అతి తీవ్రమైన వరదలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో 18, తెలంగాణలో 14 వచ్చాయి. ఈ ఏడు హిమాచలప్రదేశ్, హరియాణాల్లో తీవ్రమైన వరదలు వచ్చాయి.

అయితే, సాధారణ వర్షాలకే వరదలు రావడానికి స్థానిక పరిస్థితులే కారణం. అధిక వర్షాల సంగతి చెప్పనవసరం లేదు. వరదల తీవ్రత, నష్టం పెరగడానికి స్థానిక వనరుల విధ్వంసం ప్రధాన కారణం. నీటి వనరులైన నదులు, వాగులు, తటాకాల 'సరిహద్దులను' మనం చెరిపేస్తే, వాటి సామర్థ్యం మనం రకరకాలుగా తగ్గిస్తే, నీరు ఒలుకుతుంది. చెరువులు, కుంటలు, వాగుల ఆక్రమణల వల్ల వాటి సామర్థ్యం తగ్గిస్తున్నాం. మన నెత్తి మీద పడి, మన కాళ్ళ కింద ప్రవహించే నీటిని ఒడిసిపట్టుకునే సహజ వ్యవస్థను 'అభివృద్ధి' పేరిట నాశనం చేసి, నీళ్ళ కొరకు పెద్ద ఆనకట్టలు కట్టి నీటి సరఫరా 'సుస్థిరం' చేసుకుంటున్నాం అనే భ్రమలో మనం ఇప్పటికీ ఉన్నాము. ఇక్కడ పడ్డ నీటిని వదిలిపెట్టి, ఎక్కడో వాటిని ఆపి, ఆ నీటిని పైపుల ద్వార సరఫరా చేస్తూ, విద్యుత్ వినియోగిస్తూ, అది ఆధునికతగా భావిస్తూ తరిస్తున్నాము. కాగా, ఈ అసహజ నీటి వ్యవస్థ కారణంగా ప్రకృతి దెబ్బతిని కుదేలు అయితే ఆ నష్టం భరి స్తున్నది ఎవరు? చిన్న ప్రవాహాలను నిర్లక్ష్యం చేసి, నదులుగా మారిన తరువాత అడ్డు కట్టలు కట్టి మనం ఉపయోగించే నీటికి 'విలువ' పెరుగుతుంది. ఎందుకంటే పెట్టుబడికి, నిర్వహణకు ఖర్చు అయ్యింది కనుక. ఈ 'విలువ' పెంచిన నీరు రకరకాల కారణాల వల్ల కొందరికే అందుతుంది. సామాజిక అసమానతలకు కారణం అవుతుంది.

కొండల వెంబడి నీరు జాలువారడానికి అనువుగా ప్రకృతి ఏర్పరుచుకున్న దారులను మనం రోడ్ల కొరకు నాశనం చేస్తే, కొండ చరియలు పడడం చూస్తున్నాము. కొండలు, గుట్టల మీద సహజ కవచంగా ఉండే చెట్లు, అడవి, గడ్డి తదితర పచ్చదనాన్ని మనం హరిస్తే మట్టి కొట్టుకుని పోయి, నీటి వేగానికి, ప్రవాహానికి 'సహజ' అడ్డంకులు ఉండవు.

వరద నీరు తగ్గినప్పుడు ప్రభావిత ప్రాంత భూములలో సాధారణంగా పూడిక బురదతో నిండి ఉంటాయి. ఈ రకమైన అవశేషాలు పోషకాలతో నిండి ఉండి ఆ ప్రాంతంలోని రైతులకు వ్యవసాయానికి ప్రయోజనం చేకూర్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి అంతటా లేదు. కొన్ని చోట్ల వరద... ఉన్న సారవంతమైన భూమిని కోసేస్తే, ఇంకొక చోట ఇసుకను నింపుతున్నది. పట్టణాల నుంచి వచ్చిన వరద అనేక రకాల కలుషితాలను వదిలిపెడుతున్నది. కొండ ప్రాంతం నుంచి మైదానాలకు వచ్చే వరద బండ రాళ్ళు, చెట్టు కొమ్మలు, ఈ మధ్య కార్లు, మోటార్ సైకిళ్ళు, ఇండ్లు, ఇండ్ల గోడలు, సిమెంటు కట్టడాల అవశేషాలను కూడా తీసుకువస్తున్నది. వరద నీటిలో తమ 'పాపాలను' (వ్యర్థాలు, కాలుష్య జలాలు) పడేసే పరిశ్రమలు కూడా ఉన్నాయి.

పశువులు సాధారణంగా నీళ్ళలో ఈదగలవు. కాని, వేగంగా ప్రవహించే వరదలో చాల మటుకు అవి చనిపోతుంటాయి. అసలు పాడి పశువుల సంఖ్య తగ్గిపోతున్న క్రమంలో పశువుల మరణాల గురించి ఆలోచించేందుకు ఆధునిక సమాజం సిద్ధంగా లేదు. వరదలు చేసే ఆస్తి నష్టం వల్ల పేదలు ఇంకా పేదరికంలోకి నెట్టబడుతున్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, పైపులైన్లు, విద్యుత్ స్తంభాలు తదితర ప్రజా ఆస్తులకు హాని కలిగి ప్రభుత్వ నిధుల మీద భారం పెరుగుతున్నది.

వరదల నివారణకు భూమి వినియోగం మీద అధ్యయనం చాలా అవసరం. ప్రకృతిలో, భూమితో ముడిపడి ఉన్న నీటి సహజ చక్రాలను అర్థం చేసుకోవాలి. నదులు పుట్టే ప్రదేశంలో అర్థరహిత కాంక్రీటికరణ చేటు చేస్తున్నది. గోదావరి నది పుట్టే నాసిక్ నగరంలో ఇట్లా చేసి నాలుక కరుచుకున్నారు. హైదరాబాద్‌కు నీటిని అందించే మూసీ నది పరివాహక ప్రాంతం, ముఖ్యంగా అనంతగిరి కొండలలో ఉన్న అడవి నాశనం వల్ల, కింది ప్రాంతాలలో వరద ముప్పు పెరుగుతున్నది. చెరువులు వరద నివారణకు ఉపయోగపడతాయి. కాని, వాటిని దుర్వినియోగపరుస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కొల్లేరు సరస్సు విధ్వంసం వల్ల చుట్టూ పరిసర ప్రాంతాలలో వరద ముప్పు పెరుగుతున్నది. తూర్పు కనుమల ద్వార ప్రవహించే అనేక నదులు బంగాళాఖాతంలో కలుస్తాయి. కానీ, వాటి పరివాహక ప్రాంతంలో మైనింగ్ వల్ల, అడవుల నరికివేత వల్ల వరద ముప్పు పెరిగింది. శారద నది, రుషికుల్య తదితర నదులు మైదాన ప్రాంతాలలో, కోస్తాలో ప్రమాదకరంగా మారడానికి మానవ ప్రకృతి విధ్వంసకర కార్యకలాపాలే.

ఇప్పటికైనా ప్రభుత్వాలు చేసిన, చేస్తున్న, చేయబోతున్న కార్యక్రమాలు, నిర్మాణాలను సమీక్ష చేసి, వరద నివారణకు, వరద ముప్పు తగ్గించటానికి సుస్థిర ప్రణాళికలు చేపట్టాలి. ఆలస్యం మరింత వినాశనానికి కారణమవుతుందనే సంగతి మరువరాదు.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు । 90102 05742

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త ఎత్తు



ఐపీసీ (ఇండియన్ పీనల్ కోడ్) స్థానంలో వస్తున్న కొత్త బిల్లుల పేర్లు హిందీలో ఉండటం గమనించాను. ఇలాగే రాజ్యాంగాన్ని మార్చుతారు (=నాశనం చేస్తారు). యథార్థంలో హిందీని జాతీయ భాషను చేస్తారు.

– సుహాస్ పల్షీకర్, ప్రొఫెసర్

పాత్ర చరిత్ర



ఇండియా, అమెరికాల్లోని కొన్ని మీడియా సంస్థలను చైనా ధనం ఎలా ప్రభావితం చేస్తున్నదో వెల్లడికావడం ఆశ్చర్యం కలిగించలేదు. ఇక్కడి కొన్ని పక్షాలను విషపూరితం చేయడంలో చైనాకు సుదీర్ఘ చరిత్ర ఉంది.

– హిందోల్ సేన్‌గుప్తా, కాలమిస్ట్

విశ్రాంతి కావాలి



మావీ (హవాయి)కి రావొద్దు. మీ సెలవు ప్లాన్లను రద్దు చేసుకోండి. ప్రాణాలతో బయటపడ్డవాళ్లకు హోటల్ గదులు కావాలి. మాకు దుఃఖం నుంచి కోలుకునే సమయం ఇవ్వండి. (అమెరికా కార్చిచ్చు నేపథ్యంలో.)

– కనియేలా ఇంగ్, యూఎస్ మాజీ శాసనసభ్యుడు

కొత్త తిరుగుబాటు



చాలా దేశాలు సైనిక తిరుగుబాట్లను ఎదుర్కొన్నాయి. ఇండియాలో మాత్రం 'న్యాయవ్యవస్థ తిరుగుబాటు' జరిగింది. చట్ట సంబంధ అంశాల్లో పార్లమెంటుకు ఉన్న ఆధిపత్యాన్ని లేకుండా చేసి, రాష్ట్రపతి చేతిలోని న్యాయమూర్తుల ఎంపిక అధికారాన్ని 1993లో న్యాయవ్యవస్థ తీసుకుంది.

– దిలీప్ మండల్, సంపాదకుడు

పేర్లెందుకు?



నిజంగా మీరు ఆరోగ్యకరమైనవి తినడానికి సులభమైన చిట్కా ఏమిటంటే, బ్రాండ్ల పేర్లతో ఉన్నవి ఏవీ తినొద్దు.

– పాల్ గ్రాహమ్, శాస్త్రవేత్త

రెండో రాజధాని అర్హతలున్న నగరం

అభిప్రాయం



డా॥ టి. హనుమాన్ చౌదరి

హైదరాబాద్‌కు దేశ రెండవ రాజధానిగా ఉండడానికి ఉన్న అర్హతల గురించి ఏఐఎమ్ఐఎమ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రజల దృష్టికి తెచ్చినందుకు అభినందనీయులు. అయితే ఆయన ప్రతిపాదాత్మకంగా ఈ విషయాన్ని ప్రస్తావించలేదనుకోండి. భారతదేశ రాజ్యాంగ నిర్మాత, హైదరాబాద్ సచివాలయం సమీపంలో అత్యంత ఎత్తైన విగ్రహ రూపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అప్పట్లోనే భారతదేశ రెండవ రాజధానిగా హైదరాబాద్‌ను అభివర్ణించారు. 'భారతదేశంలో ఎప్పుడూ రెండు రాజధానులు ఉంటూవచ్చాయి. మొఘలాయిల కాలంలో అవి ఢిల్లీ, శ్రీనగర్– శీతాకాలంలో ఢిల్లీ, వేసవిలో శ్రీనగర్. బ్రిటిష్‌వాళ్ల కాలంలో– కలకత్తా, సిమ్లా; ఆ తర్వాత ఢిల్లీ, సిమ్లా... నేను హైదరాబాద్‌ను ఆదర్శవంతమైన ప్రదేశంగా గుర్తించాను. హైదరాబాద్, సికింద్రాబాద్, బొల్లారంలను ఒక చీఫ్ కమిషనర్ల ప్రావిన్స్ (ఇప్పటి కేంద్ర పాలిత ప్రాంతం)గా ఏర్పాటు చేసి, భారతదేశానికి రెండవ రాజధానిగా చేయాలి. భారతదేశానికి ఒక రాజధానిగా అన్ని అవసరాలను హైదరాబాద్ తీరుస్తుంది. ఇది అన్ని రాష్ట్రాలకు సమాన దూరంలో ఉంది... ఢిల్లీలో ఉన్న అన్ని సౌకర్యాలూ హైదరాబాద్‌లో ఉన్నాయి. ఢిల్లీ కంటే కూడా ఎంతో మెరుగైన నగరం ఇది.' (శేష్‌రావ్ చవాన్ రాసిన 'ది మేకర్స్ ఆఫ్ ఇండియన్ కానిస్టిట్యూషన్ – మిత్ అండ్ రియాలిటీ' నుంచి.)


సైబరాబాద్, దాని అద్భుతమైన భవనాల కారణంగానే కాకుండా హైదరాబాద్‌ను తమ నివాసంగానూ, కార్యక్షేత్రంగానూ మలచుకున్న రకరకాల వ్యక్తుల కారణంగానూ అది అంతర్జాతీయ నగరంగా మారింది. హైదరాబాద్ నడిబొడ్డులో మయన్మార్ రోహింగ్యాలు, నైజీరియా దేశస్థులు, పాకిస్తానీయులు, బంగ్లాదేశీయుల వంటి అంతర్జాతీయ సమాజాలవారిని ఇక్కడి జనం ఉదారంగా సమాదరిస్తున్నారు. ఇప్పుడు 'హబ్సిగూడ' అని పిలుస్తున్న ప్రాంతంలో నిజాంకాలంలోనే ఇథియోపియా నుంచి వచ్చినవారు స్థిరపడ్డారు. అదే కాలంలో అరబ్బులు బార్కాస్ (బ్యారక్స్) అని ఇవ్వాళ పిలుస్తున్న ప్రాంతంలో స్థిరపడ్డారు. అంబేడ్కర్ కాలం నుంచే హైదరాబాద్‌ను భారతదేశానికి రెండవ రాజధానిని చేయడానికి కావలసిన అర్హతలు ఉన్నాయని గుర్తిస్తుండగా... ఇప్పుడు కేటీ రామారావు వంటి వ్యక్తుల కృషి కారణంగా హైదరాబాద్ నిజమైన 'విశ్వనగరం'గా మారింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం హైదరాబాద్‌ను భారతదేశానికి రెండవ రాజధానిగా చేయడానికి చర్యలు ప్రారంభించడానికి ఇది సరైన సమయం. భారతదేశానికి హైదరాబాద్ రెండవ రాజధానిగా ఉండాలనే అంబేడ్కర్ ప్రతిపాదనను నిజం చేసేందుకు ఏఐఎమ్ఐఎమ్ ఎంపీ పాటుపడాలి.

దేశ రక్షణను, సమగ్రతను కాపాడటానికి బ్రిటిష్ వారు దేశంలోని వివిధ ప్రాంతాల్లో సాయుధ దళాలను మోహరించి 50కి పైగా కంటోన్మెంట్లను స్థాపించారు. దురదృష్టవశాత్తు, కొన్ని విచ్ఛిన్నకర శక్తులు ప్రాంతీయ పార్టీల రూపంలో క్రియాశీలం అవుతున్నాయి. ఈ పరిణామం కూడా హైదరాబాద్‌లో రెండవ రాజధాని ఉండాలనే వాదనను బలపరుస్తోంది. అలాగే భారత సమగ్రతను నిరంతరం కంటికి రెప్పలా కాపాడే సెంటినెల్స్‌గా కంటోన్మెంట్‌లను కూడా ఉన్నతీకరించాలి.

వ్యాసకర్త 'ప్రజ్ఞా భారతి' ఛైర్మన్

హరిత భవిష్యత్తుకు యువతే సారథి

సందర్భం



బండారు దత్తాత్రేయ

మన భూమిని పది కాలాలపాటు పచ్చగా ఉంచడంలో యువత పాత్ర అంతా ఇంతా కాదు. మత్తుమందులు, సామాజిక సమస్యలు, పేదరికం, నిరుద్యోగిత వంటి అనేక సవాళ్లను ఎదుర్కోవడంలోనూ వీరు ప్రధాన భూమిక పోషించగల సత్తా ఉన్నవారు. ఇందుకు వారికి తగిన మానవీయ విలువలు, నైపుణ్యం, జ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే అందరి ప్రయోజనం కోసం యువత సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడం వీలవుతుంది. యువశక్తిని గరిష్ఠంగా వాడుకోవడంలోనే దేశ అభివృద్ధి దాగి ఉంది. యువత తప్పుదారి పడితే దాని ఫలితాలను సమాజం అనుభవించాల్సి ఉంటుంది.

ఈ ఏడాది అంతర్జాతీయ యువజన దినోత్సవం (ఆగస్టు 12) 'గ్రీన్ స్కిల్స్ ఫర్ యూత్: టువార్డ్స్ సస్టెయినబుల్ వరల్డ్' అన్న థీమ్‌తో జరుగుతోంది. ఏమిటీ గ్రీన్ స్కిల్స్? 'సుస్థిరమైన, వనరులను సమర్థంగా వినియోగించుకోగలిగిన సమాజాన్ని తయారు చేసేందుకు ఉపయోగపడే జ్ఞానం, సామర్థ్యం, విలువలు, వైఖరులు.' యువతకు ఈ గ్రీన్ స్కిల్స్ అందించడం వల్ల భవిష్యత్తులో రాగల పర్యావరణ అనుకూల పరిశ్రమల్లో ఉద్యోగాలు చేసేందుకు సిద్ధంగా ఉంటారు. ప్రకృతి పరిరక్షణ విషయంలో బాధ్యతగా వ్యవహరించేందుకూ అవకాశాలేర్పడతాయి. ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు కూడా యువతకు గ్రీన్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడం, బోధన, వనరులతో వారిని సన్నద్ధులు చేయడంలో కీలకపాత్ర పోషించవచ్చు. వాతావరణ మార్పులు, వనరుల కొరత, పర్యావరణ అసమతౌల్యం వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకూ ఈ గ్రీన్ స్కిల్స్ అత్యవసరం.

గ్రీన్ స్కిల్స్ రంగంలో ఉద్యోగావకాశాలకు ఆకాశమే హద్దు. ఉదాహరణకు పునరుత్పాదక ఇంధన టెక్నాలజీలు. సౌర, పవన, జల విద్యుదుత్పత్తితోపాటు ఇతర వనరులకు సంబంధించిన జ్ఞానం, నైపుణ్యాలు కలిగి ఉండటం సుస్థిర మౌలిక సదుపాయాల నిర్మాణానికి కీలకం. ఈ టెక్నాలజీల్లో శిక్షణ పొందిన యువత వాటి డిజైనింగ్, ఏర్పాటు, నిర్వహణ వంటి అనేక రంగాల్లో కొత్త ఉద్యోగాలు చేయవచ్చు. విద్యుత్తును అత్యంత సమర్థంగా వాడుకునే విధానాలు, టెక్నాలజీలపై అవగాహన కూడా వేర్వేరు రంగాల్లో (రవాణా, భవంతులు) కర్బన ఉద్గారాలు, విద్యుత్తు పొదుపు సాధించే అవకాశాలను కల్పిస్తుంది.

ప్రకృతి వనరుల వినియోగంలో యువతకు తగిన నైపుణ్యాలు లభిస్తే వ్యవసాయం, అటవీకరణ, సాగునీటి నిర్వహణ మెరుగ్గా జరిగే సుస్థిరాభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది. వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ విషయాల్లోనూ యువతకు సాధికారత కల్పించడం అవసరం. వీటి ద్వారా మాత్రమే వారు తమ తమ సమాజాల్లో వ్యర్థాల నిర్వహణకు సమర్థమైన, వినూత్నమైన పరిష్కారాలు కనుగొనగలరు.



ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత దేశం కర్బన ఉద్గారాలను 2030 నాటికల్లా స్థూల జాతీయోత్పత్తిలో 45 శాతానికి తగ్గించాలనీ, 2070 నాటికి సున్నాస్థాయికి చేర్చాలనీ పనిచేస్తూండటం ఆనందాన్ని ఇచ్చే విషయం. 2023–24 బడ్జెట్‌లోనూ ఇందుకు సంబంధించి ఎన్నో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. పర్యావరణ అనుకూల ఇంధన వనరులవైపు దేశం వేగంగా మళ్లుతూండటం ఈ నిర్ణయాలకు నిదర్శనం. ఉదాహరణకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, గ్రీన్ హైడ్రోజన్ విభాగాల మంత్రిత్వ శాఖ కర్బన ఉద్గారాలను సున్నాస్థాయికి చేర్చేందుకు, పర్యావరణ అనుకూల ఇంధనాలవైపు మళ్లేందుకు ఉపయోగించేందుకు రూ.35,000 కోట్లు ప్రయారిటీ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద కేటాయించింది. ఇందులో రూ.19,700 కోట్లు శిలాజ ఇంధనాల దిగుమతులను తగ్గించేందుకు వీలుగా కొత్త ఇంధన వనరుల వాడకం కోసం ఖర్చు చేస్తారు. అలాగే 400 మెగావాట్/గంటల విద్యుత్తును నిల్వ చేసే భారీ బ్యాటరీలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా ప్రభుత్వం మద్దతిస్తోంది. గోబర్‌ధన్ పథకం కింద 500 వేస్ట్ టు వెల్త్ (వ్యర్థాల నుంచి విలువను రాబట్టడం) ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయనున్నారు.

యువత అన్ని అడ్డంకులను తొలగించుకుని భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో పని చేయాలి. స్వామి వివేకానంద చెప్పినట్లు, యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ రెండింటి కోసమే ప్రధాని నరేంద్ర మోదీ ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రకటించారు. 'సంపద పోతే ఏమీ నష్టం లేదు. ఆరోగ్యం నశిస్తే ఎంతో కొంత నష్టం జరిగినట్లే. వ్యక్తిత్వాన్ని కోల్పోతే మాత్రం సర్వం నష్టపోయినట్లే' అన్న నానుడిని ఇక్కడ గుర్తు చేయదలచుకున్నాను. పూర్తి ఆత్మ విశ్వాసంతో, జాతీయభావాలతో కూడిన యువత మనకు అసలైన సంపద. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వ్యక్తిత్వ నిర్మాణానికి ప్రయత్నాలు జరగాలి. మన యువతను పచ్చని, సానుకూల మార్పు తీసుకువచ్చే వారిగా తీర్చిదిద్దాలి.

వ్యాసకర్త హరియాణా గవర్నర్
(నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం)

అనుసరణ

లౌకిక జీవితం అంటేనే కర్మఫలాల అనుభవాల పరంపర అంటుంది సనాతన వేదాంత సంప్రదాయం. పుట్టిన వాళ్ళందరూ ఏవేవో కర్మలు – మంచివీ, చెడ్డవీ చేస్తూ ఉంటారు. అనంతరం ఆ కర్మల ఫలితాలు– సుఖమో, దుఃఖమో అనుభవిస్తూ ఉంటారు.

మనిషి తన బుద్ధి ప్రేరేపించినట్టుగా నడుస్తాడు. అతగాడు తన పూర్వ కర్మల దుష్ట ఫలాన్ని అనుభవించాల్సిన సమయం వచ్చినప్పుడు, అతడి బుద్ధి కూడా దానికి అనుగుణంగా ప్రసరిస్తుంది. అన్నీ తెలిసి కూడా, ఏ దుష్ట గ్రహమో నెత్తిన కూర్చొని నడుపుతున్నట్టుగా, వెర్రిమొర్రి నిర్ణయాలు తీసుకొని, దుఃఖకరమైన పరిణామాలుండే చర్యలను చేజేతులా చేపడ తాడు. సత్కర్మ ఫలాలు అనుభవించవలసిన సమయం వచ్చినప్పుడు, ఆ బుద్ధే, తనను ఏ శుభగ్రహమో పట్టి నడుపుతున్నట్టు, మేలు కలిగించే మంచి ఆలోచనలతో, సుఖానికి దారి తీయగల పనులు చేయిస్తుంది. అందు చేత, సమయం వచ్చినప్పుడు, బుద్ధి కూడా సాధారణంగా కర్మానుసారంగానే మనిషిని ముందుకు తోస్తుంది. కాబట్టి 'బుద్ధిః కర్మానుసారిణీ' అంటారు.



జ్యోతిర్మయం

అదొక్కటే కాదు. సత్యానుసారిణీ లక్ష్మీః, కీర్తిః త్యాగానుసారిణీ, అభ్యాససారిణీ విద్యా, బుద్ధిః కర్మానుసారిణీ అని ఈ లోకోక్తిలో నాలుగు పాదాలు. లక్ష్మి అంటే అన్ని విధాల ఐశ్వర్యమూ, అదృష్టమూ. ఇది సత్య సంధత కలవాడినే అనుసరిస్తుంది. సత్యమేవ జయతే. త్యాగ బుద్ధి కలవాడు లోకంలో చక్కని యశస్సును పొందుతాడు. కనక కీర్తి అనేది త్యాగబుద్ధి గలవాడిని అనుసరించి ఉంటుంది. ఇక విద్య అంటారా, అది 'అభ్యాససారిణి'. అభ్యాసాన్ని ఆశ్రయించి ఉంటుంది. అభ్యాసం అంటే ఆవృత్తి. అంటే ఒక పనిని మళ్ళీ మళ్ళీ చేయడం, ఒక పాఠాన్ని మళ్ళీ మళ్ళీ అధ్యయనం చేయడం, ఒక విషయాన్ని మళ్ళీ మళ్ళీ చింతన చేయడం. ఏ విద్యయినా చక్కగా 'అభ్యసించే' వాడికే అబ్బుతుంది.

చివరిగా బుద్ధిః కర్మానుసారిణీ. పూర్వ కర్మ ఎలా ఉన్నదో, దాని ఫలితంగా మనిషి ఏ కష్టాలూ, సుఖాలూ అనుభవించాల్సి ఉందో, దానికి అనుగుణంగా, ఆ దిశగా మనిషి బుద్ధి మనిషిని నడుపుతుంది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.8.03 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** మృగశిర ఉ.8.34 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** సా.5.30 నుండి 7.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.44 నుండి 7.27 వరకు, **అమృతఘడియలు:** రా.11.28 నుండి 1.10 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.45, **సూర్యాస్తమయం:** 6.25.

తిరుమలలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఆయనకు పద్మావతి అతిథిగృహం వద్ద టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఘన స్వాగతం పలికారు. జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

నేడు మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో శనివారం ఓ మోస్తరు వర్షాలు కురవనున్నాయి. సగటు సముద్రమట్టానికి 4.5 కి.మీ.ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడి పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై ఆంధ్రప్రదేశ్ తీరానికి ఆనుకుని ఉంది. దీనికి తోడు సముద్రమట్టానికి 0.9 కి.మీ.ల ఎత్తులో ఒక ద్రోణి అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు కొనసాగుతున్నది. వీటి ఫలితంగా కోస్తాంధ్ర, రాయలసీమల్లో శనివారం కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆది, సోమవారాల్లో ఆయా ప్రాంతాల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు సంభవించవచ్చని, గంటకు 30–40 కి.మీ.ల వేగంతో గాలులు వీస్తాయని వివరించింది. మరోవైపు రాష్ట్రంలో సాధారణం కంటే 3–5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, దీంతో ఉష్ణతాపం, ఉక్కపోతతో పాటు అసౌకర్య వాతావరణం నెలకొంటుందని పేర్కొంది.

కావాలనే ఇరికించారు.. బెయిల్ ఇవ్వండి

- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పిటిషన్లు
- సీబీఐకి న్యాయస్థానం నోటీసులు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో తమను సీబీఐ కావాలనే ఇరికించిందని, తమకు బెయిల్ ఇవ్వాలని వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సీబీఐ కోర్టు తమ బెయిల్ పిటిషన్లను కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్యకేసులో దర్యాప్తు పూర్తయిందని, సీబీఐ అభియోగ పత్రాన్ని కూడా దాఖలు చేసిందని తెలిపారు. ఈ కేసులో పిటిషనర్లను అక్రమంగా ఇరికించారని, వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు కోర్టుకు సమర్పించలేదన్నారు. ఇప్పటికే 5 నెలలకు పైగా జైలులో ఉన్నారని, భాస్కర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని చెప్పారు. పలుమార్లు జైలు అధికారులు ఆస్పత్రుల్లో ఆయనకు పరీక్షలు కూడా నిర్వహించారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేశారు.

నేను టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నా

- టీడీపీ నేత నారా లోకేశ్

సాక్షి, నరసరావుపేట: 'టీడీపీ కార్యకర్తలను లోకేశ్ రెచ్చగొడుతున్నాడు అని వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. అవును అది నిజమే... నేను మా కార్యకర్తలను రెచ్చగొడుతున్నాను. మేం అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ వాళ్లకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం' అని టీడీపీ నాయకుడు నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా శుక్రవారం పల్నాడు జిల్లా క్రోసూరులో బహిరంగ సభ నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ 'నాలుగేళ్లుగా మాపై దొంగ కేసులు పెట్టారు. మా పార్టీ ఆఫీసులపై దాడులు జరిగాయి. చంద్రబాబుపై రాళ్లదాడులు జరుగుతున్నాయి. మేం ఊరుకునే ప్రసక్తే లేదు. అందరి వీడియోలు, ఫొటోలు ఉన్నాయి. అధికారంలోకి రాగానే మీ పని చెబుతాం. పొరపాటున కూడా మా జోలికి రాకండి... వస్తే జరిగే పరిణామాలకు సీఎం జగన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది...' అని చెప్పారు.

కనపడటంలేదా వ్యవ'సాయం'?

వాస్తవాలు తెలిసి కూడా ఈనాడు అబద్ధాలు



సాక్షి, అమరావతి: తొలకరి వర్షాలు కాస్త ఆలస్యం కావడంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలుకు చర్యలు చేపట్టింది. రైతుల డిమాండ్ల మేరకు 80 శాతం రాయితీపై వారు కోరుకున్న విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో రైతులకు జరుగుతున్న మేలు చూసి రామోజీకి కడుపులో మంట మొదలైంది. 'ఎండ మండి.. మొలక ఎండుతోంది' అంటూ రైతులను గందరగోళ పర్చేలా ఈనాడు ఓ కథనాన్ని అచ్చేసింది. సత్యదూరమైన ఆరోపణలు చేసింది. వాస్తవాలేమిటో ఒక్కసారి పరిశీలిద్దాం.

ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపకల్పన

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో (జూన్ నెలలో) ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా వ్యవసాయంపై సమీక్షించారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపకల్పనపై ఆదేశాలు జారీ చేశారు. ఆర్బీకే, మండల స్థాయి వ్యవసాయ సలహా మండళ్ల ద్వారా గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితులు, లోటు వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాల మేరకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను రూపొందించారు. లోటు వర్షపాతం కారణంగా బెట్ట పరిస్థితులున్న ఏడు జిల్లాల్లో 80 శాతం రాయితీపై విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. అవసరమైన చోట లేట్ ఖరీఫ్ కింద రైతులు ఇతర పంటలను సాగు చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అనంతపురం, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం, సత్యసాయి, వైఎస్సార్ జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న మండలాల్లో ఆర్బీకేల ద్వారా విత్తన సరఫరాకు ఏర్పాట్లు చేశారు. రైతుల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు మినుము 400 క్వింటాళ్లు, పెసర 3,200 క్వింటాళ్లు, కంది 1,000 క్వింటాళ్లు, ఉలవలు 53,000 క్వింటాళ్లు, అలసందలు 1,900 క్వింటాళ్లు, కొర్రలు 500 క్వింటాళ్లు చొప్పున మొత్తం 60 వేల క్వింటాళ్ళ విత్తనాలను సిద్ధం చేశారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటే ప్రత్యామ్నాయ పంటలకు మారడానికి రైతులు ఆగస్టు చివరి వారం వరకు వేచి చూస్తుంటారు. ఈలోగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే సంప్రదాయ పంటలను సాగు చేస్తారు. లేదంటే ప్రత్యామ్నాయ పంటలు వేస్తారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ముందస్తుగానే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు చేస్తోంది. ఆర్బీకేల్లో నమోదు చేసుకున్న రైతులకు ఈ నెల 20 నుంచి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేయనుంది.

ఆ 4 జిల్లాల్లో విత్తన పంపిణీకి శ్రీకారం

జూలై నెలలో అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని మళ్లీ పంట వేసుకునేందుకు సిద్ధపడిన రైతులను ఆర్బీకేల ద్వారా గుర్తించారు. వారి జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. ఇంకా ఎవరైనా ముందుకొస్తే వారి పేర్లను కూడా నమోదు చేసేందుకు అవకాశం కల్పించారు. వారు కోరుకున్న విత్తనాన్ని 80 శాతం రాయితీ పంపిణీ చేస్తోంది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతుల కోసం 2,804 క్వింటాళ్ల వరి విత్తనాలను అవసరమని గుర్తించారు. ఇప్పటి వరకు 895 క్వింటాళ్ల విత్తనాన్ని ఆర్బీకేల్లో సిద్ధం చేయగా, 773 క్వింటాళ్ల విత్తనాన్ని రైతులకు పంపిణీ చేశారు.

రైతులకు శిక్షణ

మరో వైపు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నిలదొక్కుకొని మంచి దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అధికారులు, శాస్త్రవేత్తలతో ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు కూడా ఎన్జీ రంగా వ్యవసాయ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో పంటల ప్రణాళికల అమలులో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది.

కామాంధులకు 20ఏళ్ల జైలు, జరిమానా

ముగ్గురికీ కఠిన శిక్షలు విధిస్తూ న్యాయస్థానాల తీర్పు



వివరాలు వెల్లడిస్తున్న మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు(లీగల్)/పార్వతీపురంటౌన్/అనంతపురం: కామంతో కళ్లు మూసుకుపోయి వేర్వేరు ప్రాంతాలకు చెందిన అభం శుభం తెలియని చిన్నారులపై లైంగికదాడికి పాల్పడిన ముగ్గురు కామాంధులకు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయస్థానాలు శుక్రవారం సంచలన తీర్పునిచ్చాయి. వివరాల్లోకి వెళితే.. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం జిల్లెల గ్రామానికి చెందిన పెరుమాళ్ల వెంకటేశ్వర్లు కుమార్తె (17) నంద్యాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతూ హాస్టల్‌లో ఉండేది. 2019 నవంబర్ 12వ తేదీన కళాశాల నుంచి ఇంటికి వచ్చిన కుమార్తెను భయపెట్టి మధ్యాహ్నం సమయంలో ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. పదిరోజుల అనంతరం తన తండ్రి చేసిన అఘాయిత్యం గురించి తల్లికి చెప్పింది. దీంతో తల్లి, కుమార్తె నందివర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి వెంకటేశ్వర్లుపై ఫోక్సో చట్టం, ఐపీసీ 376 కింద కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో కర్నూలు జిల్లా ఫోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి ముద్దాయికి 20 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా కొత్తవలసలోని ఓ పాఠశాలలో నాలుగోతరగతి చదువుతున్న చిన్నారిని విడిచిపెట్టి తల్లి ఎటో వెళ్లిపోయింది. చిన్నారి ఐరన్ షాపులో పనిచేస్తున్న తండ్రి వద్దనే ఉంటూ చదువుకుంటోంది. 2022 సంవత్సరం జూలై నెలలో చిన్నారి ఇంట్లో నిద్రిస్తున్నప్పుడు కసాయి తండ్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారం రోజుల తరువాత చిన్నారి పుట్టినరోజు సందర్భంగా నిందితుడు కేక్ తెచ్చాడు. దీంతో చిన్నారి తన స్నేహితురాలిని ఇంటికి ఆహ్వానించింది. బాధితురాలితో పాటు ఆమె స్నేహితురాలు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిద్రపోతుండగా ఇద్దరిపైనా కసాయి తండ్రి లైంగికదాడికి యత్నించాడు. చిన్నారులు ప్రతిఘటించడంతో తీవ్రంగా కొట్టాడు. విషయాన్ని బాధితురాలి స్నేహితురాలు తన తల్లికి చెప్పింది. వెంటనే ఆమె ఇద్దరు బాలికలను తీసుకెళ్లి రెండు ఘటనలపైనా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి పార్వతీపురం డీఎస్పీ ఎ.సుభాష్ కేసు నమోదు చేశారు. రెండు కేసుల్లోనూ నేరం రుజువు కావడంతో ఎస్సీ, ఎస్టీ ఫోక్సోకోర్టు ఇన్‌చార్జి జడ్జి షేక్‌సికిందర్ భాషా ముద్దాయికి ఒక్కో కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. బాధిత చిన్నారులు ఒక్కొక్కరికీ రూ.4 లక్షల నష్ట పరిహారాన్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ వివరాలను పార్వతీపురం మన్యం జిల్లాఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. అదే విధంగా శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల గ్రామంలో తల్లిదండ్రులతో కలసి 13 ఏళ్ల బాలిక ఉండేది. 2019 ఆగస్టు 7వ తేదీన తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో పూజారి ఈశ్వరయ్య అనే వ్యక్తి బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రులు గోరంట్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. ముద్దాయిపై అభియోగాలు రుజువు కావడంతో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష , రూ.5 వేల జరిమానా విధిస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లా ఫోక్సో కోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు.

సెర్ప్ ఎఫ్‌టీఈ ఉద్యోగుల వేతనాలు పెంపు

సాక్షి,అమరావతి: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో పనిచేసే ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయీస్ (ఎఫ్‌టీఈ)ల వేతనాలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పొదుపు కార్యక్రమాల్లో మహిళలకు చేదుడు వాదోడుగా ఉంటూ పనిచేసే కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ల (సీసీ)తో సహా వివిధ స్థాయిల్లో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగులు ఈ పరిధిలోకి వస్తారు. సెర్ప్‌లో ఒకటి నుంచి ఐదు క్యాడర్లలో పనిచేసే మొత్తం 4,569 మంది ఎఫ్‌టీఈ ఉద్యోగులు లబ్ధి పొంద నున్నారు. ఇప్పటి దాకా ఆయా ఉద్యోగులు అందుకుంటున్న మూల వేతనంపై 23 శాతం అదనంగా కలిపి అందజేస్తారు. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

పార్లమెంటు స్థానాలకు రిటర్నింగ్ ఆఫీసర్ల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాలకు రిటర్నింగ్ ఆఫీసర్లు (ఆర్‌వో), అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులను జారీ చేశారు. 25 పార్లమెంటు నియోజకవర్గాలకు ఆయా జిల్లా కలెక్టర్లను రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమించారు. అరకు పార్లమెంటరీ నియోజకవర్గం రెండు జిల్లాలకు విభజించినప్పటికీ రిట ర్నింగ్ ఆఫీసర్‌గా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ వ్యవహరించనున్నారు. అలా గే పార్లమెంటు నియోజకవర్గంలోని శాసన సభ స్థానాల పరిధిలోని ప్రాజెక్టు ఆఫీస ర్లు, జాయింట్ కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు ఆర్‌డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లల్లో ఒక రిని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమిస్తూ మరో ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుదుత్పత్తిని ఆపేయండి

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని వదిలేస్తుండటం వల్ల రెండు రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని కృష్ణా బోర్డుకు బుధవారం ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి లేఖ రాశారు. తక్షణమే విద్యుదుత్పత్తిని ఆపేసేలా తెలంగాణ జెన్‌కోను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కృష్ణాబోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ తక్షణమే విద్యుదుత్పత్తిని నిలిపేయాలని తెలంగాణ జెన్‌కోను ఆదేశించారు. కృష్ణాబేసిన్‌లో ఈ ఏడాది సగటు వర్షపాతం కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేయడాన్ని ఎత్తిచూపారు. దాంతో కృష్ణానదిలో నీటిలభ్యత తగ్గుతుందని, ఆ మేరకు శ్రీశైలం ప్రాజెక్టులోను లభ్యత తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టులో ఉన్న నీటిని సంరక్షించుకుని తాగు, సాగునీటి అవసరాల కోసం వాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇకపై ఎడమగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేయవద్దని తెలంగాణ జెన్‌కోను ఆదేశించారు. కానీ.. తెలంగాణ జెన్‌కో కృష్ణా బోర్డు ఆదేశాల భేఖాతరు చేస్తూ శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ఎడమగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 38,140 క్యూసెక్కులను దిగువకు వదలేస్తుండటం గమనార్హం.

ఎర్రచందనం.. ఎనీటైమ్ ప్రొటెక్షన్

- బొటానికల్ గార్డెన్‌లో ప్రయోగాత్మకంగా 50 చెట్లకు చిప్‌ల అమరిక
- వివరాలు వెల్లడించిన టీఎస్ఎఫ్‌డీసీ వైస్‌చైర్మన్, ఎండీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



బొటానికల్ గార్డెన్‌లో ఎర్రచందనం చెట్టుకు రియల్ టైం చిప్

గచ్చిబౌలి : ఖరీదైన ఎర్రచందనం చెట్లను పరిరక్షించేందుకు అధునాతన పరికరం (రియల్‌టైం ప్రొటెక్షన్ చిప్) అందుబాటులోకి వచ్చింది. నగరంలోని బొటానికల్ గార్డెన్‌లో ప్రయోగాత్మకంగా చిప్ సెట్లు అమర్చినట్టు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) వైస్‌చైర్మన్, ఎండీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో విలేకరుల సమావేశంలో అధునాతన టెక్నాలజీని ఆయన వివరించారు. బొటానికల్ గార్డెన్‌లో 10 వేల ఎర్రచందనం మొక్కలు ఉన్నాయని, మొదటి విడతలో 50 ఎర్రచందనం చెట్లకు రియల్ టైం ప్రొటెక్షన్ చిప్‌లు అమర్చామని పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన సీబీఐఓటీ టెక్నాలజీస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. చిప్‌ల అమరికతో దొంగల నుంచి ఎర్రచందనం చెట్లను రక్షించుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసే వీలుంటుందన్నారు. సీబీఐఓటీ సీఈఓ సత్యనారాయణ చొప్పదండి మాట్లాడుతూ ఎర్రచందనం చెట్ల రక్షణకు తమ సంస్థ ఇండియన్ ఉడ్ సైన్స్ టెక్నాలజీస్(ఐడబ్ల్యూఎస్‌టీ) సహకారంతో సరికొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఈ టెక్నాలజీని ఐడబ్ల్యూఎస్‌టీతో పాటు ఢిల్లీ ఐకార్, బెంగళూరు, ఝాన్సీ నగరాల్లో వాడుతున్నట్టు వివరించారు సెన్సార్ కేసింగ్ (యాంటినో)తో అనుసంధానం చేయడంతో మొబైల్ ఫోన్‌లోనే చెట్ల రక్షణ వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఎవరైనా చెట్టును కొట్టేందుకు ప్రయత్నించినా చిప్ సెట్ సాయంతో అలారం మోగుతుందన్నారు. ఒక్క సెన్సార్ కేసింగ్‌తో కిలోమీటరు దూరంలో ఉన్న 500 చెట్లకు చిప్‌లను అమర్చుకోవచ్చన్నారు. అధికగాలి, జంతువుల రాపిడిని గుర్తించే విధంగా చిప్ సెట్ ఉంటుందన్నారు. ప్రతిరోజూ రాత్రి చెట్టుకు సంబంధించిన సమాచారాన్ని సర్వర్‌కు చేరవేస్తుందన్నారు. చెట్టును కొట్టాలని చూస్తే అలారం మోగుతుందని, చెట్టు ఎక్కడ ఉందనే వివరాలు ఫోన్‌కు చేరవేసి మ్యాప్ ద్వారా డైరెక్షన్ చూపిస్తుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి బ్యాటరీ మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో టీఎస్ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్, డైరెక్టర్ అక్బర్, ఎకో టూరిజం ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిప్ పనితీరు ఇలా..

రియల్‌టైం ప్రొటెక్షన్ చిప్ సెన్సార్ పరికరం 3.6 వాల్ట్స్ లిథియమ్ ఇయాన్ బ్యాటరీతో పనిచేస్తుంది. ఎర్రచందనం చెట్లను ఎవరైనా నరికినా, దొంగిలించేందుకు ప్రయత్నించినా క్షణాల్లోనే మొబైల్ అప్లికేషన్స్, వాట్సాప్‌లకు అలర్ట్స్ పంపిస్తుంది. చెట్ల వద్ద ఉన్న హూటర్ ఎలక్ట్రానిక్ సైరన్ మోగిస్తుంది. వెంటనే అప్రమత్తమై చెట్లను రక్షించుకోవచ్చు.మొబైల్ అప్లికేషన్స్‌తో క్లౌడ్ సర్వర్‌ను అనుసంధానం చేయడంతో యూజర్స్‌కు వివిధ రకాల నివేదికలు చేరవేస్తుంది.

26, 27 తేదీల్లో దళిత ఎజెండాపై జాతీయ సదస్సు

సాక్షి, న్యూఢిల్లీ: దళిత ఎజెండాపై జాతీయ సదస్సును ఈ నెల 26, 27 తేదీల్లో హైదరాబాద్ టూరిస్ట్ ప్లాజాలో నిర్వహించనున్నట్లు దళిత, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు తెలిపారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం మల్లేపల్లి లక్ష్మయ్య (సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్), రామచంద్ర డోమ్ (దళిత్ శోషణ్ ముక్తి మంచ్), బి.వెంకట్ (అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం), జీఎల్ గోరియా (భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్), వీఎస్ నిర్మల్ (అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం) తదితరులు విలేకరులతో మాట్లాడారు. యూజీసీ మాజీ చైర్మన్ థరూర్, మాజీ ఐఏఎస్ అధికారి రాజశేఖర్‌ల నాయకత్వంలో దళిత ఎజెండా కీ నోట్ రూపొందించి సదస్సులో సమర్పిస్తారని బి.వెంకట్ తెలిపారు.

'ఏఐ'పంట!



- కృత్రిమ మేధ తోడుగా ఆధునిక వ్యవసాయం
- చాట్ జీపీటీ ఆధారిత సాఫ్ట్‌వేర్లు, పరికరాలు అందుబాటులోకి..
- డ్రోన్లతో ఎరువులు, పురుగు మందులు చల్లడం నుంచి.. తెగుళ్లను గుర్తించడం దాకా..
- పంటలో తేమ శాతం నుంచి నాణ్యత, గ్రేడింగ్ దాకా..
- ఉత్తమ సాగు పద్ధతులు, మంచి మార్కెటింగ్ అవకాశాలు
- అత్యుత్తమ వంగడాలను సృష్టించేందుకూ తోడ్పాటు
- ఇప్పటికే రాష్ట్రంలో మిర్చి, పసుపు పంట నాణ్యత పరిశీలనకు ఏఐ యంత్రాల వినియోగం

కంచర్ల యాదగిరిరెడ్డి

నాగలి పోయి ట్రాక్టర్ వచ్చినప్పుడు.. యంత్రాలు సాగు చేస్తాయా? అన్నవాళ్లున్నారు. ట్రాక్టర్లకు హార్వెస్టర్లు, స్ప్రేయర్లు, ఇప్పుడు డ్రోన్లూ తోడవడంతో బాగున్నాయే అనుకున్నారు.

ఆధునిక యంత్ర పరికరాల రాకతో వ్యవసాయం కొంత పుంజుకున్నా.. తర్వాతి తరాలు మాత్రం వ్యవసాయం అంటే అమ్మో అంటున్నారు.

ఇలాంటి సమయంలోనే 'చాట్ జీపీటీ', దాని ఆధారితంగా మరిన్ని కృత్రిమ మేధ సాంకేతికతలు తెరపైకి వచ్చాయి. వ్యవసాయ రంగంపైనా ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే కొన్ని ఏఐ ఆధారిత పరికరాలు అందుబాటులోకి వచ్చాయి కూడా. మరి మొత్తంగా దీనివల్ల రైతులకు ఏం మేలు జరుగుతుంది? వ్యవసాయానికి ఏం ఒనగూరుతుంది? అంతిమంగా వచ్చేది లాభమా, నష్టమా? అన్న చర్చ సాగుతోంది.

దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఇప్పటికీ వ్యవసాయం వాటా దాదాపు 50 శాతంపైనే. కోట్లమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న రంగం ఇదే. అయితే రుతుపవనాలు, మార్కెట్ పరిస్థితులు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు లభించకపోవడం వంటి అనేక కారణాలతో వ్యవసాయం ఇప్పటికీ ఆశల జూదంగానే మిగిలిపోయింది. ప్రభుత్వం రకరకాల పథకాలు, లాభాలు చేకూరుస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు తక్కువే. ఈ కారణంగానే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు డ్రోన్లు, మెషీన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీల వాడకం మొదలైంది. అయితే గత ఏడాది విడుదలైన 'చాట్ జీపీటీ'ఈ ప్రస్థానాన్ని ఒక అడుగు ముందుకు తీసుకెళ్లిందని చెప్పాలి. మైక్రోసాఫ్ట్‌కు చెందిన అజ్యూర్ ఓపెన్ ఏఐ సర్వీస్ ద్వారా చాట్ జీపీటీ ఆధారంగా తయారైన 'జుగల్‌బందీ'చాట్ బోట్ వీటిలో ఒకటి. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వేర్వేరు సంక్షేమ, సహాయ పథకాల వివరాలను అందిస్తుందీ సాఫ్ట్‌వేర్. వాట్సాప్ ద్వారా కూడా అందుకోగల ఈ చాట్ బోట్ ఇంగ్లిషులో ఉన్న ప్రభుత్వ సమాచారాన్ని పది భాషల్లోకి అనువదించి మరీ అందిస్తూండటం విశేషం.

ఇంకేం చేయగలదు?

చాట్ జీపీటీ వంటి కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్లకు వ్యవసాయంతో ఏం పని? అని చాలామంది అనుకోవచ్చు. కానీ, దీని చేరికతో సాగు అన్ని రకాలుగా మెరుగవుతుందన్నది నిపుణుల అంచనా. సమాచారం ఎంత ఎక్కువగా ఉన్నా సెకన్లలో దానిని విశ్లేషించి రైతులకు ఉపయోగపడే కొత్త సమాచారాన్ని అందించగలగడం దీనితో సాధ్యం. నీరు, ఎరువులు, కీటకనాశనుల వంటి వనరులను అవసరమైనంత మాత్రమే వాడేలా చేయడం, పంట దిగుబడులు పెంచడంకోసం తోడ్పడగలదు. ఎప్పటికప్పుడు మారిపోయే వాతావరణాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన సలహా, సూచనలు ఇవ్వగలదు.

1 **ప్రిడిక్టివ్ అనాలసిస్:** వందేళ్ల వాతావరణ సమాచారం, మట్టి కూర్పు, పంటకు ఆశించే చీడపీడలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని.. వేసిన పంట ఎంత బాగా పండేది కచ్చితంగా చెప్పగలదు. దీన్నే ప్రిడిక్టివ్ అనాలసిస్ అంటారు. ఒకవేళ నష్టం జరిగే అవకాశముంటే దాన్ని వీలైనంత తగ్గించుకునే సూచనలూ అందుతాయి.

2 **గరిష్ఠంగా దిగుబడులు:** నేల, వాతావరణ పరిస్థితులకు తగ్గట్టు ఏ పంట వేస్తే గరిష్ఠ దిగుబడులు రాబట్టుకోవచ్చో గుర్తించగలదు. పంటల యాజమాన్య పద్ధతులను కూడా నిర్దిష్ట పరిస్థితులు, అవసరాలకు తగ్గట్టుగా సూచించగలదు. వేర్వేరు మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించి విశ్లేషించడం, సొంతంగా పంటల తాలూకు సిమ్యులేషన్లు తయారు చేసుకుని అత్యున్నత సాగు పద్ధతులు, పంటలను అంచనా వేయడం సాధ్యమవుతుంది. దీనిద్వారా పంట దిగుబడులు, వ్యవసాయ రంగ ఉత్పాదకత గణనీయంగా పెరిగే అవకాశం ఏర్పడుతుంది.

3 **ప్రిసిషన్ అగ్రికల్చర్:** జనరేటివ్ ఏఐ ద్వారా వ్యవసాయంలో వ్యర్థాలను గణనీయంగా తగ్గించగల ప్రిసిషన్ వ్యవసాయం సాధ్యమవుతుంది. ఉదాహరణకు పంట పొలం మొత్తం తిరిగే డ్రోన్లు కలుపును గుర్తిస్తే.. అతితక్కువ కలుపునాశనులతో వాటిని తొలగించే ప్లాన్‌ను ఏఐ అందివ్వగలదన్నమాట. అలాగే ఏయే మొక్కలకు నీరు అవసరం? వేటికి ఎండ కావాలన్న సూక్ష్మ వివరాలను కూడా ప్రిసిషన్ అగ్రికల్చర్ ద్వారా గుర్తించి అందించవచ్చు. ఉపగ్రహ ఛాయాచిత్రాలు, వాతావరణ సమాచారం, మట్టి కూర్పు వంటివన్నీ పరిగణించడం ద్వారా చేసే ప్రిసిషన్ అగ్రికల్చర్ ద్వారా ఖర్చులు తగ్గుతాయి. దిగుబడులు పెరుగుతాయి.

4 **కొత్త వంగడాల సృష్టి:** వాతావరణ మార్పుల నేపథ్యంలో కరువు కాటకాలు, వరదల వంటివి పెరిగాయి. ఈ ప్రతికూల పరిస్థితులను తట్టుకుని మనగలిగిన కొత్త వంగడాల అవసరం పెరిగింది. సంప్రదాయ పద్ధతుల్లో జరిగే పరిశోధనల ద్వారా ఈ వంగడాల సృష్టికి చాలా కాలం పడుతుంది. కానీ జనరేటివ్ ఏఐను ఉపయోగిస్తే.. అధిక దిగుబడులిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకోగల వంగడాలను వేగంగా సృష్టించడం సాధ్యమని నిపుణులు చెప్తున్నారు. జన్యు సమాచారాన్ని విశ్లేషించి ఏ రకమైన జన్యువులను తొలగిస్తే, చేరిస్తే లాభదాయకమో ఈ కత్రిమ మేధ సాఫ్ట్‌వేర్లు వేగంగా గుర్తించగలవు.

చాట్‌బోట్‌లు.. కాల్‌సెంటర్‌లు

భారత ప్రభుత్వం కూడా వ్యవసాయంలో జనరేటివ్ ఏఐ సామర్థ్యాన్ని గుర్తించింది. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ వాట్సాప్ ఆధారిత చాట్‌బోట్ ఒకదాన్ని సృష్టించే ప్రయత్నాల్లో ఉంది. బెంగళూరుకు చెందిన ఒక కంపెనీ సిద్ధం చేసిన 'కిసాన్ ఏఐ (కిసాన్ జీపీటీ)'ఇప్పటికే పది భారతీయ భాషల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు సంబంధిత కార్యక్రమాలు, పథకాల వివరాలను అందిస్తోంది. దీంతోపాటే దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకునేందుకు అవసరమైన సలహా, సూచనలు ఇస్తోంది. ప్రతినెలా కనీసం 40 వేల మంది రైతులు కిసాన్ ఏఐ ద్వారా లబ్ధి పొందుతున్నట్టు దాన్ని అభివృద్ధి చేసిన ప్రతీక్ దేశాయ్ తెలిపారు. వాధ్వానీ ఏఐ అనే స్వతంత్ర, లాభాపేక్ష లేని సంస్థ కూడా జనరేటివ్ ఏఐ సాయంతో రైతులకు వచ్చే సందేహాలను తీర్చేందుకు కిసాన్ కాల్‌సెంటర్ ఒకదాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉంది. వ్యవసాయ రంగ నిపుణుల అనుభవాన్ని జనరేటివ్ ఏఐతో అనుసంధానించేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు వాధ్వానీ ఏఐ తెలిపింది. డిజిటల్ గ్రీన్ పేరున్న అంతర్జాతీయ సంస్థ గూయీా ఏఐతో జట్టుకట్టి వాతావరణ మార్పులను తట్టుకునేలా రైతులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూండగా ఒడిశా వ్యవసాయ శాఖ 'అమాకృష్ ఏఐ'ద్వారా పంటల నిర్వహణలో రైతులకు సమాచారం అందిస్తోంది. ప్రభుత్వ పథకాల వివరాలు, నలభైకుపైగా వాణిజ్య, సహకార బ్యాంకులు రైతులకు అందించే రుణ పథకాల వివరాలను ఈ చాట్ బోట్ ద్వారా అందిస్తోంది.



తెలంగాణలో 'మిర్చి, పసుపు' పరికరాలు

మిర్చి, పసుపు పంటల్లో నాణ్యతను తేల్చేందుకు కృత్రిమ మేధ ఆధారిత పరికరాలను ఇప్పటికే వినియోగిస్తున్నారు. ఈ పంటలు ఏవైనా తెగుళ్లకు గురయ్యాయా? వాటిలోని రసాయనాల శాతం, రంగు, తేమ శాతం వంటి వాటిని నిమిషాల్లో తేల్చేస్తున్నారు. ఈ అంశాల ఆధారంగా మిర్చి, పసుపు పంటలకు గ్రేడింగ్ ఇస్తున్నారు. రైతులు తమ ఉత్పత్తులను త్వరగా మార్కెటింగ్ చేసుకోవడానికి, తగిన ధర పొందడానికి ఇది వీలు కల్పిస్తోంది.

క్లుప్తంగా...

నటి జయప్రదకు ఆరు నెలల జైలు శిక్ష



సాక్షి, చెన్నై: కార్మికుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని కార్మిక బీమా సంస్థకు చెల్లించకుండా మోసం చేసిన కేసులో సినీ నటి, మాజీ ఎంపీ జయప్రద సహా ముగ్గురికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ చెన్నై ఎగ్మూర్ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. జయప్రదకు గతంలో చెన్నైలోని రాయపేటలో 'జయప్రద థియేటర్ కాంప్లెక్స్'ఉండేది. చెన్నైకి చెందిన రామ్ కుమార్, రాజబాబు థియేటర్ నిర్వహణ వ్యవహారాలు చూసుకునేవారు. కొంతకాలం తర్వాత ఆ కాంప్లెక్స్‌ను మూసివేశారు. అయితే, సిబ్బంది నుంచి ఈఎస్ఐ రూపంలో వసూలు చేసిన సొమ్మును థియేటర్‌ను మూసివేసిన తర్వాత వారికి చెల్లించలేదు. దీంతో బాధితులు బీమా కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు బీమా సంస్థ చెన్నై ఎగ్మోర్ మేజిస్ట్రేట్ కోర్టులో సినిమా థియేటర్ యాజమాన్యానికి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేసింది. కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బును వారికి చెల్లించలేదని పేర్కొంది. దీనికి వ్యతిరేకంగా జయప్రద తదితరులు వేసిన పిటిషన్లను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఆ డబ్బును కార్మికులకు అందజేసేందుకు జయప్రద ముందుకు వచ్చినా బీమా సంస్థ అంగీకరించలేదు. విచారణ ముగియడంతో ఎగ్మోర్ మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం జయప్రద తోపాటు మరో ముగ్గురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

ఆర్ఎంపీలకు కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఆర్ఎంపీ) వైద్యులకి జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) కొత్త నియంత్రణలు విధించింది. ఫార్మా కంపెనీలు, వారి ప్రతినిధులు, వైద్య పరికరాల సంస్థల దగ్గర్నుంచి వైద్యులు, వారి కుటుంబ సభ్యులు ఎలాంటి కానుకలు, డబ్బులు, ఆతిథ్యం స్వీకరించకూడదని నిబంధనలు విధించింది. ఫార్మా కంపెనీలు ఇచ్చే పార్టీల్లో పాల్గొనడం, ప్రయాణ సదుపాయాలను తీసుకోవడం వంటివి చేయకూడదని పేర్కొంది. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు వృత్తిపరమైన బాధ్యతని కలిగి ఉంటూ ప్రవర్తించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆగస్టు 2నే ఈ నిబంధనల్ని జారీ చేసింది. అంతే కాదు ఫార్మా కంపెనీలు తయారు చేసే మందులు ఇతర పరికరాల వినియోగాన్ని ఆమోదిస్తూ ప్రకటనలివ్వకూడదంది.

మూక దాడికి మరణమే

మైనర్లపై అత్యాచారానికి సైతం మరణశిక్షే



ఐపీసీ, సీఆర్ పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లకు చెల్లుచీటీ	వాటి స్థానంలో భారతీయ చట్టాలు	తొలిసారిగా ఉగ్రవాదానికి నిర్వచనం	బ్రిటిష్ చట్టాలకు రాం రాం... ఇక స్వదేశీ 'న్యాయం'

ప్రస్తుత చట్టం	ప్రతిపాదిత చట్టం
ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)-1860	భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) బిల్లు-2023
క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్-1898	భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) బిల్లు-2023
ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-1872	భారతీయ సాక్ష్య (బీఎస్) బిల్లు-2023

న్యూఢిల్లీ: స్వతంత్ర భారత చరిత్రలోనే చరిత్రాత్మకమని చెప్పదగ్గ ఘట్టం శుక్రవారం లోక్ సభలో ఆవిష్కృతమైంది. బ్రిటిష్ వలస పాలన తాలూకు అవశేషాలుగా కొనసాగుతూ వస్తున్న మూడు కీలక నేర న్యాయ చట్టాలకు చెల్లు చీటీ పాడే దిశగా పెద్ద ముందడుగు పడింది. వాటి స్థానంలో స్వదేశీ చట్టాలను తెచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్ లు చరిత్రగా మిగలనున్నాయి. వాటి స్థానంలో పూర్తి భారతీయ చట్టాలు రానున్నాయి. ఈ మేరకు న్యాయ సంహిత బిల్లు- 2023, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిల్లు-2023, భారతీయ శిక్షా బిల్లు-2023లను కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్ సభలో ప్రవేశపెట్టారు. 'ప్రతిపాదిత చట్టాలు దేశ నేర న్యాయ వ్యవస్థను సమూలంగా మెరుగు పరుస్తాయి. ప్రతి భారతీయుని హక్కులను పరిపూర్ణంగా పరిరక్షించాలన్న స్ఫూర్తికే పెద్ద పీట వేస్తాయి' అని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు సమకాలీన అవసరాలు, వారి ఆకాంక్షలను తీర్చేందుకు అవసరమైన అన్ని మార్పుచేర్పులను కొత్త బిల్లుల్లో పొందుపరిచినట్టు వివరించారు. వాటిని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపాల్సిందిగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను మంత్రి కోరారు.

మూడేళ్లలో న్యాయం

ప్రతిపాదిత బిల్లులు ఆమోదం పొందితే నేర న్యాయ వ్యవస్థ సమూలంగా మెరుగు పడుతుందని అమిత్ షా అన్నారు. అంతేగాక ప్రతి పౌరునికీ గరిష్ఠంగా మూడేళ్లలో న్యాయం అందుతుందన్నారు. 'కొత్త చట్టాల్లో మహిళలు, బాలలకు అత్యంత ప్రాధాన్యం దక్కనుంది. మూక దాడుల వంటి హేయమైన నేరాలకు కూడా నిర్దిష్టమైన శిక్షలను పొందుపరిచాం. తొలిసారిగా ఉగ్రవాదానికి కూడా నిర్వచించాం' అని ప్రకటించారు. 'రాజద్రోహం సెక్షన్ ను పూర్తిగా ఎత్తేస్తున్నాం. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ భావ వ్యక్తీకరణ హక్కు ఉంటుంది' అని వివరించారు. 'ఈ బిల్లులు మన నేర న్యాయ వ్యవస్థను సమూలంగా మెరుగు పరుస్తాయని సభకు హామీ ఇస్తున్నా. వీటి లక్ష్యం శిక్ష విధింపు కాబోదు. న్యాయం అందేలా చూడటమే ప్రధానోద్దేశం. కొత్త చట్టాల్లో కేవలం నేరాలను నియంత్రించే లక్ష్యంతో మాత్రమే శిక్ష విధింపులు ఉంటాయి' అన్నారు. బ్రిటిష్ కాలం నాటి ప్రస్తుత చట్టాల నిండా బానిసత్వపు చిహ్నాలే ఉన్నాయని విమర్శించారు. 'అధికారంలో ఉన్నవారిని వ్యతిరేకించే ప్రతి ఒక్కరినీ ఏదోలా శిక్షించడం వాటి ఏకైక లక్ష్యము. బ్రిటిష్ అధికారాన్ని పరిరక్షించడం, బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపుదిద్దుకున్న చట్టాలవి. శిక్షించడమే వాటి ప్రధాన లక్ష్యం తప్ప న్యాయం అందించడం కాదు' అని ఆరోపించారు. శిక్ష పడే రేటును కనీసం 90 శాతానికి పెంచడమే కొత్త చట్టాల లక్ష్యమన్నారు. ఇందుకోసం ఫోరెన్సిక్ సైన్స్ వాడకాన్ని మరింతగా పెంచే యోచన కూడా ఉందని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు.

- మూక దాడులకు, మైనర్లపై అత్యాచారానికి మరణశిక్ష.
- దేశం పట్ల నేరాలను ఇకపై అతి తీవ్రమైనవిగా పరిగణిస్తారు.
- కొన్ని రకాల చిల్లర నేరాలకు శిక్షగా సామాజిక సేవ (అమల్లోకి వస్తే ఇలాంటి శిక్ష ఇదే తొలిసారి అవుతుంది).
- వేర్పాటువాదం, తత్సంబంధ చర్యలు, సాయుధ తిరుగుబాటు, భారత సార్వభౌమత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను ప్రమాదంలో పడవేయడం వంటి కొత్త నేరాలను పొందుపరిచారు.
- పలు నేరాలకు ఇకపై లింగ భేదం ఉండబోదు.
- పెళ్లి, ఉద్యోగం, ప్రమోషన్ల వంటి ప్రలోభాలు చూపి, గుర్తింపును దాచి మహిళలను లైంగికంగా దోచుకోవడం నేరంగా పరిగణనలోకి వస్తుంది.
- గ్యాంగ్ రేప్ కు 20 ఏళ్లు, లేదా జీవిత ఖైదు.
- తీవ్రతను బట్టి మూక దాడులకు ఏడేళ్లు, జీవిత ఖైదు, లేదా మరణ శిక్ష.
- తొలిసారిగా ఉగ్రవాదానికి నిర్వచనం.
- ఉగ్రవాదుల ఆస్తుల జప్తు

న్యాయ సంహిత బిల్లు ప్రకారం ఉగ్రవాది అంటే...

- దేశంలో గానీ, విదేశాల్లో గానీ భారత దేశ ఐక్యతను, సమగ్రతను, భద్రతను ప్రమాదంలో పడేసే చర్యలకు పాల్పడేవాడు.
- తద్వారా జన సామాన్యాన్ని, లేదా ఒక వర్గాన్ని భయభీతులను చేసేవాడు, శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగించేవాడు.

'నేర న్యాయ చట్టాలను సమూలంగా మదింపు చేయాల్సిన, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాల్సిన అవసరం చాలా ఉందని 70 ఏళ్ల ప్రజాస్వామ్య భారత అనుభవం చెబుతోంది. సబ్ కా సాత్ (అందరికీ తోడు), సాబ్ కా వికాస్ (అందరి అభివృద్ధి), సాబ్ కా విశ్వాస్ (అందరి నమ్మకం), సాబ్ కా ప్రయాస్ (అందరి ప్రయత్నం) అన్నదే కేంద్ర ప్రభుత్వ మంత్రం'

– బీఎన్ఎస్ఎస్ బిల్లు లక్ష్య ప్రకటన

రాజకీయ రెమిషన్లకు చెక్...

శిక్ష తగ్గింపు (రెమిషన్) వంటి సదుపాయాలను రాజకీయ లబ్ధికి వాడుకోవడాన్ని నిరోధించేందుకు ప్రతిపాదిత బిలుల్లో కొత్త సెక్షన్లు పొందుపరిచారు. వాటి ప్రకారం...

- ఇకపై మరణశిక్షను కేవలం జీవిత ఖైదుగా మాత్రమే మార్చేందుకు వీలవుతుంది.
- జీవిత ఖైదును ఏడేళ్ల శిక్షగా మాత్రమే మార్చవచ్చు.
- బిహార్ కు చెందిన నేరమయ నేత ఆనంద్ మోహన్ కు క్షమాభిక్ష పెట్టి విడుదల చేయడానికి అమిత్ షా ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుకే రాజకీయ అండదండలున్న వారు చట్టం బారి నుంచి తప్పించుకోకుండా చూసేందుకే ఈ సెక్షన్లను చేర్చినట్లు వివరించారు.

కొత్త నేర-న్యాయ ప్రక్రియ ఇదీ

- 90 రోజుల్లోపు ఛార్జ్ షీట్ దాఖలు చేయాలి.
- పరిస్థితిని సమీక్షించాక కోర్టు మరో 90 రోజుల సమయం ఇవ్వొచ్చు.
- దర్యాప్తును 180 రోజుల్లోపు పూర్తి చేసి విచారణకు పంపాలి.
- విచారణ ముగిశాక 30 రోజుల్లోపు తీర్పు వెలువడాలి.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు శుక్రవారంతో ముగియడంతో ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ సమావేశాలు జూలై 20 నుంచి ప్రారంభమయ్యాయి. రాజ్యసభ 17 సిట్టింగ్‌ల్లో 44 గంటల 58 నిమిషాల సమయం వృథా అయిందని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు వంటి కీలక బిల్లును ఆమోదించిందన్నారు. లోక్‌సభలో 39 గంటలపాటు కొనసాగగా ముఖ్యమైన బిల్లులను పాస్ చేసిందని స్పీకర్ బిర్లా తెలిపారు.

రాజద్రోహం ఇక దేశద్రోహం

బ్రిటిష్ కాలం నాటి వివాదాస్పద రాజద్రోహ చట్టాన్ని తొలగించనున్నట్టు కేంద్రం ప్రతిపాదించింది. అదే సమయంలో దేశద్రోహం పేరిట దానికి కొత్త రూపు ఇవ్వనుంది. బ్రిటిష్ సింహాసనాన్ని గుర్తు చేసే వలస వాసనలు వదిలించుకోవడమే పేరు మార్పు ఉద్దేశమని పేర్కొంది. బీఎన్ఎస్ బిల్లులో ప్రతిపాదించిన ఈ కొత్త చట్టాన్ని మరిన్ని కొత్త సెక్షన్లతో మరింత బలోపేతం కూడా చేయనుంది. దాని ప్రకారం... ఉద్దేశపూర్వకంగా నోటిమాట ద్వారా, రాతపూర్వకంగా, సైగలు, చిహ్నాల ద్వారా, అందరికీ బయటికి కనిపించేలా, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ ద్వారా, ఆర్థిక సాధనాల ద్వారా, ఇతరత్రా, రెచ్చగొట్టే చర్యల ద్వారా, వేర్పాటువాదం ద్వారా, సాయుధ తిరుగుబాటు ద్వారా, అలాంటి ధోరణులను ప్రోత్సహించినా, దేశ సార్వభౌమత్వాన్ని, సమైక్యతను, సమగ్రతను ప్రమాదంలో పడేసినా, అలాంటి మరే ఇతర చర్యలకు పాల్పడినా అది దేశద్రోహమే.

- దేశానికి వ్యతిరేకంగా చేసే ఎలాంటి పనినైనా దేశద్రోహంగానే పరిగణిస్తారు.
- శాంతి సమయంలో ప్రభుత్వంపై యుద్ధం చేసినా, అందుకు ప్రయత్నించినా, అందుకోసం విదేశీ ప్రభుత్వాలతో చేతులు కలిపినా, అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించినా అందుకోసం మూకలను, ఆయుధాలను సమీకరించినా, అందుకు ప్రయత్నించినా, అలాంటి ప్రయత్నాలు గురించి తెలిసీ చెప్పకపోయినా, వాటిని దాచినా, అది దేశ ద్రోహమే.
- నేర తీవ్రతను బట్టి అందుకు జీవిత ఖైదు, పదేళ్లకు మించని, లేదా ఏడేళ్ల ఖైదు, వాటితో పాటు జరిమానా కూడా పడవచ్చు.

'భరత మాత' మాటను తొలగించలేదు

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రసంగం సమయంలో తను ప్రస్తావించిన 'భరత మాత'మాటను తొలగించారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందించారు. రాహుల్ గాంధీ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఆయన మతి తప్పినట్లుగా అనిపిస్తోందని జోషి వ్యాఖ్యానించారు. అన్ పార్లమెంటరీ మాటలను తొలగించామే తప్ప, భరతమాత అనే మాటను కాదని చెప్పారు. మరో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ..ఏదో హడావుడి చేయాలన్న రాహుల్ గాంధీ ప్రయత్నం మరోసారి ఫెయిల్, ఫ్లాప్ అయ్యిందంటూ ఎద్దేవా చేశారు.

మణిపూర్ మండుతూ ఉంటే పార్లమెంట్‌లో జోకులా?

ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజం




న్యూఢిల్లీ: మణిపూర్ హింసాత్మక ఘటనలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీని మరోసారి టార్గెట్ చేశారు. గురువారం పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానానికి బదులిస్తూ ప్రధాని మోదీ నవ్వడం, జోకులు వేయడాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రధాని ప్రవర్తన సరైంది కాదన్నారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో రాహుల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మోదీ మణిపూర్ హింసను తక్షణం ఆపాలనుకుంటే, అందుకు అవసరమైన చాలా మార్గాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని చెప్పారు. భారత ఆర్మీ అక్కడి పరిస్థితులను రెండు రోజుల్లోనే అదుపులోకి తీసుకొస్తుందని చెప్పారు. 'అక్కడ మహిళలు, చిన్నారులు చనిపోతున్నారు. మహిళలు వేధింపులు, అత్యాచారాలకు గురవుతున్నారు. భారత ప్రధాని మోదీ మాత్రం నిండు పార్లమెంట్‌లో రెండు గంటలపాటు నవ్వుతూ, నవ్విస్తూ, నినాదాలతో గడిపారు. నాలుగు నెలలుగా మణిపూర్ మంటల్లో ఉన్న విషయం ఆయన మర్చిపోయినట్లున్నారు. మణిపూర్ మండుతూనే ఉండాలని ఆయన కోరుకుంటున్నారు, మంటలను ఆపడం ప్రధానికి ఇష్టం లేదు' అని రాహుల్ ధ్వజమెత్తారు. ఈ విషయం రాహుల్ గాంధీకి, కాంగ్రెస్‌కు, ప్రతిపక్షానికి సంబంధించింది కాదు, ఇది భారత్‌కు, మన దేశానికి సంబంధించిన విషయం. ఒక రాష్ట్రం నాశనమైంది. అదిప్పుడు ఉనికిలో లేదు. విభజించు, పాలించు, తగులబెట్టు.. తరహా బీజేపీ రాజకీయాల వల్లే ఇలా అయింది'అని రాహుల్ మండిపడ్డారు. 'నేను అటల్ బిహారీ వాజ్‌పేయి, దేవెగౌడ వంటి ప్రధానుల్ని చూశాను. మోదీ వంటి ఇంత దిగజారిన ప్రధానిని ఎన్నడూ చూడలేదు'అన్నారు. 'మణిపూర్‌లో భారత మాత హత్యకు గురైంది'అని నేను చేసిన వ్యాఖ్య సాధారణమైంది కాదు. నా 19 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇలాంటి మాట వాడటం ఇదే మొదటిసారి'అని అన్నారు. మణిపూర్‌లోని మెయితీలుండే ప్రాంతానికి వెళ్లినప్పుడు.. వాళ్లు మమ్మల్నెంతో ప్రేమగా చూశారు. అక్కడే ఉండిపొమ్మన్నారు. అక్కడున్న భద్రతా సిబ్బంది ఒక్క కుకీ వర్గం వ్యక్తి కూడా లేరు. కుకీలుండే ఏరియాకు వెళ్లినప్పుడూ మాకు ఇదే అనుభవం ఎదురైంది. అక్కడ ఒక్కడి భద్రతా సిబ్బందిలో ఒక్క మెయితీ కూడా లేరు. ఇలాంటి పరిస్థితి మణిపూర్‌లో మునుపెన్నడూ లేదని కేంద్ర భద్రతా సిబ్బంది ఒకరు నాతో అన్నారు'అని రాహుల్ చెప్పారు. 'అందుకే మణిపూర్‌లో భరతమాత హత్యకు గురైందన్నాను. అది తమాషాకు కాదు. వాస్తవమే చెప్పాను'అని రాహుల్ తెలిపారు. 'పార్లమెంట్‌లో నా ప్రసంగంలోని భరతమాత అనే మాట దోషంగా భావించి రికార్డుల నుంచి తొలగించి వేశారు. అందులో తప్పేముంది? ఇలా భరత మాత మాటను తొలగించడం పార్లమెంట్ చరిత్రలోనే తొలిసారి'అని రాహుల్ పేర్కొన్నారు.

ప్రధాని హోదాకు తగని ప్రసంగం

గురువారం లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా మండిపడ్డారు. ప్రధాని మోదీ రెండు గంటల ప్రసంగమంతా హాస్యం, వ్యంగ్యం, అసందర్భ వ్యాఖ్యలతోనే గడిచిపోయిందని వ్యాఖ్యానించారు. 'మణిపూర్ లాంటి తీవ్రమైన, సున్నితమైన అంశంపై మాట్లాడేటప్పుడు నవ్వడం, ఎగతాళి చేయడం ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తికి తగదు'అని ఆమె శుక్రవారం ట్వీట్ చేశారు.

రాజస్తాన్‌లోని కోటా. ప్రవేశ పరీక్షల కోచింగ్‌కు పెట్టింది పేరు.
ఇప్పుడు విద్యార్థి ఆత్మహత్యలకు కోటలా మారింది.
వారం రోజుల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.
ఈ ఏడాది ఇప్పటివరకు 18 మంది నిండు ప్రాణాలను తీసుకున్నారు.
ఈ ఆత్మహత్యలకి కారణలేంటి ?
విద్యార్థుల ఆత్మహత్యల్ని నివారించలేరా?



ఒత్తిడి కోటా ఎక్కువై..

రాజస్తాన్ కోటాలో ఆగని విద్యార్థుల ఆత్మహత్యలు • వారం రోజుల వ్యవధిలో ముగ్గురు బలి

కోటాలో ఏ కోచింగ్ సెంటర్‌లో అడుగుపెట్టినా కళ్లు చెదురుతాయి. పెద్ద రిసెప్షన్ హాలు, లగ్జరీ ఫర్నీచర్, గోడలకి పెయింటింగ్‌లు, సీసీటీవీ కెమెరాలు, బయోమెట్రిక్ సిస్టమ్, ఫైవ్ స్టార్ హోటల్స్‌ని తలపించేలా సకల సదుపాయాలు. ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని ఆశతో కలలు కనే విద్యార్థులకు కావల్సిన సదుపాయాలు అన్నీ ఉన్నాయి. ఈ ఏడాది ప్రవేశ పరీక్షలకు ప్రిపేర్ అవడానికి దేశం నలుమూలల నుంచి 3 లక్షల మంది విద్యార్థులు చేరారు. ఐఐటీ, ఐఐఎంలలో అత్యధిక మందికి సీటు లభిస్తున్నప్పటికీ చాలా మందిలో భవిష్యత్‌పై భరోసా కూడా కరువు అవుతోంది. రాను రాను విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. కొందరు హాస్టల్ భవనంపై నుంచి దూకి, మరికొందరు సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకొని , కొందరు సూసైడ్ నోట్ రాసి మరికొందరు మౌనంగా కన్నవారికి కడుపుకోత మిగిల్చి వెళ్లిపోతున్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్‌కు చెందిన బహదూర్, రాజస్తాన్ జలోర్‌కు చెందిన పుష్పేంద్ర సింగ్ , బిహార్‌కు చెందిన భార్గవ్ మిశ్రా, యూపీకి చెందిన మంజోత్ చాబ్రా, ఇప్పుడు యూపీలోని అజమ్‌గఢ్‌కు చెందిన మనీశ్ ప్రజాపతి .. గత కొద్ది రోజుల్లో కోటాలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులు వీరంతా. అందరూ 16 నుంచి 19 ఏళ్ల వయసు మధ్యనున్న వారే. మనీష్ నాలుగు నెలల క్రితమే కోటాలో ఇంజనీరింగ్ కోచింగ్‌లో జాయిన్ అయ్యాడు. బుధవారమే అతని తండ్రి వచ్చి కొడుకుని చూసి క్షేమసమాచారాలు అడిగి తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన తన ఊరు చేరకుండానే మనీశ్ ఆత్మహత్య చేసుకున్నాడని ఫోన్ వచ్చింది. అంతే ఆ తండ్రి కుప్పకూలిపోయాడు. ఈ మధ్య కాలంలో కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత 12 ఏళ్లలో 150 మంది విద్యార్థులు కోటాలో ఆత్మహత్య చేసుకున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కరోనా మహమ్మారి తర్వాత కోచింగ్ సెంటర్‌లు ప్రారంభమయ్యాక 2021లో నలుగురు ఆత్మహత్యకు పాల్పడితే, 2022లో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 18 మంది బలవన్మరణం చెందారు.



ఆత్మహత్యకి నివారణ మార్గాలేంటి ?

విద్యార్థుల వరస ఆత్మహత్యలతో కోచింగ్ సిటీ కోటాపై వ్యతిరేకత పెరిగిపోతూ ఉండడంతో రాజస్తాన్ ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది. 24/7 పని చేసే హెల్ప్‌లైన్ నెంబర్లు, పోలీసుల ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేశారు. కొన్ని కోచింగ్ సెంటర్లు ప్రత్యేకంగా కౌన్సెలర్లను నియమించి ఒత్తిడిలో ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తోంది. మానసిక ప్రశాంతతనిచ్చే యోగా, ధ్యానం, జుంబా డ్యాన్స్‌లు వంటి క్లాసులు కూడా కొన్ని కోచింగ్ సెంటర్లలో కనిపిస్తున్నాయి. అయితే ఈ చర్యలు సరిపోవని అనూ గుప్తా అనే టీచర్ చెబుతున్నారు. కోచింగ్ సెంటర్ యాజమాన్యాలు 24 గంటలూ పోటీ పరీక్షల్లో టెక్నిక్కులను బోధించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారే తప్ప జీవితంలో వచ్చే సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలో, పోటీ ప్రపంచంలో ఎదురయ్యే అడ్డంకుల్ని అధిగమించే పోరాటస్ఫూర్తిని విద్యార్థుల్లో కల్పించడం లేదని అనూ పేర్కొన్నారు. ఎలాగైనా బతకగలమన్న ధీమా విద్యార్థుల్లో నింపినప్పుడే ఆత్మహత్యల్ని నివారించవచ్చునని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు చదువు మీద పెట్టే సమయానికి, ఇతర కార్యక్రమాలకి ఇచ్చే సమయానికి మధ్య సమతుల్యత ఉండాలని అష్లో మాత్రా అనే సైకాలజిస్ట్ చెప్పారు. రోజుకి 18 గంటలు చదువు రుద్దేయడం వల్ల మెంటల్ బ్యాలెన్స్ కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల్ని కోటా ఫ్యాక్టరీకి పంపించే ముడి పదార్థాలుగా చూస్తున్నారని ఇప్పుడు వారిపై పెట్టుబడి పెడితే భవిష్యత్‌లో వారు ఉపయోగపడతారన్న ధోరణి నుంచి బయటకు రావాలని అవిజిత్ పాఠక్ అనే సైకాలజిస్టు సూచించారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడానికి రాజస్థాన్ ప్రభుత్వం ప్రైవేటు విద్యా సంస్థల నియంత్రణ బిల్లుని తీసుకురావాలని భావిస్తోంది.ఆ బిల్లు వెంటనే తీసుకువచ్చి విద్యార్థుల ఆత్మహత్యల్ని నివారించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఎందుకీ ఆత్మహత్యల పరంపర ?

- ఇది పోటీ ప్రపంచం. వంద సీట్లు ఉంటే లక్ష మంది పరీక్ష రాస్తున్నారు. అంత పోటీని తట్టుకొని విజయం సాధించడం సులభం కాదు. అందుకే విద్యార్థులు ప్రెషర్ కుక్కర్‌లో పెట్టినట్టుగా తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. తాము కన్న కలలు కల్లలవుతాయన్న భయంతో నిండు ప్రాణాలు తీసేసుకుంటున్నారు.
- కోటాలో ఆత్మహత్య చేసుకుంటున్న విద్యార్థుల్లో యూపీ, బిహార్ వంటి రాష్ట్రాలకు చెందినవారే ఎక్కువ. ఆ విద్యార్థులు వారి స్కూల్లో ఫస్ట్ ర్యాంకర్స్. దీంతో తల్లిదండ్రులు గంపెడాశలతో అప్పో సప్పో చేసి కోటాలో చేర్పిస్తున్నారు. తమ స్కూల్లో హీరోగా వెలిగిన విద్యార్థికి అక్కడికి రాగానే తాను లక్షల మందిలో ఒకడినన్న వాస్తవం తెలుస్తుంది. మిగిలిన విద్యార్థులతో నెగ్గుకు రాలేక, తల్లిదండ్రుల్ని నిరాశపరచలేక ఆత్మహత్యకి పాల్పడుతున్నారు.
- కోటాలో కోచింగ్ తీసుకునే విద్యార్థులు రోజుకి 16–18 గంటల చదవాలి. ఉదయం 6.30 నుంచి మళ్లీ అర్ధరాత్రి 2 వరకు తరగతులు ఉంటాయి. అంటే విద్యార్థి పడుకోవడానికి ఇచ్చే సమయం కేవలం నాలుగు గంటలు. మధ్యలో తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడడానికి అవకాశం ఇస్తారు. ''ఏదో ఒకరోజు బాగా నిద్ర వచ్చి పావుగంట ఎక్కువ సేపు పడుకుంటే గిల్టీగా ఫీలవుతాను. తోటి వారి కంటే వెనకబడిపోతానన్న భయం వేస్తుంది. ఆ రోజంతా ఏడుస్తూనే ఉంటాను'' అని ఐఐటీకి ప్రిపేర్ అవుతున్న సమర్ అనే విద్యార్థి చెప్పాడు. కంటినిండా నిద్రకి కూడా నోచుకోని చదువుల భారం వారి ప్రాణాలు తోడేస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

- కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కోవిడ్ తర్వాత మరింత ఎక్కువయ్యాయి. కరోనా సమయంలో విద్యార్థులకి చదివే అలవాటు తప్పిపోయింది. దానికి తోడు కోవిడ్ సోకిన వారిలో మానసిక సమస్యలు ఎక్కువయ్యాయి. చదువుల ఒత్తిడి మరింతగా కుంగదీస్తోంది. ఆత్మహత్యకు పురిగొల్పుతోంది.
- కోటాలో కోచింగ్‌కే ఏడాదికి 2 లక్షల నుంచి 5 లక్షల రూపాయల దాకా అవుతుంది. నిరుపేద కుటుంబాల విద్యార్థులకి తల్లిదండ్రులు చేసిన అప్పే ఎప్పుడూ కళ్ల ముందు కనిపిస్తోంది. ఆ లేత మనసులపై ఒత్తిడి పెంచుతుంది. దీంతో కోచింగ్ సెంటర్ల పరీక్షల్లో ఫెయిలైనా జీవితాన్ని అంతం చేసుకుంటున్నారు.

రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా సస్పెన్షన్



న్యూఢిల్లీ: నిబంధనల ఉల్లంఘన, అనుచిత ప్రవర్తన, ధిక్కార వైఖరి ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ రాఘవ్ చద్దా రాజ్యసభ నుంచి సస్పెన్షన్‌కు గుర య్యారు. ఆయన సస్పెన్షన్‌పై శుక్రవారం రాజ్యసభ నేత పీయూష్ గోయెల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. దేశ రాజధాని ఢిల్లీ(సవరణ) బిల్లు–2023పై ప్రతిపాది త సెలెక్ట్ కమిటీకి అనుమతి తీసుకోకుండానే కొందరు సభ్యుల పేర్లను చేర్చినందుకు ఈ చర్య తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై సభా హక్కుల కమిటీ విచారణ జరిపి, నివేదిక ఇచ్చే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని తెలిపింది. ఆప్ మరో నేత సంజయ్ సింగ్ సస్పెన్షన్ పొడిగించే తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. వర్షాకాల సమావేశాల ప్రారంభంలోనే సంజయ్ సింగ్ సస్పెన్షన్‌కు గురయ్యారు.

హరియాణా మత ఘర్షణల కేసులపై కమిటీ: సుప్రీం

న్యూఢిల్లీ: సమాజంలో వివిధ వర్గాల మధ్య సామరస్యం, పరస్పర మర్యాదపూర్వక ప్రవర్తన అత్యంత అవసరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. విద్వేషపూరిత ప్రసంగాల్ని ఎవరూ అంగీకరించరని పేర్కొంది. హరియాణాలో ఆరుగురు ప్రాణాలను బలిగొన్న మత ఘర్షణలకు సంబంధించి రిజిస్టర్ అయిన కేసుల విచారణకు రాష్ట్ర డీజీపీ నేతృత్వంలో ఒక కమిటీ వేయాలని సుప్రీం కోర్టు ప్రతిపాదించింది. హరియాణా సహా వివిధ రాష్ట్రాల్లో ఒక మతం వారిని చంపేయాలంటూ చేసిన విద్వేష పూరిత ప్రసంగాల వల్ల హింస చెలరేగుతోందన్న ఆరోపణలతో దాఖలైన పిటిషన్లను శుక్రవారం సుప్రీం విచారణ చేపట్టింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆగస్టు 18లోగా కమిటీ ఏర్పాటుపై కోర్టుకు సమాచారం ఇవ్వాలని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం. నటరాజ్‌ను ఆదేశించింది. సమాజంలో వివిధ వర్గాల మధ్య సమరస్యపూర్వక వాతావరణం ఉండాలని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.

రోడ్డు ప్రమాదంలో 10 మంది దుర్మరణం

అహ్మదాబాద్: ఆగి ఉన్న వాహనాన్ని మినీ ట్రక్కు ఢీకొన్న ఘటనలో 10 మంది చనిపోగా మరో 13 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘోర ఘటన గుజరాత్‌లోని అహ్మదాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఖేడా జిల్లా కపద్‌వంజ్ తాలూకాలోని ఓ గ్రామానికి చెందిన 23 మంది సురేంద్రనగర్ జిల్లా చోటిలాలో జరిగిన మతపరమైన కార్యక్రమానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారి వాహనం శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో బగోదర సమీపంలో రాజ్‌కోట్-అహ్మదాబాద్ హైవేపై రోడ్డు పక్క ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది. ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోగా మరో 13 మంది గాయపడినట్లు ఎస్పీ అమిత్ వానవ తెలిపారు. ఘోర ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున సాయం ప్రకటించారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శనివారం : 12 : ఆగస్టు : 2023

ముగిసిన విచారణ

సాక్షి, చెన్నై: మంత్రి సెంథిల్ బాలాజి వద్ద ఈడీ విచారణ ముగిసింది. శనివారం ఆయన్ను పుళల్ జైలుకు తరలించనున్నారు. మనీలాండరింగ్ కేసులో మంత్రి సెంథిల్ అరెస్టయిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు అనుమతితో ఐదు రోజుల పాటు ఈడీ ఆయన్ను విచారించింది. విచారణ శుక్రవారంతో ముగిసింది. విచారణలో తమకు సెంథిల్ పూర్తి స్థాయిలో సహకరించలేదన్న వాదనను కోర్టు ముందు ఉంచేందుకు ఈడీ వర్గాలు సిద్ధమయ్యాయి. సెంథిల్ సోదరుడు, సన్నిహితులు అశోక్‌కుమార్, షణ్ముగం, కార్తికేయన్, నిర్మల, లక్ష్మీలకు సమన్లు జారీ చేసినా విచారణకు హాజరు కాలేదన్న విషయాన్ని శనివారం కోర్టుకు వివరించేందుకు ఈడీ నిర్ణయించింది. పైన పేర్కొన్న వారి నివాసాల్లో లభించిన ఆస్తులకు సంబంధించిన దస్తావేజులు, ఇతర రికార్డులకు సంబంధించి సెంథిల్ సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. వారితో తనకు ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేసి ఉండడం గమనార్హం.

న్యూస్‌రీల్

డిజిటల్ చికిత్స కేంద్రాల విస్తరణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నీరజ్ మిట్టల్, సంజయ్ మురళి

సాక్షి, చెన్నై: డిజిటల్ థెరప్యూటిక్, పెల్విక్ ఫ్లోర్ డిజార్డర్స్, న్యూరోలాజికల్, మస్క్యులో స్కెలెటల్ రోగులకు చికిత్సను విస్తృతం చేయడానికి జోగో ఇండియా నిర్ణయించింది. శుక్రవారం స్థానికంగా రాష్ట్ర ప్రభుత్వ, టీఎస్ అర్బన్ ఫైనాన్స్ ఎండీ నీరజ్ మిట్టల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జోగా పాన్ ఇండియా సేవల ప్రారంభోత్సవం జరిగింది. ప్రముఖ డాక్టర్లు శ్రీనివాసన్, రాజమహేశ్వరి, ఆర్ లక్ష్మీనరసింహన్, చార్లెస్ జేసు దాసన్, జోగా ఇండియా వ్యవస్థాపకుడు సంజయ్ మురళి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మురళి మాట్లాడుతూ 2025 నాటికి మరో 40 నగరాలకు సేవలను విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. జోగా అన్నది యూఎస్ అధారిత డిజిటల్ థెరప్యూటిక్ కంపెనీ అని గుర్తు చేస్తూ ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్ సహా 10 నగరాలలో విస్తరణ కార్యక్రమాలు వేగవంతం చేశామన్నారు. అలాగే, 100కు పైగా డిజిటల్ చికిత్స కేంద్రాలపై దృష్టి పెట్టనున్నామని తెలిపారు.

భారీ జాతీయ జెండాతో ర్యాలీ

- దేశభక్తిని చాటుకున్న మాజీ సైనికులు



పొడవైన జాతీయ జెండాతో ర్యాలీ

సేలం: భారతదేశ 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మెట్టూరు సమీపంలోని మేచేరిలో 76 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించి మాజీ సైనికులు దేశభక్తిని చాటుకున్నారు. సేలం జిల్లా మెట్టూరు సమీపంలోని మేచేరిలో 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 76 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో కవాతును మాజీ సైనికులు నిర్వహించారు. ర్యాలీని మెట్టూరు సబ్ సూపరింటెండెంట్ మరియముత్తు కొడియ సాయి జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో 1000 మందికి పైగా ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇరువైపులా జాతీయ జెండాను పట్టుకుని కవాతు నిర్వహించారు. మేచ్చేరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్‌స్టేషన్, సెలక్షన్ రోడ్డు, పశువుల మార్కెట్ సహా ప్రధాన రహదారి గుండా తిరిగి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వరకు సాగింది. విద్యార్థులు జాతీయ జెండాను చేతపట్టుకుని భారత్ మాతాకీ జై నినాదాలు చేశారు. 76వ స్వాతంత్ర్య దినోత్సవ జెండా కవాతులో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని నినాదాలు చేశారు. ర్యాలీని పోలీసులు, పోలీసు వాహనాలు సురక్షితంగా అనుసరించడంతో ర్యాలీ విజయవంతంగా ముగిసింది. జాతీయ జెండాను నంగవల్లికి చెందిన చేనేత కార్మికుడు సెంథిల్ కుమార్ రూపొందించారు. ర్యాలీలో మాజీ ట్రై సర్వీస్ ఫ్యామిలీ వెల్ఫేర్ తరఫున రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ ఇళయప్పన్, అసిస్టెంట్ మేజర్ మురుగేషన్, కెప్టెన్ వెల్లింగిరి రాజన్, రిటైర్డ్ ట్రై సర్వీస్‌మన్, ప్రజలు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

- దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

కొరుక్కుపేట: క్రోంపేటలోని అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడిన దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. చెన్నైలోని క్రోంపేట్‌లోని శాస్త్రికాలనీ 1వ వీధికి చెందిన భాస్కర్ (40) క్రోంపేట ప్రాంతంలోని ఓ కార్ షోరూమ్‌లో బీమా ఏజెంట్. ఇతని భార్య శివగామి (37). తాంబరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. వీరు అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. గురువారం భాస్కర్ అతని భార్య విధులకు వెళ్లిన తర్వాత కూతుళ్లు కూడా కాలేజీకి వెళ్లారు. దీంతో భాస్కర్ తల్లి శకుంతల(70) మాత్రమే ఇంట్లో ఉన్నారు. సాయంత్రం శకుంతల ఇంటికి తాళం వేసి కాలేజీ నుంచి వస్తున్న మనవరాలిని తీసుకొచ్చేందుకు వెళ్లింది. ఆ సమయంలో ఇంటికి వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో 11 సవర్ల నగలు, రూ.8వేల నగదు అపహరించి అపార్ట్‌మెంట్ మెట్లు దిగి వెళ్లారు. అప్పుడే మనవరాలిని తీసుకొచ్చి అపార్ట్‌మెంట్ మెట్లు ఎక్కుతున్న శకుంతల వ్యక్తులపై అనుమానం వచ్చి ప్రశ్నించగా వారిలో ఒకరు పారిపోయాడు. ఒకరిని వ్యక్తిని పట్టుకున్నారు. దీంతో ఇరుగుపొరుగు వచ్చి వ్యక్తిపై దేహశుద్ధి చేసి క్రోంపేట పోలీసులకు అప్పగించారు. విచారణలో ఆ వ్యక్తి చెన్నైలోని ఆలందూరు ప్రాంతానికి చెందిన ధనుమూర్తి (23) అని, సహచరుడు ఆనంద్ అని అతను పరారీలో ఉన్నాడని తెలిసింది.

డ్రగ్ ఫ్రీ తమిళనాడు లక్ష్యం

- విద్యార్థులు, అధికారులచే ప్రతిజ్ఞ
- ఉక్కుపాదం మోపడంలో నేను నియంతను
- సీఎం స్టాలిన్ వ్యాఖ్య
- 13 వేల కేజీల గంజాయి దగ్ధం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై : డ్రగ్ ఫ్రీ తమిళనాడు లక్ష్యంగా విద్యార్థులు, అధికారుల చేత సీఎం స్టాలిన్ ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల విక్రయాల్లో నిమగ్నమైన వారిపై ఉక్కుపాదం మోపడంలో తాను ఓ నియంతలా సర్వాధికారిగా ఉంటానని హెచ్చరించారు. చెన్నైలోని కలైవానర్ అరంగం వేదికగా రాష్ట్ర పోలీస్ యంత్రాంగం నేతృత్వంలో 'డ్రగ్ ఫ్రీ తమిళనాడు' కార్యక్రమం జరిగింది. పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, పోలీసులు, అధికారుల చేత మాదక ద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా సీఎం స్టాలిన్ ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన వీడియోను ఆవిష్కరించి ప్రదర్శించారు. కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తూ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పసిగట్టేందుకు, స్మగ్లర్ల భరతం పట్టడంతో పాటు కేసుల త్వరితగతిన విచారణ, కఠిన శిక్షల దిశగా చర్యలకు డ్రగ్ ఇంటెలిజెన్స్ యూనిట్, 'ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో–క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్' ఈసందర్భంగా సీఎం ప్రకటించారు. మాదకద్రవ్య వ్యసనం, దుష్ప్రభావాల గురించి తమకు పూర్తిగా తెలుసునని, తాను డ్రగ్స్‌కు బానిస కాను. తన కుటుంబం, స్నేహితులు డ్రగ్స్‌కు అలవాటు పడకుండా నిరోధించడానికి సలహాలు ఇస్తాను, బానిసలైన వారి పునరావాసం కోసం మార్గనిర్దేశం చేసేందుకు కృషిచేస్తానని విద్యార్థులందరి సీఎం స్టాలిన్ సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ద్వారా మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ప్రచారాన్ని ప్రారంభిస్తూ, లఘు చిత్రాన్ని సీఎం విడుదల చేశారు. ఈసందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల పట్టుబడ్డ 13 వేల కేజీల గంజాయి, హెరాయిన్ మాదక ద్రవ్యాలను దగ్ధం చేసే కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, ఎం సుబ్రమణియన్, శేఖర్‌బాబు, అన్బిల్ మహేశ్, సీఎస్ శివదాస్ మీన, హోంశాఖ కార్యదర్శి పి అముద, డీజీపీ శంకర్‌జివ్వాల్, ఏడీజీపీ మహేశ్ కుమార్ అగర్వాల్, చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ పాల్గొన్నారు.

నియంతలా వ్యవహరిస్తా..

సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా పోలీసులకు పూర్తి స్థాయిలో అధికారాన్ని అప్పగించామని వివరించారు. గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలే కాదు, మత్తును ఇచ్చే, కలిగించే ఏ ఒక్క వస్తువును రాష్ట్రంలోకి అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. వీటిని రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపడంలో తాను ఓ నియంతలా సర్వాధికారిగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. మత్తు పదార్థాలను విక్రయించే వారిని గూండా చట్టంలో అరెస్టు చేసి, వారి ఆస్తులను జప్తుచేయాలని పోలీసులను ఆదేశించినట్టు వివరించారు. మత్తు సమాజాన్ని సర్వనాశనం చేస్తుందని, అభివృద్ధికి అవరోధంగా మారుతుందని పేర్కొన్నారు. ఏడాదిగా పోలీసులు, ప్రత్యేక బృందాలు మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడిలో తీవ్రంగా శ్రమించాయని, ఇది విస్తృతం కావాలని, డ్రగ్ ఫ్రీ తమిళనాడు లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల కట్టడిలో విస్తృతంగా శ్రమించే పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లను ప్రోత్సహించే విధంగా సీఎం ప్రత్యేక పతకాన్ని అందజేస్తామని ప్రకటించారు. విద్యార్థులు, యువత సైతం భాగస్వాములు కావాలని మాదక ద్రవ్యాల రహితంగా తమిళనాడును తీర్చిదిద్దుతామని పిలుపు నిచ్చారు.

రోడ్డెక్కిన పసుపు బస్సులు....

తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ నేతృత్వంలో రూ. 14.90 కోట్లతో పునరుద్ధరించిన 100 బస్సులను సీఎం స్టాలిన్ జెండా ఊపి రోడ్డెక్కించారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం బస్సు సేవలను విస్తృతం చేసే విధంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే 22 వేల బస్సులు రవాణా సంస్థలో సేవలను అందిస్తున్నాయి. పలు డివిజన్లుగా, పలు విభాగాలుగా, వివిధ వర్ణాలలో బస్సులు రోడ్డెక్కిస్తున్నారు. మహిళలకు ఉచితం బస్సులకు పింక్ వర్ణం సూచించారు. ఈ ఏడాది రూ. 500 కోట్లతో 1000 కొత్త బస్సుల కొనుగోలుపై దృష్టిపెట్టారు. అలాగే, మరో 1000 పాత బస్సులను ఆధునీకరించేందుకుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం 100 బస్సులను పునరుద్ధరించి ఆధునీకరించారు. అయితే, ఈ పునరుద్ధరించిన బస్సులను పసుపు మయం చేశారు. పసుపు వర్ణంతో కూడిన ఈ బస్సులను విల్లుపురం డివిజన్‌కు 16, సేలంకు 15, కుంభకోణంకు 37, తిరునల్వేలికి 32 కేటాయించారు. 100 బస్సులను సీఎం స్టాలిన్ జెండా ఊపి ప్రారంభించారు. రవాణా శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఫణీంద్రరెడ్డి పాల్గొన్నారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

మృత్యుశకటం



ప్రమాదానికి కారణమైన టిప్పర్



ధ్వంసమైన ద్విచక్రవాహనాలు

- టిప్పర్ దూసుకెళ్లి నలుగురు దుర్మరణం
- పొత్తేరి వద్ద ఘటన
- ప్రజల్లో ఆగ్రహం...ఆందోళన



సంఘటన స్థలంలో పోలీసులు

సాక్షి, చెన్నై: రోడ్డు దాటుతున్న పాదచారులు, వాహనదారుల పాలిట ఓ టిప్పర్ లారీ మృత్యుశకటంగా మారింది. అతివేగంగా దూసుకొచ్చిన ఈ లారీ రూపంలో నలుగురు విగతజీవులయ్యారు. ఒకరు తీవ్రగాయాలతో మరికొందరు స్వల్పగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చెన్నై–తిరుచ్చి జాతీయ రహదారిలోని చెంగల్పట్టు జిల్లా పొత్తేరి వద్ద నిత్యం రోడ్డు దాటే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఇక్కడే ఓ ప్రముఖ విద్యాసంస్థ, ఆస్పత్రి కూడా ఉంది. ఈ మార్గంలో రోడ్డు దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే. ఈ పరిస్థితులలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో కొందరు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రోడ్డు దాటే సమయంలో అతివేగంగా తిరుచ్చి నుంచి చెన్నై వైపు ఇసుకలోడుతో వచ్చిన టిప్పర్ లారీ అదుపుతప్పి దూసుకెళ్లింది.

నలుగురు దుర్మరణం..

అతివేగంగా దూసుకొచ్చిన లారీ పాదచారుల మీదుగా దూసుకెళ్లింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని ఢీకొంది. డివైడర్‌ను దాటి ఎదురుగా మరో రోడ్డుపైకి దూసుకెళ్లి ఆటోను ఢీకొట్టి ఆగింది. ఈ ప్రమాదంతో విద్యార్థుల ఆర్తనాదాలు, పరిసర వాసులు ఆందోళనతో ఉత్కంఠ నెలకొంది. సంఘటన స్థలంలోనే నలుగురు మరణించగా, గాయపడ్డ వారిని హుటాహుటిన చెంగల్పట్టు ఆస్పత్రికి, సమీపంలో ఉన్న ఆస్పత్రికి మరి కొందరిని తరలించారు. విషయం తెలిసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను చెంగల్పట్టు జీహెచ్‌కు తరలించారు. ప్రమాదంలో స్థానిక కళాశాల విద్యార్థులు జశ్వంత్(24), కార్తిక్(23) మృతిచెందారు. అలాగే పొత్తేరికి చెందిన భవాని(42), మరొకరు మృతిచెందారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు ఆగ్రహంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని రాస్తారోకోకు దిగారు. ఆ మార్గంలో రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. టిప్పర్ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడమే కాకుండా, ముందు వెళ్తున్న వాహనాలను అధిగమించే క్రమంలో ప్రమాదం జరిగినట్టు విచారణలో తేలింది. ప్రమాద సమాచారంతో సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. జిల్లా కలెక్టర్, మంత్రులను పంపించి సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు తలా రూ.2లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పార్థసారథి అనే వ్యక్తికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

అరుణాచలేశ్వరుని సన్నిధిలో గవర్నర్ రవి



స్వామివారి చిత్ర పటాలను గవర్నర్‌కు అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయాన్ని రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి కుటుంబసమేతంగా శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం ఉదయం తిరువణ్ణామలై చేరుకున్న ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సేంద్రియ ఎరువులతో పండించిన పంటల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి పరిశీలించారు. అనంతరం ఆయన కుటుంబసమేతంగా గిరివలయం రోడ్డులోని రమణాశ్రమం, యోగి రామ్ సురత్ ఆశ్రమంలో దర్శనం చేసుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి అరుణాచలేశ్వరాలయ స్వామి వారిని దర్శించుకున్నారు. అన్నామలై సమేత ఉన్నామలై అమ్మవారితో పాటు నవగ్రహ సన్నధి, పాతాళ లింగాన్ని దర్శనం చేసుకున్నారు. అనంతరం గిరివలయం రోడ్డుకువెళ్లి నిరుదిలింగంలో స్వామి దర్శనం చేసుకున్న గవర్నర్ కుటుంబ సమేతంగా గిరివలయం వచ్చారు. గిరివలయంలోని స్వామి వారి సన్నధులను దర్శనం చేసుకున్న ఆయన జవ్వాది కొండలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. ఆయన వెంట కలెక్టర్ మురుగేష్ ఉన్నారు. గవర్నర్ జిల్లాకు రావడంతో ఎస్పీ కార్తికేయన్ పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోలాహలం.. మురుగన్ తెప్పోత్సవం

ముగిసిన ఆడికృత్తిక ఉత్సవాలు



తెప్పలో కనువిందు చేస్తున్న వళ్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి




శరవణ పొయ్‌గై పుష్కరిణిలో తెప్పోత్సవం

తిరుత్తణి: తిరుత్తణి ఆడికృత్తిక ఉత్సవాల్లో చివరిరోజు శుక్రవారం మూడవరోజు తెప్పోత్సవం కమనీయంగా సాగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తెప్ప విహారాన్ని తిలకించి పరవశం పొందారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 7న ప్రారంభమైన ఆడికృత్తిక వేడుకల్లో చివరిరోజు శుక్రవారం సాయంత్రం శరవణ పుష్కరిణిలో మూడవ రోజు తెప్పోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల సమయంలో కొండ ఆలయం నుంచి ఉత్సవమూర్తి అలంకరణలో మేళ తాళాలతో మెట్ల మార్గంలో దిగివచ్చి తెప్పలో కొలువుదీరారు. పుష్కరిణి చుట్టూ భారీగా భక్తజనం నిండుగా తెప్పలో కొలువైన స్వామికి కర్పూర హారతులిచ్చి కొలను చుట్టూ ఏడు చుట్లు విహరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. ఆలయ నిర్వాహకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో తెప్పోత్సవంలో పాల్గొన్నారు. మూడవరోజు తెప్పోత్సవంతో ఆడికృత్తిక వేడుకలకు ముగింపు పలికారు.

టీటీవీ 'దివాలా'

- ఈడీ కసరత్తులు



దినకరన్

సాక్షి, చెన్నై : అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్‌ను దివాలా తీసిన వ్యక్తిగా ప్రకటించేందుకు ఈడీ కసరత్తులు చేపట్టింది. ఈ వివరాలను హైకోర్టుకు శుక్రవారం ఆయన తరఫు న్యాయవాది కుమార్ తెలియజేశారు. సైదాపేటకు చెందిన పార్థిబన్ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశాడు. మనీలాండరింగ్ కేసులో టీటీవీ దినకరన్‌కు రూ.31 కోట్లు జరిమానా విధిస్తూ గతంలో ఈడీ ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించారు. అయితే, ఇంతవరకు ఆ మొత్తాన్ని ఆయన చెల్లించలేదని పేర్కొన్నారు. ఆయన నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేయాలని ఈడీకి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గంగాపూర్వాల, న్యాయమూర్తి ఆదికేశవులు బెంచ్ విచారించింది. టీటీవీ తరఫున హాజరైన న్యాయవాది కుమార్ తన వాదనలో ఈ వ్యవహారంలో సివిల్ కేసు ఉన్నట్టు వివరించారు. అలాగే, టీటీవీ దివాలా తీసిన వ్యక్తిగా ప్రకటించేందుకు ఈడీ కసరత్తులు చేపట్టిందని వాదించారు. ఈ వాదనతో పిటిషన్ విచారణను న్యాయమూర్తుల బెంచ్ ముగించింది.

విజయవంతంగా ఫ్రెంచ్ వర్సిటీ ఎక్స్‌పో

సాక్షి, చెన్నై: ఫ్రెంచ్ యూనివర్సిటీ ఎక్స్‌పో 2023 సీమాట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఫ్రాన్స్‌లో విద్యా అవకాశాలు, విద్య ఆవిష్కరణలు, యూరప్‌లోని ప్రముఖ విద్యా కేంద్రాలు, కోర్సుల గురించి ఇక్కడి విద్యార్థులకు తెలియజేసే విధంగా ఈ ఎక్స్‌పోను నిర్వహించారు. ఫ్రెంచ్ వర్సిటీల ప్రతినిధులు విద్యార్థులకు అన్ని వివరాలను సమగ్రంగా తెలియజేశారు. సీమాట్స్ ఛాన్సలర్ వీరయ్యన్ మాట్లాడుతూ ఎక్స్‌పో విద్యార్థుల అభ్యున్నతి, పరిశోధనలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. డైరెక్టర్ రమ్య దీపక్ మాట్లాడుతూ విద్యా ఒప్పందాలపై దృష్టిపెట్టామని ఆమె వివరించారు.

సెలవులతో చార్జీలకు రెక్కలు



రద్దీగా చెన్నై కోయంబేడు బస్టాండ్ (ఫైల్)

సాక్షి, చెన్నై: శనివారం నుంచి వరుసగా సెలవులు రావడంతో చెన్నైలోని వివిధ పనులు, ఉద్యోగాలు చేసుకుంటున్న వాళ్లు స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో ఆమ్నీ ప్రైవేటు బస్సు చార్జీలు 30 శాతం పెంచేశారు. ఇక విమానచార్జీలు 40 శాతం పెరిగాయి. రాష్ట్రంలోని వివిధ నగరాలు, జిల్లాలకు చెందిన వారు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అధికంగా ఉద్యోగాలు, వివిధ పనులు చేసుకుంటున్నారు. అలాగే, విద్యాసంస్థల్లో వివిధ కోర్సులను అభ్యసిస్తున్న వాళ్లు మరీ ఎక్కువే. వీరంతా సెలవులు దొరికితే చాలు తమ స్వస్థలాలకు వెళ్లిపోవడం జరుగుతోంది. ఈ పరిస్థితులలో శని, ఆదివారం సెలవు దినాలు, సోమవారం ఒక్క రోజు సెలవు పెట్టుకుంటే చాలు మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సెలవు కలిసి వచ్చినట్టైంది. దీంతో వరుసగా నాలుగు రోజులు సెలవు తీసుకుని తమ స్వస్థలాలకు బయలుదేరిన వాళ్లే ఎక్కువ.

పెరిగిన చార్జీలు

శుక్రవారం సాయంత్రం నుంచి చెన్నైలోని కోయంబేడు ప్రభుత్వ బస్టాండ్ రద్దీ మయంగా మారింది. దక్షిణ తమిళనాడు వైపు వెళ్లే రైళ్లు కిక్కిరిశాయి. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌ల వైపుగా వెళ్లే వారికి కోసం మెట్రో రైలు సేవలను సైతం పెంచారు. విమానాశ్రయం మార్గంలో సైతం ట్రాఫిక్ రద్దీ పెరిగింది. చెన్నై నుంచి పలు రాష్ట్రాల రాజధానులు, ప్రధాన నగరాలకు వెళ్లే స్వదేశీ విమాన చార్జీలకు రయ్యుమంటూ టేకాఫ్ తీసుకున్నాయి. చెన్నై నుంచి తమిళనాడులోని ఇతర నగరాలకు చార్జీలు, ఇతర రాష్ట్రాలకు చార్జీలు రూ. 2 వేల నుంచి 5 వేలు పెరగడం గమనార్హం. 40 శాతం మేరకు విమానచార్జీలు పెరిగాయి. ఇక, ప్రభుత్వ బస్సులు కిక్కిరిసి వెళ్లడం, రైళ్లలో రిజర్వేషన్లు దొరక్కపోవడంతో ఆమ్నీ ప్రైవేటు బస్సులను ఆశ్రయించిన వాళ్లు మరీ ఎక్కువ. దీంతో ఆమ్నీ బస్సుల చార్జీలు అమాంతంగా పెంచేశారు. 30 శాతం మేరకు చార్జీలను ఆమ్నీ యాజమాన్యం పెంచడంతో గత్యంతరం లేని పరిస్థితులలో స్వస్థలాలకు వెళ్లేందుకు జనం భారమైనా పయనం చేయక తప్పలేదు. ఈ రద్దీని పరిగణించిన ప్రభుత్వం ఆగమేఘాలపై 500 ప్రత్యేక బస్సులను రోడ్డెక్కించింది. ఇదిలా ఉండగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్రం పిలుపునిచ్చిన నేపథ్యంలో తిరుప్పూర్‌లో జాతీయ జెండాల తయారీ వేగం పుంజుకుంది.

నివాస ప్రాంతంలో 'అణు' పరిశ్రమా?

- పర్యావరణ ట్రిబ్యునల్ అసహనం
- అనుమతులు నిలుపుదల



నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కార్యాలయం

సాక్షి, చెన్నై: జన నివాస ప్రాంతం, పచ్చటి పంట పొలాల మధ్యలో అణుపరిశ్రమకు అవసరమయ్యే ముడి పదార్థాలు, పరికరాల ఉత్పత్తికి ఎలా అనుమతి ఇస్తారని అధికారులను దక్షిణ భారత గ్రీన్ ట్రిబ్యునల్ ప్రశ్నించింది. అనుమతులను నిలుపుదల చేస్తూ వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. కోయంబత్తూరు వెల్లాన పట్టికి చెందిన మోహన్ పర్యావరణ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. తనకు చెందిన పంట పొలానికి 100 మీటర్ల దూరంలో అటామిక్ ఎన్‌టీటీ సర్వీసు పేరిట అణు ఉత్పత్తికి అవసరమయ్యే ముడిపదార్థాలు, ఇరిడియం 192, వంటి వాటి ఉత్పత్తికి పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. పచ్చటి పంటపొలాలు, సమీపంలోని గ్రామం, ఇక్కడ ప్రజల జీవన స్థితిపై దెబ్బ తీసే విధంగా పరిశ్రమకు అనుమతి ఇచ్చారని వివరించారు. ఈ పరిశ్రమ కోసం అటామిక్ ఎన్‌టీటీ తరఫున మణిగండన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు సైతం తిరస్కరించిందని, ఎలాంటి ఉత్తర్వులు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపించి ముడిపదార్థాల ఉత్పత్తికి అనుమతులు ఇవ్వడాన్ని రద్దుచేయాలని కోరారు. అణుచట్ట నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు, వన్య ప్రాణులకు, ఏకంగా ఓ గ్రామానికి ముప్పు తెప్పించే విధంగా ఈ పరిశ్రమ ఏర్పాటు అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి గోవిందరాజన్ శుక్రవారం విచారించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది బాల రమేష్ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి స్పందిస్తూ, ప్రజలు నివాసం ఉన్న ప్రాంతం, పచ్చటి పంట పొలాల్లో అణు పరిశ్రమ ఏర్పాటు అవసరమా అని ప్రశ్నించారు. ఈ పరిశ్రమకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, ప్రస్తుతం ఇచ్చిన అనుమతులను నిలుపుదల చేస్తున్నామని ప్రకటించారు. ఈ పిటిషన్‌కు ఈనెల 30వ తేదీలోపు వివరణ ఇవ్వాలని పర్యావరణ శాఖ, కోయంబత్తూరు జిల్లా కలెక్టర్, అటామిక్ సంస్థకు నోటీసులు జారీ చేశారు.

క్లుప్తంగా

15న టాస్మాక్ మూసివేత

తిరువళ్లూరు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 15న టాస్మాక్ దుకాణాలు, బార్లు, ఫైస్టార్ హోటల్స్‌లో మద్యం విక్రయాలను మూసివేయాలని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సముద్రపు నత్తలు స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న అధికారులు

అన్నానగర్: రామనాథపురం సమీపంలో గురువారం 200 కిలోల సముద్రపు నత్తలను అధికారులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. రామనాథపురం సమీపంలో దేవీపట్నం ప్రాంతంలో సముద్రపు నత్తలు ఉన్నట్లు గురువారం ఉదయం అటవీశాఖకు సమాచారం అందింది. దీంతో అధికారులు దేవీపట్నం ప్రాంతానికి వెళ్లి ముమ్మరంగా నిఘా పెట్టారు. అనంతరం దేవీపట్నం నార్త్ స్ట్రీట్ ప్రాంతంలోని ఓ ఇంట్లోకి వెళ్లి ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో 200ల కిలోల సముద్రపు నత్తలు ఉన్నట్లు కనుగొని స్వాధీనం చేసుకున్నారు.దీనికి సంబంధించి దేవీపట్నం ఉత్తర వీధికి చెందిన షేక్తా కుమారుడు సీని ఇబ్రహీం (37), సలీం కుమారుడు మస్తాన్ (31) అనే ఇద్దరిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు.

గురువులను స్ఫూర్తిగా తీసుకోవాలి


విజేతలతో అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: గురువులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని రచయిత్రి డాక్టర్ గుమ్మడి రామలక్ష్మి విద్యార్థులకు సూచించారు. స్థానిక జార్జిటౌన్‌లోని ఎస్‌కేపీసీ తెలుగు శాఖ సృజన తెలుగు భాషా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్ విభాగాల పోటీలు నిర్వహించారు. అతిథులు, న్యాయనిర్ణేతలుగా రచయిత్రి డాక్టర్ గుమ్మడి రామలక్ష్మి, క్వీన్ మేరీస్ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ మోహన కుమారి పాల్గొని పోటీలు ప్రారంభించారు. జానపద నృత్యాలు, ఆటపాటలతో సందడి చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ శరత్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మోహనశ్రీ, తెలుగుశాఖ అధ్యాపకులు పీఎస్ మైథిలి పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు బానిస కావొద్దు


లోగోను తిలకిస్తున్న కలెక్టర్


సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ మణివన్నన్

తిరువళ్లూరు: మత్తుపదార్థాలకు విద్యార్థులు బానిస కావొద్దని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ సూచించారు. రాష్ట్రాన్ని మత్తు పదార్థాల నుంచి విముక్తి కలిగించాలన్న ఉద్దేశంతో కోటి మంది భాగస్వామ్యం అయ్యేలా భారీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని మనవాలనగర్‌లోని నటేషన్ శెట్టియార్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీస్ హాజరై ప్రసంగించారు. అనంతరం అవగాహన ర్యాలీని ప్రారంభించి, విద్యార్థులు ప్రదర్శించిన లోగోను కలెక్టర్ తిలకించారు.సీఈఓ సరస్వతి, హెచ్‌ఎం జ్ఞానశేఖరన్, ఉపాధ్యాయులు ఆనందన్ పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

వేలూరు: యువత మత్తుకు దూరంగా ఉండాలని ఎస్పీ మణివన్నన్ అన్నారు. ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరులోని ఊరీస్ కళాశాల విద్యార్థులచే ప్రతిజ్ఞ, అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ ఆణి కమల అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలోని యువత అధిక భాగం మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల వారి జీవితాన్ని నాశనం చేసుకోవడంతో పాటు వారిని నమ్ముకున్న కుటుంబాన్ని మోసం చేస్తున్నారన్నారు. మత్తు రహిత రాష్ట్రం చేసేందుకు పలు ప్రయత్నాలు చేస్తున్నామని ఇందుకు ప్రజలు, విద్యార్థులు, యువత కంకణం కట్టుకోవాలన్నారు. యుక్త వయస్సులో ఉన్న విద్యార్థులందరూ చెడు అలవాట్లకు బానిస కాకుండా విద్యపైనే శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ పరిధిలోని పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ప్రతి విద్యార్థి జీవితంలో లక్ష్యంతో విద్యను అభ్యసించి ఆ లక్ష్యాన్ని అధిగమించేందుకు పట్టుదలతో ప్రయత్నం చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ భాస్కరన్, డీఎస్పీ తిరునావుక్కరసు, ఎన్‌సీసీ అధికారి మారన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రంజిత


హాజరైన యూనియన్ కౌన్సిలర్లు

తిరుత్తణి: ఆర్కేపేట యూనియన్ సమితి సమావేశం శుక్రవారం నిర్వహించి రూ.98 లక్షల అభివృద్ధి పనులు ఎంపిక చేసి తీర్మానం ఆమోదించారు. ఆర్కేపేట యూనియన్ సమితి చైర్‌పర్సన్ రంజిత అధ్యక్షతన యూనియన్ కౌన్సిలర్ల సాధారణ సమావేశం నిర్వహించారు. బీడీఓలు కలైసెల్వి, వెంకటేశన్, యూనియన్ వైస్ చైర్‌పర్సన్ తిలకవతి సమక్షంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులందరూ పాల్గొన్నారు. చైర్‌పర్సన్ ప్రవేశపెట్టిన ఆదాయ ఖర్చులకు సంబంధించిన అజెండాను అధికారులు సభలో ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదం పొందారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించి చర్చలు జరిగాయి. 15వ ఫైనాన్స్ కమిషన్ నుంచి రూ.98.99 లక్షలు కేటాయించగా అభివృద్ధి పనులకు సంబంధించి పనులు ఎంపిక చేసి తీర్మానం ఆమోదించి కలెక్టర్‌కు పంపారు. అలాగే పాఠశాలల్లో ఉదయం అల్పాహారం పంపిణీకి సంబంధించి వంట గదుల నిర్మాణానికి సంబంధించి ఒక్కో వంట గదికి రూ.76 వేల చొప్పున 33 వంట గదులకు రూ.25 లక్షలు యూనియన్ జనరల్ నిధుల నుంచి కేటాయిస్తూ సమావేశంలో తీర్మానం ఆమోదించారు.

కామాక్షమ్మకు 1,008 పాలబిందెలతో అభిషేకం


పాలబిందెలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

తిరుత్తణి: ఆడి శుక్రవారం సందర్భంగా అమ్మయార్ కుప్పంలో కామాక్షమ్మకు 1008 పాలబిందెలతో అభిషేకం చేశారు. ఆర్కేపేట సమీపం అమ్మయార్‌కుప్పంలో కామాక్షమ్మ ఆలయంలో ఆడినెల నాలుగు శుక్రవారాలు పాటు అమ్మవారికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. ఆడినెల చివరి వారం శుక్రవారం ఉదయం మహిళలు 1008 పాలబిందెలతో గ్రామవీధుల్లో మహిళలు పాలబిందెలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయం చేరుకున్నారు. అమ్మవారికి 1008 పాలబిందెలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. సాయంత్రం 1,008 దీప పూజలు చేశారు. రాత్రి అమ్మవారు వాహనంలో గ్రామ వీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులిచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

మహానాడు విజయవంతం చేయాలి


వాహనాలకు మహానాడు స్టిక్కర్లు అతికిస్తున్న మాజీ ఎంపీ హరి

తిరుత్తణి: అన్నాడీఎంకే మదురై మహానాడును విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషిచేయాలని మాజీ ఎంపీ హరి పిలుపునిచ్చారు. ఈనెల 20న మదురైలో అన్నాడీఎంకే మహానాడు నిర్వహించనున్నారు. ఐదు లక్షల మందిని మహానాడుకు తరలించే విధంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా మహానాడుపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా గడప గడపకు, వాహనాలకు మహానాడు స్టిక్కర్లు అతికించే పనులను శుక్రవారం తిరుత్తణిలో మాజీ ఎంపీ హరి ప్రారంభించారు. ఆర్కేపేట, పళ్లిపట్టు సహా పలు ప్రాంతాల్లో మహానాడు స్టిక్కర్లు అతికించే శిబిరాలు నిర్వహించి వాహనాలకు స్టిక్కర్లు అతికించారు. శిబిరాల్లో భారీ సంఖ్యలో అన్నాడీఎంకే శ్రేణులు పాల్గొన్నారు.

ఆడి శుక్రవార పూజలు


అమ్మవారికి తీసుకెళుతున్న కరగం

వేలూరు: వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో తమిళ ఆడి మాస నాల్గవ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వాలాజలోని ధన్వంతరి ఆరోగ్య పీఠంలో పీఠాధిపతి డాక్టర్ మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి కోసం, మహిళల మాంగల్య బలం కోసం వరమహాలక్ష్మి యాగం, శాంతి దుర్గహోమ పూజలను నిర్వహించారు. ముందుగా గోపూజ, గణపతి పూజలను నిర్వహించారు. అనంతరం పిల్లలు విద్యాభివృద్ధి పెరగాలని, వివాహ భాగ్యం, సంతానం, మాంగల్యబలం కలగాలని కోరుతూ మహిళా భక్తులచే యాగ గుండంలో వేసే పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకొచ్చి యాగగుండంలో వేసి పూజలు చేశారు. మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని ఉన్నామలై అమ్మవారికి శివాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపారాధన చేసి పుష్పాలంకరనలు చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి దీపాలు వెలిగించి ప్రార్థనలు చేశారు. అదేవిధంగా వేలూరు కోట మైదానంలోని నాగదేవతమ్మ ఆలయంలో 108 మంది మహిళా భక్తుల పాల బిందెలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేసి దీపారాధన చేశారు.

నటుడు సత్యరాజ్‌కు మాతృవియోగం


తల్లితో సత్యరాజ్ (ఫైల్)

తమిళసినిమా: సీనియర్ నటుడు సత్యరాజ్ తల్లి నాదాంబాళ్ కాళింగరాయర్ వృద్ధాప్యం కారణంగా శుక్రవారం కోవైలో కన్ను మూశారు. ఆమె వయసు 94 ఏళ్లు. నాదాంబాళ్ కాళింగరాయర్‌కు కొడుకు సత్యరాజ్, కల్పనా మండ్రాడియార్, రూపా సేనాధిపతి అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కోవైలో నివశిస్తున్న నాదాంబాళ్ కాళింగరాయర్ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్‌లో షూటింగ్‌లో ఉన్న నటుడు సత్యరాజ్‌కు ఈ వార్త తెలియగానే వెంటనే కోయంబత్తూరుకు చేరుకున్నారు. ఆయనకు పలువురు సినీ ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పట్టా పత్రాలను జారీ చేయాలి


నిరసన చేస్తున్న ప్రజలు

కొరుక్కుపేట: చెన్నైలోని వ్యాసార్పాడి పుదునగర్ ప్రాంతంలోని తమిళనాడు అర్బన్ హౌసింగ్ డెవలప్‌మెంట్ బోర్డులో గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న నిర్వాసితులకు పట్టా పత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు నిరసన ర్యాలీ చేశారు. వ్యాసార్పాడి ప్రజలు మాట్లాడుతూ తమిళనాడు పునరావాసం పొందిన వారికి కేటాయించిన భూమిని ఇవ్వాలని కోరారు. కొనుగోలు దస్తావేజు జారీ చేయాలని వారు చెప్పారు.కార్యవర్గ సభ్యులతో కూడిన వినతిపత్రాలలో సంబంధిత అధికారులకు అందించామని తెలిపారు.

కోలీవుడ్ టాక్స్

ఎక్స్‌ఆర్మీలో జైఆకాష్


ఎక్స్ ఆర్మీ చిత్ర ప్రారంభోత్సవం

తమిళసినిమా: జైఆకాష్ కథానాయకుడిగా, కథకుడిగా వరుసగా చిత్రాలను చేస్తున్నారు. తాజాగా ఈయన కథ, కథనం అందించి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ఎక్స్ ఆర్మీ. ఏ క్యూబ్ మూవీస్ యాప్ చిత్ర సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జైఆకాష్ శిష్యుడు సాయ్‌ప్రభ దర్శకత్వం వహిస్తున్నారు. నటి ప్రతిఅస్మిత, అక్షయ నటిస్తున్న ఇందులో ఇమాన్ అన్నాచ్చి, కరాటే రాజా, మీసై రాజేంద్రన్, మైకెల్ ఆగస్టియన్, రాజ్‌మిత్రన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. దినేష్ మెట్నే ప్రధాన విలన్ గా నటిస్తున్న ఇందులో హిందీ, మలయాళం, తెలుగుభాషకు చెందిన ప్రముఖ నటులు నటించనున్నట్లు జై ఆకాష్ తెలిపారు. తమిళం ,తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ ఐదు భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా పొందుతున్న ఈ చిత్ర రికార్డింగ్, షూటింగ్ ప్రారంభోత్సవం కార్యక్రమం శుక్రవారం ఉదయం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగాయి. చిత్ర వివరాలను జయప్రకాష్ తిరుపతి ఇందులో ఆర్మీ అధికారిగా పనిచేసి గాయాల కారణంగా రిటైర్ అయిన ఎక్స్ ఆర్మీ అధికారిగా తాను నటిస్తున్నానని, కాగా సమాజంలో జరుగుతున్న అక్రమాలపై, అబలలపై అత్యాచారాలను చూసి చలించి వాటిని అరికట్టడానికి చేసే పోరాటమే ఈ చిత్ర కథ అన్నారు. పోలీస్ అధికారులు చేయలేని కొన్ని పనులను ఈ ఎక్స్ ఆర్మీ అధికారి ఎలా చేశారు అన్నది ఈ చిత్రంలో చూపిస్తున్నామన్నారు. ఇది యూనిక్ కథాంశం కూడినది కావడంతో ఐదు భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా భారీ బడ్జెట్లో రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆర్.రామ్‌కుమార్, సీపీ.సతీశ్ కుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి ఏసీ మణికంఠన్ ఛాయాగ్రహణం, ఎస్ సతీష్‌కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు.

18 తెరపైకి బ్లూబీటిల్


బ్లూ బీటిల్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళసినిమా: సూపర్ హీరో కోవలో రూపొందిన తాజా అమెరికన్ చిత్రం బ్లూ బీటిల్. డీసీ సంస్థ నిర్మించిన ఈ చిత్రానికి ఏంజెల్ మాన్యుయేల్ సోటో దర్శకత్వం వహించారు. క్సోలో మెరిడ్యూనా కథానాయకుడిగా నటించిన ఇందులో పెన్నీగా బ్రునా, మిలాగ్రోస్ ముఖ్యపాత్రలు పోషించారు. నిర్మాణ కార్యక్రమం పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని వార్నర్ బ్రదర్స్ పిక్చర్స్ సంస్థ తెలుగు తమిళం హిందీ ఇంగ్లిష్ భాషల్లో ఈనెల 18న దేశ వ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇది జైమ్స్ అనే ఒక యువకుడు కళాశాల విద్యను పూర్తిచేసి తన భవిష్యత్తు గురించి అన్వేషణ కొనసాగిస్తున్నప్పుడు అనూహ్యగా అతనికి స్కారాబ్ అనే గ్రహాంతర వాస పురాతన అవశేషం కంటబడుతుంది. అది జైమ్స్‌ను స్వాధీనం చేసుకుంటుంది. దీంతో అతనికి అసాధారణ శక్తులు చేకూరుస్తుంది. అలా సూపర్ హీరోగా మారిన జైమ్స్ విధిని తనకు సానుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తాడు. కాగా స్కారాబ్ స్వతహాగా చంపు చంపు అనే మనస్తత్వం కలిగింది. కానీ జైమ్స్ చాలా మంచి వ్యక్తిత్వం కలిగిన వాడు. అలా రెండు విరుద్ధ భావాల కలిగిన వారి మధ్య జరిగే సంఘటనలు చిత్రంలో చాలా ఆసక్తికరంగా సాగుతాయి. ఇలాంటి పలు ఆసక్తికరమైన అంశాలతో రూపొందిన చిత్రం బ్లూబీటిల్. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన ఈ చిత్ర ట్రైలర్ ఇప్పటికే విడుదలై ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది.

హంగామాలో ఎన్ ఎతిరే రెండు పాపా


సాక్షి అగర్వాల్

సాక్షి, చెన్నై : తాను నటించిన తమిళ ఒరిజినల్ సిరీస్ ఎన్ ఎతిరే రెండు పాపా హంగామాలో ప్రసారం కానుందని సినీ నటి సాక్షి అగర్వాల్ తెలిపారు. ఆమె శుక్రవారం ఈ వెబ్ సిరీస్‌లో తన పాత్ర గురించి వివరించారు. ఇందులో తాను బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించే పాత్రను చేసినట్టు తెలిపారు. ఎన్ ఎతిరే రెండు పాపా సిరీస్ పూర్తిగా పెద్దలు మెచ్చే హాస్యంతో చిత్రీకరించినట్టు పేర్కొన్నారు. తన పాత్ర ఎమోషనల్‌తో పాటు యువతుల అంతర్గత సంఘర్షణను ప్రతిబింబిస్తుందని వివరించారు. నేటి యుగంలో సంబంధాలు, ప్రేమ, నిబద్ధత తరచుగా అనేక జంటల్లో సాధారణంగా పరిగణించబడుతున్నాయన్నారు. చిన్న చిన్న సమస్యలకే విడిపోవడం సర్వసాధారణమయ్యాయని పేర్కొన్నారు. ఇందులో ప్రతి ఎపిసోడ్ కొత్త ఆవిష్కరణగా ఉంటుందని తెలిపారు.

వదంతులకు స్పందించను


లక్ష్మీమీనన్‌తో విశాల్

తమిళసినిమా: తమిళం, తెలుగు భాషల్లో ప్రముఖ కథానాయకుడిగా రాణిస్తున్న నటుడు విశాల్. నటుడిగా అభిమాన ధనం కలిగిన ఈయన సామాజిక సేవా కార్యక్రమాలకు ముందుంటారు. విశాల్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ అన్నది గమనార్హం. చాలాకాలంగా పలు రకాల వదంతులు ప్రచారం అవుతూనే ఉన్నాయి. కాగా సమీపకాలంలో విశాల్, లక్ష్మీమీనన్ ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్నారనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో హోరెత్తుతోంది. దీనిపై స్పందించిన తన ట్విట్టర్ ద్వారా ఆ ప్రచారాన్ని ఖండించారు. అందులో ఆయన పేర్కొంటూ సాధారణంగా తనపై వచ్చే వదంతులపై తాను స్పందించనన్నారు. అలా చేయడం వల్ల ఫలితం ఉండదనేది తన భావన అన్నారు. అయితే ఇప్పుడు నటి లక్ష్మీమీనన్‌తో తన వివాహం అని జరుగుతున్న ప్రచారాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నాను. కారణం ఇది పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. ఇందులో తనతో పాటు సంబంధించిన లక్ష్మీమీనన్ నటిగా కంటే ముందు ఒక అమ్మాయి అన్నారు. ఇలాంటి వదంతులతో ఒక యువతి వ్యక్తిగత జీవితాన్ని నాశనం చేయడంతో పాటు ఆమెకున్న గుర్తింపును పోగొడుతున్నారన్నారు. తాను ఎవరిని పెళ్లి చేసుకునేది తేదీ, సమయం గురించి పరిశోధనలు చేయడానికి అదేమి బెర్ముడా ట్రయాంగిల్ కాదన్నారు. సమయం వచ్చినప్పుడు తన పెళ్లి గురించి అధికారికంగా పిలుస్తానని అందుకు దేవుడు ఆశీర్వదించాలని విశాల్ పేర్కొన్నారు.

రాధికా శరత్‌కుమార్ @ 45


శరత్‌కుమార్‌కు కేక్ తినిపిస్తున్న రాధిక

తమిళ సినిమా: నటి రాధిక నటన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఎన్నో అద్భుతమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన బహుభాషా నటి ఆమె. ఆమె నిర్మాతగా పలు చిత్రాలు, సీరియళ్లు నిర్మించారు. ఆరుపదుల వసంతాలను దాటిన ఈమె ఇప్పటికీ నాట్ అవుట్‌గా నటిస్తూనే ఉన్నారు. నటిగా 45 వసంతాలను పూర్తి చేసుకున్నారు. 1978లో దర్శకుడు భారతీ రాజా కిళక్కే పోగుమ్ రయిల్ చిత్రం ద్వారా రాధికను కథానాయకిగా పరిచయం చేశారు. అది ఇప్పటికీ ఎవర్ గ్రీన్ చిత్రంగా నిలిచిపోయింది. ఆ చిత్రంలోని పూవరసంపు పూత్తాచ్చు అనే పాట ఇప్పటికీ తమిళనాడులో వాడ వాడలా మారుమోగుతూనే ఉంది. ఆ తర్వాత తమిళంలో వరుసగా చిత్రాలు చేస్తూ తెలుగు, హిందీ భాషల్లోనూ తన సత్తాను చాటారు రాధిక శరత్ కుమార్. సుమారు 100కు పైగా చిత్రాల్లో నటించారు. పలు జాతీయ, రాష్ట్ర అవార్డులను గెలుచుకున్నారు. ఆమె నిర్మించి, నటించిన ఒరు కాదల్ కథై చిత్ర దర్శకుడికి ఇందిరాగాంధీ అవార్డు వరించింది. కాగా ఈమె నటిగా 45 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం తన భర్త శరత్ కుమార్‌తో కలిసి కేక్ కట్ చేసి వేడుక జరుపుకున్నారు. ఆ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

వేట్టై మన్నన్ బూజు దులిపితే హన్సిక సంగతేంటి?


శింబు


హన్సిక

తమిళసినిమా: రజనీకాంత్ కథానాయకుడిగా జైలర్ చిత్రం గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలై వసూళ్ల వర్షం కురుస్తోంది. దీంతో ఈ చిత్ర దర్శకుడు నెల్సన్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నయనతార ప్రధాన పాత్ర పోషించిన కోలమావు కోకిల చిత్రంతో దర్శకుడిగా ఈయన పేరు వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత శివకార్తికేయన్ హీరోగా డాక్టర్ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆ చిత్రం అనూహ్య విజయంతో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. దాని తర్వాత విజయ్ కథానాయకుడిగా బీస్ట్ చిత్రానికి దర్శకత్వం వహించారు. మిశ్రమ స్పందన తెచ్చుకున్న ఈ చిత్రం కూడా రూ.200 కోట్లు వసూలు చేసింది. అసలు విషయం ఏమిటంటే ఈయన వీటన్నిటికంటే ముందుగా శింబు కథానాయకుడిగా వేట్టై మన్నన్ అని చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు. నటి హన్సిక నాయకిగా నటించిన ఈ చిత్రం కొంత భాగం షూటింగులు జరుపుకొని ఆ తర్వాత అనివార్య కారణాలతో ఆగిపోయింది. కాగా జైలర్ చిత్ర విజయం ఇచ్చిన ఉత్సాహంతో దర్శకుడు నెల్సన్ తన తొలి చిత్రం వేట్టై మన్నన్‌ను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై నటుడు శింబు దర్శకుడు నెల్సన్‌తో సంప్రదించినట్లు తెలిసింది. ఇదే కనుక నిజమైతే ఈ చిత్రం కథానాయకి హన్సిక సంగతి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. శింబు హన్సికల ప్రేమ వ్యవహారం తెలిసిందే. పెళ్లి చేసుకునే వరకు వెళ్లిన వీరి ప్రేమ చివరిలో ఆగిపోయింది. ఆ తర్వాత హన్సిక కథానాయకిగా ప్రధాన పాత్రలో నటించిన ఆమె 50వ చిత్రం మహాలో శింబు అతిథి పాత్రలో నటించారు. అదేవిధంగా వేట్టై మన్నన్ చిత్రాన్ని ఈ జంట కలిసి పూర్తి చేస్తారా అన్నదే ప్రశ్న. ఇదిలా ఉండగా దర్శకుడు నెల్సన్ తదుపరి ధనుష్ కథానాయకుడిగా చిత్రం చేయనున్నారనే ప్రచారం మరో పక్క జరుగుతోంది. దీంతో ఆయన తదుపరి చిత్రం ఏమిటన్నది క్లారిటీ రావాలంటే మరి కొద్ది రోజులు ఆగాల్సిందే.

క్లుప్తంగా

దొంగ అరెస్ట్

• 7 సవర్ల నగలు స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నై పల్లావరం సమీపంలోని ఇంటిలో 5 సవర్ల బంగారం, 5 కిలోల వెండి వస్తువులు రూ.లక్ష నగదు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని నుంచి 7 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు. పల్లావరం సమీపంలోని పమ్మల్ వవుసి నగర్, బాలాజీ వీధికి చెందిన అనురాధ సింగపూర్లో ఉంటున్నారు. ఆమె అప్పుడప్పుడూ చెన్నై వచ్చి వెళుతుంటారు. ఆమె ఇంటి మిద్దెపై ఒక కుటుంబం అద్దెకు ఉంటోంది. గురువారం అనురాధ ఇంటి తలుపులు తెరిచి వుండడం చూసిన అద్దె ఇంట్లో ఉంటున్నవారు యజమాని అనురాధకు, శంకర్ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. సింగపూర్ నుంచి చెన్నైకి వచ్చిన అనురాధ పోలీసుల సహాయంతో ఇంటిలో చూడగా బీరువాలో ఉంచిన 5 సవర్ల నగలు, 5 కిలోల వెండి వస్తువులు, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీసీ పుటేజీ ఆధారంగా గురువారం సాయంత్రం పమ్మల్ ఈశ్వర నగర్ 10 వీధికి చెందిన జ్ఞానమూర్తి (39)ని అరెస్టు చేశారు. అతని నుంచి 7 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు. జ్ఞానమూర్తిని కోర్టులో హాజరపరిచి జైలుకు తరలించారు.

ఫిట్స్‌తో స్పృహ తప్పిన ప్రయివేటు కార్మికుడి మృతి

తిరువళ్లూరు: పిట్స్ రావడంతో స్పృహ తప్పిన ప్రయివేటు కార్మికుడు మృతి చెందాడు. కేరళ రాష్ట్రం ఎర్నాకుళం జిల్లాకు చెందిన జయప్రకాష్ కుమారుడు అర్జున్(32) గుమ్మిడిపూండిలో నివాసం వుంటూ స్థానికంగా వున్న వెంచర్ ఆటోమోటివ్ అనే ప్రయివేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం విధులకు వెళ్లి రాత్రి పది గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో హఠాత్తుగా పిట్స్ రావడంతో స్పృహ కోల్పోయాడు. అతన్ని కుటుంబ సభ్యులు, బంధువులు స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

తిరువళ్లూరు: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా చిన్న చాకలికుప్పం గ్రామానికి చెందిన మురుగన్ కుమారుడు సూర్య(17). ఇతను గత 9న పురుగులమందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన బంధువులు వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి మురుగన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పసికందు సురక్షితం



అన్నానగర్: ధర్మపురి ప్రభుత్వాసుపత్రి కాంప్లెక్స్‌లో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు ఆడశిశువును వదిలి వెళ్లారు. చిన్నారి ఏడుపు విన్న కార్మికులు రక్షించారు. ఈ విషయం తెలుసుకున్న ఆస్పత్రి యాజమాన్యం చిన్నారిని ధర్మపురి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించింది. అక్కడ ఆడబిడ్డను చూసుకుంటున్నారు. ఈ చిన్నారి తల్లిదండ్రులు ఎవరన్న విషయం తెలియరాలేదు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి వివరాలు తెలిసిన వారు సంబంధిత పత్రాలతో ధర్మపురి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారిని సంప్రదించాలని కోరారు.

లారీని ఢీకొన్న బైక్

• ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

తిరువళ్లూరు: లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. తిరువళ్లూరు జిల్లా ఆమూరు గ్రామానికి చెందిన నిత్యానందం కుమారుడు ధనంజయన్(25). ఇతను అదే ప్రాంతానికి చెందిన గోవిందరాజ్ కుమారుడు రాహుల్(19). వీరిద్దరు స్థానికంగా వున్న పళనిమురుగన్ వర్క్‌షాపులో పనిచేస్తున్నారు. వీరిద్దరు విధులు ముగించుకుని గురువారం రాత్రి పది గంటలకు ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరారు. పొన్నేరి ఆర్టీఓ కార్యాలయం వద్ద వెళుతుండగా ముందు వెళుతున్న లారీ డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో ద్విచక్రవాహనం లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చిక్సిత అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ధనంజయన్ మృతిచెందాడు. మృతుడి మేనమామ వెంకటేషన్ సిప్‌కాట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాపీమేస్త్రీ హత్య కేసులో ఆరుగురి అరెస్ట్

తిరువొత్తియూరు: దిండుగల్లు సమీపంలో తాపీమేస్త్రీ హత్య కేసులో బాలుడు సహా ఆరుగురిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దిండుగల్లు సమీపంలో ఉన్న పాన్ మాందురుపట్టికి చెందిన ఇరులప్పన్ (40) మేస్త్రీ. ఇతను గత 7వ తేదీ ఇంటిలో నిద్రపోతుండగా అక్కడికి వచ్చిన ముఠా కత్తులతో దాడి చేసే హత్య చేశారు. ఈ కేసులో రెంగు మూర్తి (40), వినోద్ (23), రంజిత్ కుమార్ (21), భూపతి రాజా (20) కోర్టులో సరండర్ అయ్యారు. ఇదే కేసులో గురువారం పోలీసులు బాలుడుసహా ఆరుగురిని అరెస్ట్ చేశారు.

కిలో బంగారం, రూ.5లక్షలు చోరీ

• ఇద్దరు అరెస్ట్
• పరారీలో ఆరుగురు
• కిలో బంగారం, రూ.5 లక్షలు రికవరీ



అరెస్టయిన యువకులు, స్వాధీనం చేసుకున్న నగలు

తిరువళ్లూరు: నగల వ్యాపారిని కత్తితో బెదిరించి కిలో బంగారం, రూ.5లక్షల నగదు దోచుకెళ్లిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి కిలో నగలు, రూ.5లక్షలు రికవరీ చేశారు. చెన్నై సౌకారుపేటకు చెందిన శేషారామ్(25). ఇతను బంగారు నగలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి వాటిని తిరువళ్లూరు సమీప ప్రాంతాల్లోని బంగారు వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఏడు గంటలకు బంగారు నగలు విక్రయించి మిగిలిన కిలో బంగారంతో పాటు దుకాణాల నుంచి వసూలు చేసిన రూ.5 లక్షలతో ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. తిరువళ్లూరు జిల్లా తొయ్యూరు వద్ద వెళుతుండగా బైకుల్లో వచ్చిన ఎనిమిది మంది యువకులు శేషారామ్‌ను అడ్డుకుని కత్తులతో బెదిరించి అతడి వద్ద వున్న కిలో బంగారు నగలు, రూ.5లక్షల నగదు దోచుకెళ్లారు. బాధితుడు సెవ్వాపేట పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అప్రమత్తమైన సెవ్వాపేట పోలీసులు వేపంబట్టుతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో ముమ్మరంగా వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా వెళుతున్న ఇద్దరు యువకులు పోలీసులను చూడగానే తప్పించుకునే ప్రయత్నం చేశారు. ద పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని విచారణ చేశారు. విచారణలో పట్టుబడిన యువకులు ఒదికాడుకు చెందిన శరవణన్(21), యువరాజ్(17)గా గుర్తించారు. వీరు నగల వ్యాపారిని బెదిరించి కిలో బంగారు నగలు, నగదు దోచుకెళ్లినట్లు నేరం ఒప్పుకున్నారు. వీరిని అరెస్టు చేసిన పోలీసులు కిలో బంగారం, రూ.5లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. పరారీలో వున్న ఆరుగురి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది.

రైతులతో మంత్రి నెహ్రూ చర్చలు



రైతులతో మాట్లాడుతున్న మంత్రి నెహ్రూ

కొరుక్కుపేట: తిరుచ్చిలోని అన్నాసిలై దగ్గర ఆందోళన చేస్తున్న రైతులతో శుక్రవారం మంత్రి కేఎన్ నెహ్రూ చర్చలు జరిపారు. కేంద్ర ప్రభుత్వం మేఘదాతు విల్ డ్యామ్‌ను నిర్మించకుండా ఆపాలని, కావేరి నది అనుసంధానానికి నిధులు కేటాయించాలని కోరుతూ రైతు సంఘం సభ్యులు జూలై 28 నుంచి నిరసన దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి కేఎన్.నెహ్రూ శుక్రవారం జాతీయ సౌత్ ఇండియన్ నదుల అనుసంధాన అగ్రికల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యాకన్‌తో చర్చలు జరిపారు. టమాటాతోపాటు కూరగాయలను భద్రపరిచేందుకు తిరుచ్చిలో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తామని, కావేరి నుంచి తగిన నీటిని తెచ్చుకునేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్తున్నారని ఆయన తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని, సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు మళ్లీ కోర్టును ఆశ్రయిస్తామని హామీ ఇచ్చారు.

తల్లీ కూతుళ్లు బలవన్మరణం

అన్నానగర్: కుమారి జిల్లా అంజు గ్రామ సమీపంలో ఓ తల్లి తన ఇద్దరు కూతుళ్ల సహా ఆత్మహత్యకు పాల్పడింది. కన్యాకుమారి జిల్లా అంజు విలేజ్ సమీపంలో అలగప్పపురం నగర్ ప్రాంతానికి చెందిన ప్రభువు ఏసుదాసన్. ఇతని భార్య అనిత (45). వీరికి సకాయ దివ్య (19), సహాయ పూజా మౌలిక (16) ఇద్దరు కుమార్తెలు. ఏసుదాసన్ పదేళ్ల క్రితం మృతిచెందాడు. సహాయ దివ్య ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతోంది. సహాయ పూజా మౌలిక ప్లస్‌ఒన్ చదువుతోంది. భర్త మృతిచెందడంతో ఆదుకునే వారు లేకపోవడంతో అనిత మనోవేదనకు గురవుతోంది. దీంతో ఆమె తరచూ అనారోగ్యానికి గురయ్యేది. అనారోగ్యంతో తాను చనిపోతే కూతుళ్లను ఎవరూ చూసుకుంటారని ఆమె మనస్తాపానికి గురైంది. ఈ స్థితిలో శుక్రవారం ఉదయం చాలా సేపటికీ అనిత ఇంటి తలుపులు తెరవలేదు. అనుమానించిన ఇరుగుపొరుగు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ అనిత, సహాయ దివ్య, సహాయ పూజా మౌలిక గదిలో ఉరి వేసుకుని ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందారు. పోలీసులు ముగ్గురి మృతదేహాలను కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం ఆచారిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గదిలో సూసైడ్ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తల్లీకూతుళ్ల ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆ ప్రాంతంలో పెను విషాదాన్ని నింపింది.

విద్యార్థులను వేధించిన హెచ్‌ఎం అరెస్ట్

తిరువొత్తియూరు: మేట్టూరు సమీపంలో పాఠశాల విద్యార్థులను మసాజ్ చేయమని వేధించిన ప్రధానోపాధ్యాయుడిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. సేలం జిల్లా మేట్టూరు సమీపంలోని కొలతూరు పంచాయతీలో యూనియన్ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ 144 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడు రాజా ఐదవ తరగతి విద్యార్థులను తన గదికి పిలిపించి చేతులు, కాళ్లు పట్టాలని, మసాజ్ చేయాలని వేధిస్తున్నాడు. దీనిపై పిల్లలు తల్లిదండ్రులకు తెలిపారు. తల్లిదండ్రులు గురువారం పాఠశాలను ముట్టడించారు. సమాచారం అందుకున్న ఆర్డీవో తనికాచలం, తహసీల్దారు ముత్తురాజా, ఎంఈవో చిన్నరాసు అక్కడికి చేరుకుని విచారించారు. తల్లిదండ్రులు మళ్లీ మేట్టూరు - మైసూరు రోడ్డులో ఆందోళనకు దిగారు. మేట్టూర్ మహిళా పోలీసులు అక్కడికి చేరుకుని ప్రధానోపాధ్యాయుడు రాజాను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు



అన్నానగర్: సురండై సమీపంలో ఓ మహిళను కొట్టి చంపిన కేసులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి జీవిత ఖైదు విధిస్తూ తెన్‌కాశి కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెన్‌కాసి జిల్లా సురండై సమీపంలోని వీరనం రాజా ఎస్టేట్‌కు చెందిన కరుప్పసామి భార్య పచ్చియమ్మాళ్. ఈమె తోబుట్టువు కరుత్తాత్తాల్ (60). తన పేరున ఇంటిని రిజిస్టర్ చేయాలని పాచియమ్మాళ్‌ను కోరాడు. అందుకు నిరాకరించడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆగస్టు 24, 2014న కరుప్పసామి మదురై వెళ్లాడు. అప్పుడు పిచ్చయమ్మాల్ ఇంటికి కరుత్తాత్తాల్ ఈమె భర్త పిచ్చయ్య, కొడుకు దురై ముత్తు (44), కూతురు మరియమ్మాళ్ (40) వెళ్లారు.అనంతరం నలుగురు వ్యక్తులు పిచ్చయమ్మాళ్‌ను తమ ఇంటికి తీసుకొచ్చి ఇంటిని రాసివ్వాలని ఒత్తిడి చేశారు. కానీ ఆమె నిరాకరించడంతో నలుగురు పిచ్చయమ్మాల్‌ని హత్య చేశారు. వీరకేరళంబుదూరు పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ఈ కేసు తెన్‌కాసి కోర్టులో విచారణ జరుగుతోంది. నిందితుల్లో ఒకరైన పిచ్చయ్య మృతిచెందాడు. బుధవారం ఈ కేసు తెన్‌కాశి అదనపు జిల్లా జడ్జి అనురాధ ఎదుట విచారణకు వచ్చింది. కేసును విచారించిన అనంతరం నిందితులైన కరుత్తాత్తాల్, దురైముత్తు, మరియమ్మాళ్‌లకు జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని బాలిక ఆత్మహత్య

అన్నానగర్: కాట్టూరు సమీపంలో సెల్‌ఫోన్ కొనివ్వలేదని ప్లస్‌ఒన్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అరియలూరు జిల్లా, ఎగ్రునాచిపురం, కాట్టూర్ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమార్తె కావ్య (17). ఈమె ప్లస్‌ఒన్ చదువుతుంది. ఈ నేపథ్యంలో కావ్య తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులను కోరింది. ప్రస్తుతం డబ్బులు లేవు వచ్చాక తీసుకుందామని చెప్పాడు. మనస్తాపం చెందిన కావ్య గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న తిరుమానూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరియలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై గుర్రం దాడి : కొట్టి చంపిన ప్రజలు

అన్నానగర్: కడలూరులోని సిల్వర్ బీచ్‌లో గురువారం ముగ్గురిపై దాడి చేసిన గుర్రాన్ని ప్రజలు కొట్టి చంపారు. కడలూరు దేవనాం పట్టినంకు చెందిన శివకుమార్ కుమారుడు లోకేశ్వరన్ (15). ఇతను కడలూరు కార్పొరేషన్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం స్కూల్ ముగిశాక లోకేశ్వరన్ దేవనాం పట్టినం సిల్వర్ బీచ్‌కి వెళ్లాడు. ఆ తర్వాత గుర్రపు స్వారీ చేస్తున్న దగ్గరికి వెళ్లగా, ఒక్కసారిగా గుర్రం లోకేశ్వరన్‌పై దాడి చేసింది. అలాగే సిల్వర్‌బీచ్‌లో బ్యాగ్ షాప్ నిర్వహిస్తున్న దేవనాం పట్టణానికి చెందిన పద్మావతి (65), సాక్కలింగ వీధికి చెందిన రవి భార్య తేన్‌మొళిపై కూడా దాడి చేసింది. ఇది చూసిన ప్రజలు గుర్రంపై రాళ్లు, కర్రలతో దాడి చేసి చంపేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు కృష్ణ తేజ అతిథి గృహం వరకు బారులు తీరారు. గురువారం అర్ధరాత్రి వరకు 57,443 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 28,443 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.90 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

యువతి హత్య

• బావిలో మృతదేహం లభ్యం

తిరువొత్తియూరు: తెన్‌కాశి సమీపంలో అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే తోటలోని బావిలో హత్యకు గురైన యువతి మృతదేహాన్ని వెలికి తీశారు. తెన్‌కాశి జిల్లా కడైయలూరు చేరందం తాంబరం రోడ్డులో వలసయి గ్రామం లో కండమ్మాల్ కులత్తురై సమీపం పులియంకుడికి చెందిన మాజీ అన్నాడీఎంకే ఎమ్మెల్యే దురైయప్పాకు వ్యవసాయ తోటలో బావి ఉంది. బావిలో ఉన్న గోనెసంచిలో నుంచి దుర్వాసన రావడంతో పోలీసులు అక్కడకు చేరుకుని బావి నుంచి గోనెసంచిని బయటికి తీశారు. అందులో 25 ఏళ్ల యువతి హత్యకు గురై శవంగా ఉంది. పోలీసులు మృతదేహాన్ని శవ పరీక్ష కోసం ప్రభుత్వ నెల్లై ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గూండా చట్టం కింద ఇద్దరి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై విరుగంబాక్కంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు గుండా చట్టం కింద అరెస్టు చేశారు. చెన్నై విరుగుంబాక్కంకు చెందిన గంజాయి వ్యాపారి వెంకటేశ పెరుమాల్ అలియాస్ సైమన్ (29) 5 కేసులు ఉన్నాయి. అతని సహచరుడు ప్రసన్న (27)పైనా 2 గంజాయి కేసులు ఉన్నాయి. గత నెల 14వ తేదీన విరుగంబాక్కం ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న వెంకటేశ పెరుమాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే గత నెల 20వ తేదీ మధురవాయల్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ప్రసన్నను అరెస్టు చేసి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వారిపై గూండా చట్టం నమోదు చేయాలని ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ మనోహరన్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్‌కు సిఫారుసు చేశారు. దీంతో వెంకటేశ పేరుమాల్, ప్రసన్నను గుండా చట్టంలో అరెస్టు చేసేందుకు చెన్నై కార్పొరేషన్ కమిషనర్ సందీప్ రాథోర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఇద్దరినీ అరెస్టు చేసి పుళల్ జైలుకు తరలించారు.

మూడు బాంబులు స్వాధీనం

తిరువొత్తియూరు: తిరుచ్చిలో ముళ్ల పొదల్లో దాచి ఉంచిన మూడు నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి, అరియ మంగళం, ది డీర్‌నగర్ సమీపంలో ఉన్న ముళ్లపొదల్లో నాటు బాంబులు దాచి ఉంచినట్లు పోలీసు కమిషనర్ కామినికి సమాచారం అందింది. కమిషనర్, ప్రత్యేక బృందం పోలీసులు బాంబు స్క్వాడ్ నిపుణులు అక్కడికి చేరుకుని తనిఖీ చేశారు. అక్కడ మూడు నాటు బాంబులు ఉన్నట్లు కనుగొన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు.అరియ మంగళం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న చెంగాళమ్మకు పుష్పయాగం

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిజ శ్రావణమాసం తొలి శుక్రవారం ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ చెన్నైకు చెందిన నంబూరు మోహన్‌రావు–సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి–లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించనున్నట్లు వెల్లడించారు.

అవినీతి కేసులో మహిళా వీఏఓ అరెస్ట్



కొరుక్కుపేట: సర్వే నంబర్ కోసం ఓ వ్యాపారి నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన మహిళా వీఏఓను అరెస్ట్ చేశారు. ఇళంగోవన్ స్వస్థలం తంజావూరు రామకృష్ణాపురం. ఇతను వ్యాపారవేత్త. ఇతనికి గురువడ్డిపట్టి గ్రామంలోని మూడు సర్వే నంబర్లలో భూమి ఉంది. ఇందుకోసం పట్టా పేరు మార్చుకోవాలని కోరుతూ ఈనెల 3న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా వ్యాపారి కంపెనీ మేనేజర్ ఆంథోని యాగప్ప గురువాడిపట్టి గ్రామ నిర్వాహకురాలు వీరలక్ష్మి(45)తో మాట్లాడారు. తర్వాత వీరలక్ష్మి మూడు సర్వే నంబర్లకు రూ.10 వేలు చొప్పున రూ.30 వేలు లంచం ఇస్తే పట్టా మారుస్తానన్నారు. లంచం ఇవ్వడానికి ఇష్టపడని ఇలంగోవన్ తన మేనేజర్ ద్వారా తంజావూరు అవినీతి నిరోధక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి సలహా మేరకు అంథోని యాగప్ప గురువారం తంజావూరు తహసీల్దార్ కార్యాలయంలోని మీసేవ కేంద్రంలో ఉన్న వీఏఓ వీరలక్ష్మికి చెప్పారు. అనంతరం వీఏఓ వీరలక్ష్మికి లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ నందగోపాల్ నేతృత్వంలో పోలీసులు ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. శుక్రవారం ఉదయం ఆమెను కుంభకోణం ప్రధాన క్రిమినల్ కోర్టులో హాజరుపరిచారు. ఈనెల 28వ తేదీ వరకు ఆమెను కస్టడీలో ఉంచాలని న్యాయమూర్తి ఆదేశం మేరకు వీరలక్ష్మిని తంజావూరు జైలుకు తరలించారు. ఆమె భర్త నెల్లై జైళ్ల శాఖలో ఎస్‌ఐ కావడం గమనార్హం.

ప్రియురాలి భర్తను హత్య చేసిన వ్యక్తి లొంగుబాటు

తిరువొత్తియూరు: తిరుచ్చి సమీపంలో ప్రియురాలి భర్తను హత్య చేసిన వ్యక్తి పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. తిరుచ్చి తిరువెరంబూర్ కీల్ కుమరేశపురం మారియమ్మన్ ఆలయ వీధికి చెందిన శరవణన్ (48) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సౌందర్యవల్లి (45), ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సౌందర్యవల్లి తిరువెరుంబూర్ ఎలిల్ నగర్‌లో ఉన్న ప్రైవేటు బాలాజీ సంస్థలో పనిచేస్తోంది. అక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న రాధాకృష్ణన్ (55)తో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో సౌందర్యవల్లి చెన్నైలో వున్న కుమార్తె వద్దకు వెళ్లింది. గురువారం రాత్రి రాధాకృష్ణన్ శరవణన్ ఇంటికి వచ్చి మద్యం తాగాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహం చెందిన రాధాకృష్ణన్ కత్తితో శరవణన్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్నైలో ఉన్న సౌందర్యవల్లికి రాధాకృష్ణన్ సమాచారం అందించాడు. తర్వాత అతను స్టేషన్లో లొంగిపోయాడు. పోలీసులు అతన్ని అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

తీర్థయాత్రకు వెళుతూ కానరాని లోకాలకు

• వ్యాన్ ఢీకొని ఇద్దరు మహిళలు మృతి

కొరుక్కుపేట: తీర్థయాత్రలకు వెళుతూ వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మృతిచెందిన సంఘటన వెంబకోట్టైలోని తాయిల్‌పట్టి సమీపంలో జరిగింది. విరుదునగర్ జిల్లా సమీపంలోని కాశీ సుబ్రమణ్యపురం ప్రాంతానికి చెందిన షణ్ముక ప్రియ (19), పళనియమ్మాళ్ (35), ముత్తులక్ష్మి(38) గ్రామస్తులతో కలిసి స్వామి దర్శనార్థం శివకాశీ నుంచి సాత్తూర్ సమీపంలోని ఇటంకుడి మారియమ్మన్ ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్నారు. తెల్లవారుజామున వెంబకోట్టైలోని తాయిల్‌పట్టి సమీపంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో షణ్ముకప్రియ, పళనియమ్మాళ్ అక్కడికక్కడే మృతిచెందారు. ముత్తులక్ష్మి, డ్రైవర్ గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని డ్రైవర్ చంద్ర, గోపి (45)ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

లైంగికదాడి కేసులో ముగ్గురి అరెస్ట్

అన్నానగర్: పల్లడం సమీపంలో బుధవారం బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. తిరుపూర్ జిల్లా పల్లడం ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల యువతి బుధవారం కొసవాంపాలయం రోడ్డుపై స్నేహితుడితో మాట్లాడుతోంది. అటుగా వెళ్తున్న పల్లడం అన్నానగర్‌కు చెందిన రమేష్‌కుమార్ (31), జాన్సన్ (26), ఊంచిపాలేనికి చెందిన పార్థిబన్ (25) స్నేహితుడిని అక్కడే వదిలిపెట్టి, బెదిరించి బాలికను పోలీస్‌స్టేషన్‌కు అని తీసుకెళ్లారు. అనంతరం ముగ్గురు కలిసి బాలికను కలివేలంపట్టి సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి సామూహికంగా లైంగికదాడికి పాల్పడ్డారు. బాలిక పల్లడం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు రమేష్‌కుమార్, జాన్సన్, పార్థిబన్‌ను అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి తిరుపూర్ జిల్లా జైలుకు తరలించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



రామగుణ (ఫైల్)



చికిత్స పొందుతున్న మదివానన్

తిరువళ్లూరు: గుంతలో పడిన ఇద్దరు యువకుల్లో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. తిరువళ్లూరు జిల్లా పూందమల్లిలో మెట్రో నిర్మాణాలు, వర్షపు నీరు వెళ్లడానికి కాలువ తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో పాటు పూందమల్లి, బెంగళూరు హైవే, కుమనన్‌చావడి, చెన్నీర్‌కుప్పం ప్రాంతాల్లో సబ్‌వేలో విద్యుత్ వైర్లను పూడ్చడానికి భారీగా గుంతలు తవ్వారు. ఈ నేపథ్యంలో తంజావూర్ జిల్లా పడపైకాడు గ్రామానికి చెందిన రామగుణ(22), మధివానన్(24)ఇద్దరు పూందమల్లిలో నివాసం ఉంటూ చెన్నైలోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నట్టు తెలిసింది. ఇద్దరూ కలిసి గురువారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరారు. ఈ సమయంలో పూందమల్లి సమీపంలో వెళుతుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని విద్యుత్ వైర్లు పాతడానికి తీసిన గుంతల్లో పడింది. ఈ ప్రమాదంలో రామగుణ అక్కడికక్కడే మృతిచెందగా మదివానన్ తీవ్రంగా గాయపడ్డారు. పూందమల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లంచం కేసులో మహిళా అధికారి అరెస్ట్



అన్నానగర్: కాట్టాంగలత్తూరు సమీపంలో గురువారం ఆడపిల్లలకు స్కాలర్ షిప్ ఇప్పించేందుకు రూ.1800 లంచం తీసుకుంటున్న ఓ మహిళా అధికారిని ఏసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. చెంగల్‌పట్టు జిల్లా సింగపెరుమాళ్ ఆలయ ప్రాంతానికి చెందిన సుబ్రమణి. ఇతనికి ఇద్దరు కుమార్తెలు. తమిళనాడు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ అమలు చేస్తున్న బాలికల శిశు రక్షణ పథకం కింద అందించిన స్కాలర్‌షిప్ పొందేందుకు అతను కాట్టాంగళత్తూరు జిల్లా అభివృద్ధి కార్యాలయంలోని సాంఘిక సంక్షేమ అధికారికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి కస్తూరిని స్వయంగా కలిసి దరఖాస్తు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.2 వేలు చెల్లిస్తే స్వీకరిస్తామని కస్తూరి సుబ్రమణితో చెప్పినట్లు సమాచారం. రూ.1800 ఇస్తానని చెప్పి కార్యాలయం నుంచి వెళ్లిపోయాడు. లంచం ఇవ్వడానికి ఇష్టపడని సుబ్రమణి ఈ విషయాన్ని చెంగల్పట్టు ఏసీబీ పోలీసులకు తెలిపాడు. చెంగల్‌పట్టు ఏసీబీ పోలీసులు సుబ్రమణికి రసాయనాలు పూసిన రూ.1800 నోట్లను ఇచ్చి పంపించారు. గురువారం తెల్లవారుజామున కాటంగలత్తూరు ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయంలో సాంఘిక సంక్షేమ అధికారి కస్తూరికి డబ్బు ఇస్తుండగా, అక్కడే ఉన్న చెంగల్‌పట్టు ఏసీబీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు.

పసుపు @ రూ.11,750

ప్రభుత్వ జోక్యంతో నెలలోనే రెట్టింపైన ధర

- జూన్‌లో రూ.5,300 నుంచి రూ.6,250 మధ్య ధర
- సీఎం ఆదేశాలతో ఎమ్మెస్పీ రూ.6,850 చొప్పున కొనుగోలు
- రూ.34.39 కోట్ల విలువైన 5,020 టన్నుల పసుపు సేకరణ
- ప్రభుత్వ జోక్యంతో వ్యాపారుల మధ్య పెరిగిన పోటీ
- కనీస మద్దతు ధరకు మించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ప్రస్తుతం రూ.8,200 నుంచి రూ.11,750 మధ్య పలుకుతున్న పసుపు ధర
- ఈసారి రూ.15 వేలు దాటే అవకాశం ఉందని అంచనా





సాక్షి, అమరావతి: ప్రభుత్వ చర్యలు ఫలించాయి. పసుపు ధర అమాంతం పెరిగింది. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ధర లభిస్తుండడంతో రైతులు ఎంతో సంతోషిస్తున్నారు. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన దుగ్గిరాల పసుపు మార్కెట్‌లో శుక్రవారం క్వింటా పసుపు ధర రూ.11,750 పలికింది. ఈ స్థాయి ధర చరిత్రలో ఎన్నడూ లభించలేదని రైతులు చెబుతున్నారు. మరోవైపు ఈసారి క్వింటా రూ.15 వేలు దాటే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2022–23 సీజన్‌లో రాష్ట్రంలో 84 వేల ఎకరాల్లో పసుపు సాగవగా 4 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. సాధారణంగా 50 శాతం రాష్ట్ర పరిధిలో వినియోగిస్తుండగా, 20 శాతం పొరుగు రాష్ట్రాలకు, 30 శాతం ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. కేంద్రం కనీస మద్దతు ధరలు ప్రకటించే పంటల జాబితాలో లేని పసుపునకు గత నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటిస్తోంది. 2022–23 సీజన్‌లో పసుపునకు కనీస మద్దతు ధర రూ.6,850గా ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ధర తగ్గిన ప్రతిసారి రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. టీడీపీ ఐదేళ్ల పాలనలో 28,563 మంది రైతుల నుంచి రూ.305 కోట్ల విలువైన 48,540 టన్నుల పసుపును సేకరిస్తే, 2019–20 నుంచి ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 28,724 మంది రైతుల నుంచి రూ.437.24 కోట్ల విలువైన 56,536 టన్నుల పసుపును సేకరించింది. ప్రభుత్వ చర్యల ఫలితంగా దాదాపు రెండున్నరేళ్లపాటు పసుపు రైతుకు మంచి ధర లభించింది. ఒక దశలో క్వింటా రూ.10 వేలకుపైగా పలికింది. రబీ 2022–23 సీజన్ ప్రారంభంలో రూ.7 వేల నుంచి రూ.8 వేల మధ్య పలికిన పసుపు ధర ఆ తర్వాత మేలో అనూహ్యంగా ఎమ్మెస్పీ కన్నా దిగువకు పడిపోయింది. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులకు తోడు దేశీయంగా పసుపు పంట ఒకేసారి రావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సీఎం యాప్ ద్వారా మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న ప్రభుత్వం ధరలు తగ్గిన వెంటనే క్షణం కూడా ఆలోచించకుండా పసుపు రైతుకు అండగా నిలిచింది. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద మార్కెట్‌లో జోక్యం చేసుకుని వ్యాపారులతో పోటీపడి రైతుల నుంచి కనీస మద్దతు ధర రూ.6,850 చొప్పున పసుపు కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. ఆర్బీకేల ద్వారా 2,794 మంది రైతుల నుంచి రూ.34.39 కోట్ల విలువైన 5,020 టన్నుల పసుపును రైతుల నుంచి సేకరించింది. ప్రభుత్వ జోక్యంతో వ్యాపారులు కూడా పోటీపడి కనీస మద్దతు ధరకు మించి కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. దీంతో ధరలు మళ్లీ ఎమ్మెస్పీకి మించడంతో ప్రభుత్వం కొనుగోళ్లను నిలిపేసింది. క్వాలిటీని బట్టి ఈ ఏడాది జూన్‌లో క్వింటా రూ.5,300 నుంచి రూ.6,250 మధ్య పలికిన పసుపు జూలై వచ్చేసరికి రూ.8 వేల నుంచి రూ.10,511 మధ్య పలికింది. ఆగస్టులో గత ఏడాది క్వింటా రూ.5 వేల నుంచి రూ.6,300 మధ్య పలకగా, ప్రస్తుతం రూ.8,200 నుంచి రూ.11,750 పలుకుతోంది.

పెట్టుబడి పోను రూ.5 లక్షలు మిగులుతోంది.



మూడెకరాల్లో పసుపు వేశా. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. మంచి దిగుబడి వచ్చింది. రెండునెలల కిందట రూ.5 వేలకు మించి పలకకపోవడంతో పెట్టుబడి కూడా దక్కదేమోనని ఆందోళన చెందాను. ప్రభుత్వం జోక్యం చేసుకుని కొనుగోలు చేయడంతో మళ్లీ ధరలు పెరిగాయి. శుక్రవారం 100 క్వింటాళ్లు మార్కెట్‌కు తీసుకొచ్చా. క్వింటా రూ.11,100 చొప్పున కొన్నారు. రూ.11 లక్షలకుపైగా ఆదాయం వచ్చింది. పెట్టుబడిపోను రూ.5 లక్షలకు పైగా మిగులుతోంది. చాలా ఆనందంగా ఉంది.

– ఎస్.రాము, చింతమోటు, భట్టిప్రోలు మండలం బాపట్ల జిల్లా

ఈ స్థాయి ధర ఎప్పుడూ రాలేదు



ఒకటిన్నర ఎకరాలో సాగుచేశా. ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నెలన్నర కిందటి ధరతో పోలిస్తే రెట్టింపు ధర లభించింది. ప్రభుత్వం కొనడం మొదలు పెట్టిన తర్వాత రేటు పెరుగుతూ వస్తోంది. ఈరోజు 44 క్వింటాళ్ల పసుపు తీసుకొచ్చాను. క్వింటా రూ.11 వేలకు కొన్నారు. ఈ స్థాయి ధర గతంలో ఎప్పుడూ లభించలేదు. చాలా సంతోషంగా ఉంది.

– ఎ.వెంకటసుబ్బయ్య, పోరుమామిళ్ల, వైఎస్సార్ జిల్లా

ధర మరింత పెరిగే అవకాశం



ప్రభుత్వ జోక్యంతోపాటు డిమాండ్‌కు తగ్గ సరుకు లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. దుగ్గిరాల మార్కెట్ పరిధిలోని కోల్డ్ స్టోరేజ్‌ల్లో మూడులక్షల టన్నుల పసుపు ఉంది. రైతుల వద్ద మరో మూడులక్షల టన్నుల సరుకు ఉంది. కొల్లిపర, లంకల ఏరియా, సత్తెనపల్లి, పిడుగురాళ్లతో పాటు వైఎస్సార్ జిల్లా నుంచి రోజూ 30–40 లారీల పసుపు వస్తోంది. ధర మరింత పెరిగే అవకాశం ఉంది. – ఎన్.శ్రీనివాసరావు, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ యార్డు, దుగ్గిరాల

ప్రభుత్వ జోక్యం వల్లే..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎం యాప్‌ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ మార్కెట్‌లో కనీస మద్దతు ధర దక్కని పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఇలా ఈ సీజన్‌లో రూ.513.94 కోట్ల విలువైన పంట ఉత్పత్తులను కొనుగోలు చేశాం. ప్రభుత్వ జోక్యం వల్లనే నెల తిరక్కుండానే పసుపునకు మంచి ధర లభిస్తోంది. మొక్కజొన్న క్వింటా రూ.2 వేలకు పైగా పలుకుతుండగా, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పసుపు ధర క్వింటా రూ.11,750 పలుకుతోంది.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

క్లుప్తంగా...

21న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో కనీస నీటి మట్టాలకు ఎగువన నీటిలభ్యత, 2 రాష్ట్రాల అవసరాలపై చర్చించి.. నీటిని పంపిణీ చేయడమే అజెండాగా ఈ నెల 21న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశమవుతోంది. కృష్ణా బోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయ్‌పురే అధ్యక్షతన హైదరాబాద్‌లో బోర్డు కార్యాలయంలో జరిగే ఈ భేటీలో ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాల ఆధారంగా తెలుగు రాష్ట్రాలకు నీటిని కేటాయిస్తూ..బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

'వంశధార ట్రిబ్యునల్' కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: వంశధార ట్రిబ్యునల్ ఆదేశాలను సవాల్ చేస్తూ ఒడిశా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్‌దత్తాల ధర్మాసనం ముందుకొచ్చింది. వాదనలు వినాల్సి ఉన్నందున విచారణను నవంబర్ 7వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, న్యాయవాది రాజగోపాలరావు, ఒడిశా తరఫున సీనియర్ న్యాయవాది గోపాలసుబ్రమణియం, న్యాయవాది రాధేశ్యాం జెనా హాజరయ్యారు.

పార్టీ మార్పు ప్రతిపక్షాల మైండ్‌గేమ్ మాత్రమే

మాజీ మంత్రి బాలినేని స్పష్టీకరణ



ఒంగోలు: తాను వైఎస్సార్ సీపీలో తొలి నుంచి ఉన్నానని, తాను పార్టీ మారడం అనేది కేవలం ప్రతిపక్షాల మైండ్‌గేమ్ మాత్రమే అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తనను కలసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పార్టీ మారుతున్నానని ఎప్పుడైనా చెప్పానా? పార్టీ ఎందుకు మారాలో ప్రచారం చేస్తున్న వారిని అడగాలని బాలినేని అన్నారు. తాను వైఎస్ జగన్ సారథ్యంలోనే పనిచేస్తానని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తోన్న మైండ్‌గేమ్‌ను ఎవరు నమ్మాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయంపై ఇంతకంటే ఎక్కువ మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు.

గూడ్స్ మార్గంలో పాసింజర్ రైళ్లను అనుమతించండి

రైల్వేమంత్రికి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను వినతి



రైల్వే మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ఉదయభాను

సాక్షి, న్యూఢిల్లీ: విజయవాడ నుంచి జగ్గయ్యపేట, విష్ణుపురం మీదుగా సికింద్రాబాద్ గూడ్స్ మార్గంలో పాసింజర్ రైళ్లను అనుమతించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి తదితరులతో కలిసి కేంద్రమంత్రిని కలిసి వినతి పత్రమిచ్చారు. ఏపీ భవన్‌లో ఉదయభాను మీడియాతో మాట్లాడుతూ..ఈ లైనులో పాసింజర్ రైళ్లను అనుమతిస్తే లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని, సమయం కూడా తగ్గుతుందని చెప్పారు.

సీఎం మూలన కూర్చోలేడా?

- ఆయనకు ఎన్ని ఇళ్లు కావాలి?
- 'రుషికొండ'పై పవన్ అసంబద్ధ ఆరోపణలు

సాక్షి, విశాఖపట్నం: వారాహి విజయయాత్రలో భాగంగా విశాఖలో ఉన్న జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ రుషికొండ నిర్మాణాలపై నోటికొచ్చినట్లు అసంబద్ధ ఆరోపణలు గుప్పించారు. అక్కడ ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తుంటే ఏవేవో నిర్మాణాలు జరుగుతున్నట్లు హడావుడి చేశారు. అంతకుముందు.. రుషికొండ సందర్శనకు భారీ ర్యాలీగా వెళ్లేందుకు పవన్ శుక్రవారం మధ్యాహ్నం సిద్ధమయ్యారు. కానీ, పోలీసులు అనుమతించలేదు. పోలీసులు పరిమిత సంఖ్యలో వాహనాల్లో వెళ్లేందుకు షరతులతో కూడిన అనుమతులివ్వడంతో సాయంత్రం తాను బసచేసిన హోటల్ నుంచి పవన్ బయల్దేరారు. కానీ, రుషికొండపైకి వెళ్లకుండా పోలీసులు ఆయన్ను నిలువరించారు. దీంతో ఆయన రోడ్డుపై నుంచే రుషికొండను పరిశీలించారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. రుషికొండలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 'ముఖ్యమంత్రికి ఎన్ని ఇళ్లు కావాలి? మూలన కూర్చోలేడా? సర్క్యూట్ హౌస్ చాలదా? సర్క్యూట్ హౌస్‌ను తాకట్టుపెట్టి ఇక్కడ కడతాడా?' అంటూ ప్రశ్నలు వేశారు. తెలంగాణను కూడా ఇలాగే దోచుకున్నారని ఆరోపించారు. కేవలం 15 నిమిషాల పాటు ఆయన అక్కడ ఉండి తిరుగు పయనమయ్యారు. పవన్ రుషికొండ పరిశీలనకు వెళ్లే సమయంలో జనసేన శ్రేణులు అతిగా ప్రవర్తించారు. కాగా, గురువారం విశాఖలో జరిగిన బహిరంగ సభలో ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ పవన్‌కు విశాఖ పోలీసులు నోటీసులు జారీచేశారు.

పవన్ క్షమాపణ చెప్పాలి

ఏయూపై చౌకబారు విమర్శలు ఆయన మానుకోవాలి

- జనసేన అధినేతకు ఏయూ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్ కౌంటర్



ఏయూ క్యాంపస్ : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆంధ్ర విశ్వ విద్యాలయంపై చౌకబారు విమర్శలు చేయడం పవన్‌కళ్యాణ్ మానుకోవాలని ఏయూ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్ ఘాటుగా బదులిచ్చారు. ఏయూ ప్రతిష్టకు భంగం కలిగేలా పవన్ చేసిన వ్యాఖ్యలను శుక్రవారం ఆయన ఖండించారు. ఉద్యోగులు, విద్యార్థుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన జనసేన అధినేత వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలకు అందించే ర్యాంకింగ్ అనేది ప్రధానంగా విద్యార్థులు, ఆచార్యుల నిష్పత్తిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

- ▲ ర్యాంకింగ్‌లో పాల్గొనే విద్యా సంస్థల సంఖ్యపై కూడా వర్సిటీల ర్యాంకులు ఆధారపడి ఉంటుంది. 2019లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌కి కేవలం వెయ్యి విద్యా సంస్థలు పాల్గొంటే, 2023లో 2,478 సంస్థలు పాల్గొన్నాయి.
- ▲ తొలి 100 స్థానాల్లో నిలిచే విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్ 2.5 నుంచి 4 మార్కుల వ్యత్యాసం మాత్రమే ఉంటుంది. ర్యాంకింగ్ విధానంలో ఐఐటీలు, కేంద్రీయ, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు కొంతమేర ప్రయోజనం పొందుతున్నాయి.
- ▲ గతంలోనే ఐఐటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆచార్య రాంగోపాల్ ర్యాంకింగ్ విధానంలో కొన్ని మార్పులు చేయాలని సూచించారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, కేంద్ర, డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు పరిమితులు (పారామీటర్స్) వేరుగా ఉండాల్సిన అవసరముందని అన్నారు.
- ▲ ఇక ఏయూలో విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించే వారి సంఖ్య 2018తో పోలిస్తే 25 శాతానికి పైగా పెరిగింది. 2023లో ఏయూ విద్యార్థులు పొందిన అత్యధిక వార్షిక వేతనం రూ.84.5 లక్షలు. 2018లో విద్యార్థులు సాధించిన అత్యధిక వార్షిక వేతనం కేవలం రూ.22 లక్షలు మాత్రమే.
- ▲ కేంద్ర విశ్వవిద్యాలయాల కంటే మిన్నగా ఏయూలో ఏర్పాటుచేసిన టెక్ స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ పనిచేస్తున్నాయి. ఇప్పటికే 124కి పైగా సాఫ్ట్‌వేర్ సంస్థలు ఇక్కడ పనిచేస్తున్నాయి. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఏయూ స్టార్టప్–ఇంక్యుబేషన్ సెంటర్ 14వ ర్యాంకు సాధించింది. తొలి 13 స్థానాల్లో ఐఐటీలు మాత్రమే నిలిచాయి.
- ▲ జాతీయ విశ్వవిద్యాలయాల తరహాలో 18 చెయిర్ ప్రొఫెసర్లు కలిగిన ఏకైక విశ్వవిద్యాలయం ఏయూ. దీనిపై ఉన్న నమ్మకంతో నవరత్న కంపెనీల నుంచి అమెరికాలో స్థిరపడిన భారతీయులు, ఏయూ పూర్వవిద్యార్థులు ఐఐటీ ఢిల్లీ తరహాలో ఇక్కడ చెయిర్ ప్రొఫెసర్‌లు ఏర్పాటుచేస్తున్నారు.

ఇలా.. వర్సిటీలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా తెలుసుకోకుండా ఎవరో ఇచ్చిన స్క్రిప్టుని పవన్ చదవడం సరికాదు. ఇప్పటికైనా తప్పు తెలుసుకుని ఏయూకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలి.

విద్య, వివేకంలేని వ్యక్తిలా పవన్

విశాఖ అర్బన్ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులపా రవీంద్రనాథ్ ఠాగూర్



ఏయూ క్యాంపస్ : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు విద్య, వివేకంలేని వ్యక్తి మాటల్లా ఉన్నాయని విశాఖ అర్బన్ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులపా రవీంద్రనాథ్ ఠాగూర్ విమర్శించారు. ఏయూపై పవన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఏయూను శుక్రవారం సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. ప్రజలు హర్షించేలా పవన్ మాట్లాడాలని హితవు పలికారు. నిజమైన విద్యావంతుడు, సంస్కారవంతులెవరూ ఏయూని ఉద్దేశించి ఇలా మాట్లాడరన్నారు.

పవన్ ఈ ప్రశ్నలకు బదులివ్వు..

ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు



భారతీయ విద్యావ్యవస్థపై పవన్ అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదని ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థపై ఆరోపణలు చేసే ముందు నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఇన్ని అసత్య ఆరోపణలు చేసిన పవన్‌కు తాను కొన్ని ప్రశ్నలు సంధిస్తున్నానని.. వాటికి ఆయన సమాధానం చెప్పాలని షారోన్‌రాజు సవాల్ విసిరారు. అవి..

- ▲ ఏయూకి 2018లో ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.150 కోట్లు నిధులను పసుపు–కుంకుమ పథకానికి ఎందుకు మళ్లించారు. అప్పుడు మీరు దీనిపై ఎందుకు ప్రశ్నించలేదు?
- ▲ ఏయూ సొంత నిధుల నుంచి రూ.5 కోట్లు వెచ్చించి జ్ఞానభేరి సభను చంద్రబాబు నిర్వహించారు. వాటిని ఎందుకు తిరిగి చెల్లించలేదు?
- ▲ విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగ నియామకాలపై 1996 నుంచి 2006 వరకు, తిరిగి 2014 నుంచి 2018 వరకు ఎందుకు నిషేధం విధించారు?
- ▲ పోలమాంబ ఆలయం పక్కనే, ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రూ.300 కోట్లు విలువైన స్థలాన్ని ఇటీవల ఏయూ స్వాధీనం చేసుకుంది. ఇంతకాలం ఈ స్థలం ఎవరి గుప్పిట్లో ఉందో మీకు తెలుసా?
- ▲ 2019–2023 మధ్య 200 మందికిపైగా ఆచార్యులు ఏయూలో పదవీ విరమణ చేశారు. అయినప్పటికీ ఏయూ జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు, స్కోర్‌ను మెరుగుపర్చుకుంటూ వస్తోంది. దార్శనికత కలిగిన రాష్ట్ర సీఎం ప్రపంచ స్థాయి విధానాలను అమలుచేయడంవల్లే ఇది సాధ్యపడింది. ఈ విషయం మీకు తెలుసా?

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ఐదేళ్లలో 370 మిలియన్ డాలర్ల కేశాల ఎగుమతి

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: దేశం నుంచి ఐదేళ్లలో 370.11 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన మానవ కేశాలు ఎగుమతి అయ్యాయని కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2018–19లో 34.46 మిలియన్ డాలర్లు, 2019–20లో 5.70 మిలియన్ డాలర్లు, 2020–21లో 11.65 మిలియన్ డాలర్లు, 2021–22లో 149.07 మిలియన్ డాలర్లు, 2022–23లో అత్యధికంగా 169.23 మిలియన్ డాలర్ల విలువైన కేశాలు ఎగుమతి చేసినట్లు వివరించారు. మానవ కేశాలు, ఉత్పత్తుల అసోసియేషన్, ప్లెక్స్ కౌన్సిల్ సమాచారం మేరకు ప్రపంచంలోనే అత్యధికంగా మానవ కేశాలు లభించేది భారతదేశంలోనే అని తెలిపారు. దేశంలో లభించే కేశాలు నాణ్యమైనవిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందినట్లు చెప్పారు. అరుణాచల్‌ప్రదేశ్ మీదుగా మయన్మార్ నుంచి చైనాకు భారతీయ మానవ కేశాల అక్రమ రవాణాకు సంబంధించి ఆధారాలు లేవని, కస్టమ్స్ వద్ద కేసులేమీ నమోదు కాలేదని తెలిపారు.

రైతులు తగ్గిపోతే ఇబ్బందులే

- ప్రస్తుతం దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 18.3 శాతమే
- బెంజమిన్ ఫ్రాంక్లిన్, ఫారడేలను మించిపోయిన చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: వ్యవసాయ రంగంలో రైతన్నల సంఖ్య తగ్గితే ఇబ్బందులు తప్పవని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దేశంలో ప్రతిరోజూ వ్యవసాయ రంగం నుంచి నాలుగు వేలకు పైగా ప్రజలు బయటకు వెళ్లిపోతున్నారని నేషనల్ అగ్రి ఫుడ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (నాబీ) డైరెక్టర్ డాక్టర్ అశ్వనీ పారీక్ ఇటీవల వెల్లడించారని ఆయన గుర్తు చేశారు. 'విజన్స్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్ ద రనప్ టూ ఇండియా' అనే వరుస ప్రసంగాల్లో భాగంగా ఆయన ఈ కీలక సమాచారం తెలిపారన్నారు. 'ఒకప్పుడు దేశ జనాభాలో 70 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవించేవారు. ఈ ఆరు దశాబ్దాల కాలంలో వారి సంఖ్య 45 – 50 శాతానికి తగ్గిందని అనేక సంస్థల గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 18.3 శాతానికి తగ్గిందని నిపుణుల అంచనా. అయినా ప్రజలు ఇంకా గణనీయ సంఖ్యలో వ్యవసాయం నుంచి బయటకు వస్తేనే మంచిదని వాదించేవారు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బెంజమిన్ ఫ్రాంక్లిన్, మైఖేల్ ఫారడేలను చంద్రబాబు మించి పోయారు. మైక్ ఇస్తే చాలు ఏదేదో మాట్లాడుతున్నారు. ముందు ముందు గాలి, నీరు కూడా తానే కనిపెట్టానని చంద్రబాబు అంటారు' అని వివరించారు. ప్రజలంతా మళ్లీ జగన్ రావాలి అంటున్నారని తెలిపారు. ఈ మేరకు తాడేపల్లిలో శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

బాబుకు బానిస పవన్

- ప్యాకేజీలతో బాబు స్క్రిప్టులు అందుకుని వారాహిపై ఊగిపోతున్నాడు
- సంసారం బీజేపీతో.. సహజీవనం టీడీపీతోనా?
- కేంద్రం నీ మాట వింటే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాల్సింది.
- జనసేన అధినేతపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫైర్



మహారాణిపేట (విశాఖ): జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గురువారం విశాఖ సభలో చేసిన ప్రసంగం అహంకారం, విద్వేషం, అసత్య ఆరోపణలతో కూడుకున్నదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అతని దత్తతండ్రి చంద్రబాబుగానీ.. లేదా పవన్ ఉండాలే గానీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండటం ఏమిటన్న అసూయ పవన్ మాటల్లో కనిపిస్తోందన్నారు. నాయకుడిగా ఎదగాలనే తాపత్రయంగానీ.. పార్టీ భవిష్యత్‌ను కాపాడుకోవాలనే లక్ష్యం ఎక్కడా ఆయనలో కనిపించలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తేనో.. ఆయన్ని అధికారం నుంచి లాగేయాలనేలా మాట్లాడితేనో ఓ అద్భుతం జరిగిపోతుందని భావిస్తున్నాడని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. నోటికొచ్చిన బూతులు మాట్లాడటంవల్ల, తాను నమ్ముకున్న దత్తతండ్రి చంద్రబాబు సీఎం అవుతారనే భ్రమల్లో పవన్ బతుకుతున్నాడన్నారు. వారాహి లారీ ఎక్కి పవన్ ఊగిపోతూ ప్రసంగించడంపై మంత్రి మండిపడ్డారు. లక్ష్యం, సిద్ధాంతం, వ్యక్తిత్వం లేని వ్యక్తి అసత్య ఆరోపణలతో మాట్లాడినంత మాత్రాన నాయకుడు కాలేడన్న విషయం పవన్ తెలుసుకోవాలని హితవు పలికారు. విశాఖలోని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో శుక్రవారం అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

పవన్ బానిసత్వానికి జాలిపడాలి..

నాయకుడిగా నిలబడాలంటే మనం నమ్మిన వారిని.. మనల్ని నమ్మేవారిని కాపాడుకోగలగాలి. కానీ, పవన్ మాత్రం తన అభిమానులను కాదని.. తాను నమ్ముకున్న దత్తతండ్రి చంద్రబాబుకు బానిసగా బతుకుతున్నాడు. బాబు ఇచ్చిన ప్యాకేజీతో స్క్రిప్టులు పట్టుకుని రోడ్లమీదకొచ్చి ఊగిపోతున్నాడు. పవన్ తీరును చూస్తుంటే.. 'అల్పుడెప్పుడు పలుకు నాడంబరముగాను..' అనే వేమన పద్యం గుర్తొస్తోంది. బీజేపీతో సంసారం చేస్తూ టీడీపీతో సహజీవనం చేయడం పవన్‌కే సాధ్యం.

నువ్వు సీఎం ఎలా అవుతావు?

175 నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేస్తుందా? పవన్ ప్రసంగంలో ఆ ప్రస్తావనేమీ తేలేదు. మరి సీఎం ఎలా అవుతావు. ముద్రగడ భార్య, కోడలిని ఆనాడు చంద్రబాబు ప్రభుత్వం చిత్రహింసలకు గురిచేసినప్పుడు పవన్ ఎందుకు స్పందించలేదు. విశాఖపట్నం గంజాయికి రాజధానిగా మారిందని చంద్రబాబు కేబినెట్ మంత్రులే అన్నప్పుడు.. ఆ రోజు ఎక్కడ ఉన్నావు పవన్? తమ పార్టీ వారే విశాఖలో ల్యాండ్‌స్కామ్ చేస్తున్నారంటూ టీడీపీ మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు చెప్పినప్పుడు నువ్వెక్కడ దాక్కున్నావు? ఇక నీకు కేంద్రంలో అంత పలుకుబడి ఉంటే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను పవన్ ఇప్పటికే ఆపేసి ఉండాలి కదా. పవన్ తన ప్రసంగంలో స్టీల్‌ప్లాంట్ పదం రాగానే మాటను దాటేశాడు. అలాగే, విశాఖ రాజధానిపై ఆయన ఎందుకు మాట్లాడలేదు?

ఉగాది తరువాత ఆ రెండు పార్టీల అడ్రస్ గల్లంతు

- మంత్రి బొత్స సత్యనారాయణ



రణస్థలం: వచ్చే ఉగాది తర్వాత టీడీపీ, జనసేన పార్టీల అడ్రస్ గల్లంతవడం ఖాయమని రాష్ట్ర విద్యాశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సారథ్యంలో శుక్రవారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో గడపగడపకూ మన ప్రభుత్వం విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. మంత్రి బొత్స మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌ను ఆడిపోసుకుంటే మట్టి కొట్టుకుపోతారన్నారు. పచ్చ పత్రికలు ప్రజల్లో అపోహలు సృష్టించాలని చూస్తున్నాయని చెప్పారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే టీడీపీ, నిలకడలేని జనసేనతో జనాలకు ఉపయోగం లేదని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సీఎం జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మొన్న వలంటీర్లు ఆడపిల్లలను ఎత్తుకుపోతున్నారని అభాండాలు వేసిన పవన్.. నిన్న సింహాద్రి అప్పన్న సాక్షిగా అలా అనలేదని అన్నారని చెప్పారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలకు మూడు రోజుల ముందు తోటపల్లి కాలువకు శంకుస్థాపన చేసి తానే తోటపల్లి చేశానని చెప్పడం సిగ్గుచేటన్నారు. బాబు బాగా పరిపాలిస్తే వంశధార నిర్వాసితులు ఎందుకు గోలపెట్టారని ప్రశ్నించారు. కిడ్నీ ఆస్పత్రిని చంద్రబాబు ఎందుకు కట్టలేకపోయారని నిలదీశారు. మూలపాడు పోర్టు, మంచినీళ్ల పేట, బుడగట్లపాలెం జెట్టీలు తామే తీసుకొచ్చామన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకులు నెక్కల నాయుడుబాబు, మాజీ పరిశీలకులు అంధవరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో లోకేశ్ ఓ బఫూన్

- మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: రాజకీయాల్లో లోకేశ్ ఓ బఫూన్ అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. సత్తెనపల్లి నియోజకవర్గంలో లోకేశ్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అని, ఒక్కరోజులో ముగించేశాడని తెలిపారు. తాను చాలా ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని.. రెండు సార్లు ఎమ్మెల్యే అయ్యానన్నారు. కానీ లోకేశ్ వాళ్ల నాన్న సీఎంగా ఉండగానే, ఒక మంత్రిగా ఉండగానే ఓడిపోయారన్నారు. తెలుగు జాతి గర్వపడాలని ఎన్టీఆర్ టీడీపీని స్థాపిస్తే.. లోకేశ్ తెలుగును ఖూనీ చేస్తున్నాడన్నారు. తెనాలి రామకృష్ణుడు సత్తెనపల్లిలో పుట్టాడని లోకేశ్ చెప్పడమే అతని అజ్ఞానానికి నిదర్శనమన్నారు. 'నేను నీ గురించి, మీ నాన్న, మీ అన్న పవన్ గురించి కూడా వాగుతా. కానీ ఎవరిని గోకాను? గోకినోళ్లు వచ్చి నీకు చెప్పారా? లోకేశ్.. అసలు నీబతుకేంటి? నీకు పాఠాలు చెప్పటానికి వచ్చిన టీచర్లను ఏంచేశావో తెలియదా? నేను డ్యాన్స్‌వేసింది నిజమే. నా నియోజకవర్గంలో సంక్రాంతి పండగకి అందరితో కలిసి ఆనంద నృత్యం చేశాను. భోగిమంట వేసుకుని గిరిజనులు చేస్తున్న నృత్యంలో కలిసి డ్యాన్స్ చేశాను' అని చెప్పారు. 'నేను రాజకీయాల్లో ఇక్కడే గడపాలని రేపల్లెలో ఆస్తులమ్మి ఇక్కడ 18 ఎకరాలు పొలం కొనుక్కుంటే వందలాది ఎకరాలు అంటున్నారు. సత్తెనపల్లిలో లోకేశ్ యాత్ర అట్టర్ ఫ్లాప్. టీడీపీ, జనసేన కలిసి పోటీ చేసినా ఈ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీనే. కన్నా లక్ష్మీనారాయణ సీఎం జగన్ కాలి గోటికి కూడా పనికి రాడు' అని చెప్పారు. చంద్రబాబు ప్రాజెక్టు బాట పట్టాడో లేదో వర్షాలు ఆగిపోయాయన్నారు.

కొదమ సింహమైతే 175 స్థానాల్లో పోటీకి పెట్టు

- చంద్రబాబుకి మంత్రి రోజా సవాల్
- సినిమాను ఆడించుకోలేని పవన్.. జగన్‌ని ఏమి ఆడిస్తావ్?



అవనిగడ్డ: కొదమ సింహమని చెప్పుకొంటున్న చంద్రబాబుకు రాష్ట్రంలో 175 స్థానాల్లో ఆ పార్టీ నాయకులను నిలబెట్టే దమ్ముందా అని మంత్రి ఆర్‌కే రోజా సవాల్ చేశారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని శుక్రవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు హయాంలో ఎగ్గొట్టిన రూ.3 వేలకోట్లు సున్నా వడ్డీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లించారని చెప్పారు. చంద్రబాబు పాలనలో ఒక్క కొత్తస్కీంలు అమలు కాలేదని, అన్నీ స్కాంలేనని ఎద్దేవా చేశారు. కేడర్, లీడర్లు నమ్మకపోవడంతో చంద్రబాబు దత్తపుత్రుడుని నమ్ముకున్నాడని చెప్పారు. ఆ దత్తపుత్రుడు చంద్రబాబు మొరగమంటే మొరుగుతాడని, కరవమంటే కరుస్తాడని పేర్కొన్నారు. ఆ దత్తపుత్రుడికి జెండా, అజెండా లేవని, ఉన్నదల్లా ప్యాకేజీలు తీసుకోవడమేనన్నారు. కేంద్రంతో మాట్లాడి జగన్‌ని ఒక ఆట ఆడిస్తానని పవన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. తన సినిమాను నాలుగు రోజులు నాలుగాటలు ఆడించుకోలేనోడు జగన్‌ని ఏమి ఆడిస్తాడని ఎద్దేవా చేశారు. దేశాన్ని గడగడలాడించిన సోనియాగాంధీనే ఒక ఆట ఆడించిన దమ్మున్న నేత జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఉత్తపుత్రుడు, దత్తపుత్రుడు, చంద్రబాబు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా జగన్ వెంట్రుక కూడా పీకలేరని చెప్పారు. ఈ సమావేశంలో శాసనసభ్యుడు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అందరూ వెళ్లే దారిలో వెళ్లాలనిపించదు.
కొత్తగా ఏదైనా చేస్తే బాగుంటుందనే ఆలోచన కుదురుగా ఉండనీయదు.
జీవనం పరీక్షగా అనిపిస్తుంటుంది.
'అవకాశాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయా? మనమే అవకాశాలను అందిపుచ్చుకోవాలా?! ఈ విధమైన సంఘర్షణే అరటినార వైపుగా అడుగులు వేయించింది' అంటారు బళ్లారి వాసి విశ్వనాథ్.
అరటినారతో గృహోపకరణాలను తయారుచేస్తూ తమ గ్రామమైన కంప్లిలో 20 మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.
ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఎకోఫ్రెండ్లీ వస్తువుల ప్రదర్శనలో స్టాల్ ఏర్పాటు చేసిన విశ్వనాథ్ తన ప్రయత్నం వెనక ఉన్న కృషిని వివరించారు.


విశ్వనాథ్

అరటి నారతో ఆనందాన్ని అల్లుకున్నాడు!


తయారీలో మహిళలు


అరటి నార ఉత్పత్తులతో మహిళా బృందం





''ప్రయత్నం లేకుండా ఫలితాలను ఆశించలేం అని తెలుసు. కానీ, కొంతకాలం మైండ్‌లో ఏ పని మీద దృష్టి పెట్టాలో తెలియకుండా ఉంటుంది. నా విషయంలో అదే జరిగింది. బీటెక్ చదువును మధ్యలో వదిలేశాను. ఇంట్లో అమ్మానాన్నలకు ఏ సమాధానమూ చెప్పలేక బెంగళూరులో ఏదైనా పని చేసుకోవచ్చని కొన్ని రోజులు ప్రయత్నించాను. ఏ పనీ సంతృప్తిని ఇవ్వలేదు. కరోనాటైమ్‌లో ఇంటి వద్దే కాలక్షేపం. బోలెడంత సమయం ఖాళీ. చదువు పూర్తి చేయలేకపోయానని అమ్మానాన్నల ముందు గిల్టీగా అనిపించేది.

అరటితోటల్లోకి..

మా ప్రాంతంలో అరటితోటలు ఎక్కువ. నా చిన్నతనంలో అరటి నుంచి తీసే నారతో అమ్మావాళ్లతో కలిసి తాళ్లు, ఏవో ఒకట్రెండు ఐటమ్స్ తయారు చేసిన జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ, ఎవరూ వాటి మీద పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. కాలక్షేపానికి అరటి నారతో రాఖీలు, కీ చెయిన్లు తయారు చేయడం మొదలుపెట్టాను. మా ఊరైన కంప్లిలో మహిళలు ఊలు దారాలతో క్రొచెట్ అల్లికలు చేస్తుంటారు. ఆ క్రొచెట్‌ను అరటినారతో చేయిస్తే ఎలా ఉంటుంది..? అనే ఆలోచన వచ్చింది. ముందు నేను ప్రయత్నించాను. క్రోచెట్ అల్లికలను నేర్చుకున్నాను. బ్యాగులు, బుట్టలు చేయడం మొదలుపెట్టాను. ముందైతే జీరో వేస్ట్ ప్రొడక్ట్స్ అనే ఆలోచన ఏమీ లేదు. నచ్చింది చేసుకుంటూ వెళ్లడమే. అయితే, అరటినారను తీసి, బాగా క్లీన్ చేసి, ఎండబెట్టి, ప్రత్యేక పద్ధతిలో దీనిని తయారు చేస్తే ఎక్కువ కాలం మన్నుతాయి అనే రీసెర్చ్ సొంతంగా చేశాను. సిద్ధం చేసుకున్న అరటినారను క్రొచెట్ అల్లే మహిళలకు ఇచ్చి, నాకు కావల్సిన వస్తువులు తయారు చేయించడం మొదలుపెట్టాను.

రాఖీతో మొదలు...

నేను చేసే పనిని ఒక ప్లానింగ్‌గా రాసుకొని, బ్యాంకువాళ్లను సంప్రదిస్తే 50 వేల రూపాయలు రుణం మంజూరు చేశారు. ఆ మొత్తంతో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని, అరటి నార తీసి, ఎండబెట్టడం.. ప్రక్రియకు వాడటంతోపాటు మహిళలు వచ్చి అల్లికలు చేసేలా జాగ్రత్తలు తీసుకున్నాను. మూడేళ్ల క్రితం ఇదే టైమ్‌లో మార్కెట్‌కి వెళ్లినప్పుడు రాఖీలను చూశాను. అవన్నీ కాటన్, ప్లాస్టిక్ మెటీరియల్‌తో చేసినవి. అవి చూసి రాఖీలను అరటి నార, మట్టి ఉండలు, గవ్వలు, సీడ్ బాల్స్, తాటి ఆకులతో తయారు చేశాను. తెలిసిన వారికి వాటిని ఇచ్చాను. ప్రతి ఉత్పత్తి జీరో వేస్ట్ మెటీరియల్‌తో రూపొందించడంలో శ్రద్ధ తీసుకున్నాను. 'విష్‌నేచర్' పేరుతో హస్తకళాకారుల ఫోరమ్ నుంచి ఐడీ కార్డ్ ఉంది. దీంతో ఎక్కడ ఎకో ఫ్రెండ్లీ ఎగ్జిబిషన్స్, స్టాల్స్‌కు అవకాశమున్నా నాకు ఇన్విటేషన్ ఉంటుంది. నా వీలును, ప్రొడక్ట్స్‌ను బట్టి స్టాల్ ఏర్పాటు చేస్తుంటాను. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఆర్డర్స్‌ను బట్టి ఇతర రాష్ట్రాలు, విదేశాలకూ మా అరటినార ఉత్పత్తులు వెళుతుంటాయి.

వంద రకాలు..

ఊలు దారాలతో క్రొచెట్ చేసే మహిళలు ఇప్పుడు అరటినారతో గృహాలంకరణ వస్తువులను తయారు చేస్తున్నారు. హ్యాండ్‌బ్యాగ్స్, ఫోన్ బ్యాగ్స్, క్లచెస్, మిర్రర్, టేబుల్ మ్యాట్స్, ప్లాంటేషన్ డెకార్, పెన్ హోల్డర్స్, తోరణాలు, బుట్టలు... దాదాపు 100 రకాల వస్తువులను తయారు చేస్తుంటాం. ఈ ఉత్పత్తులు ఐదేళ్లకు పైగా మన్నికగా ఉంటాయి. నీటిలో తడిసినా పాడవవు. అయితే, తడి ఉన్న ఉత్పత్తులను నీడన ఎక్కడో పడేస్తే మాత్రం ఫంగస్ చేరుతుంది. శుభ్రపరిచినా ఎండలో బాగా ఆరబెట్టి, తిరిగి వాడుకోవచ్చు. ఈ జాగ్రత్తలు తీసుకోవాలని ముందే చెబుతుంటాను. ఇరవైమంది మహిళలు ఒక్కొక్కరు నెలకు పది నుంచి పదిహేను వేల రూపాయల దాకా ఆదాయం పొందుతున్నారు. గుర్తింపు, ఆదాయాన్ని పొందే మార్గాన్ని కనుక్కోవడంతో కొంతమంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ పనిని మరింత విస్తృతం చేయాలన్న ఆలోచనతో నేచరల్ ఫేస్ స్క్రబ్స్, ఇతర ఎకో ఫ్రెండ్లీ ఐటమ్స్ ఒక ప్యాకేజీగా ఇవ్వాలన్న తపనతో పని చేస్తున్నాను. నా పనిని మెచ్చుకున్నవారిలో బాలీవుడ్ నటి విద్యాబాలన్, కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ వంటి ప్రముఖులు ఉన్నారు. మూడేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నం, నా పనితీరుతో అమ్మానాన్నలు సంతోషంగా ఉన్నారు'' అని వివరించారు విశ్వనాథ్.

– నిర్మలారెడ్డి



గెట్ రెడీ ఫర్ ఆగస్టు 15

పిల్లలు నోరు తెరిచి దేశం గురించి మాట్లాడే రోజు ఆగస్టు 15.
గొంతెత్తి దేశభక్తిని గానం చేసేరోజు మన స్వాతంత్ర్య దినోత్సవం.
సంవత్సరంలో 364 రోజులు వారు ఫోనులోనో గేమ్స్‌లోనో మునిగి ఉన్నా ఈ ఒక్కరోజైనా వారి చేత దేశం గురించి మాట్లాడించాలి.
దేశ ఘనతను పాడించాలి. తల్లిదండ్రులు తమ పిల్లల చేత కనీసం ఒక పాట పాడించాలి. ఐదు నిమిషాలు మాట్లాడించాలి.
ఏ పాటలు? ఏ మాటలు? ఇవిగోండి సలహాలు...

ఎలుగెత్తి చెబుదాం గొంతెత్తి పాడుదాం

'దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా వొట్టి మాటలు కట్టిపెట్టోయ్ గట్టిమేల్ తలపెట్టవోయ్'... అన్నారు గురజాడ. 'దేశమును ప్రేమించాలి' అని పిల్లలకు తెలుసు. కాని దేశంలో మంచి పెరిగితేనే అది ప్రేమించ దగ్గ దేశమవుతుందని, దేశంలోని ప్రతి ఒక్కరికీ మేలు జరిగినప్పుడే అది గొప్ప దేశమవుతుందని గురజాడ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇలాంటి ఒక పాటైనా పిల్లల చేత పాడించకపోతే తల్లిదండ్రుల పెంపకంలో నిర్లక్ష్యం ఉన్నట్టే అర్థం. 'చెట్టపట్టాల్ పట్టుకొని దేశస్థులంతా నడవ వలెనోయ్... అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నీ మెలగవలెనోయ్' అని కూడా గురజాడ అన్నారు. ఇవాళ్టి సందర్భంలో పిల్లలకు ఈ పాట నేర్పి, దాని అర్థం మనసుకు ఎక్కించకపోతే భవిష్యత్తులో వారు 'దేశమంటే మట్టే' అనుకుంటారు. 'మనుషులు' అనుకోరు.



త్యాగఫలం తెలియచేయాలి

ఇవాళ మనం పీలుస్తున్న ప్రతి శ్వాస మన పూర్వీకుల రక్తం, చెమట, త్యాగం ఫలితం. మహానుభావులు వారి జీవితాలను త్యాగం చేసి భావితరాల చేతుల్లో పెట్టారు దేశాన్ని. ఎంతో విలువైన ఈ దేశ సంపద, దేశ సంస్కృతి పట్ల పిల్లలకు గౌరవం, బాధ్యత తెలియాలంటే వారిలో జాతీయ భావాలు, సుహృద్భావం కలగాలంటే ఆగస్టు 15ను ఒక సందర్భంగా చేసుకుని తెలియచేయాలి. ఇవాళ దురదృష్టవశాత్తు కొన్ని ఇళ్లల్లో పిల్లలకు తెలుగు నేర్పించడం లేదు. కొన్ని స్కూళ్లలో పిల్లలు జెండా వందనం రోజు జైహింద్ చెప్తే సరిపోతుందనుకుంటున్నారు. కనీసం ఒక బృంద గానంలో కూడా పాల్గొనడం లేదు... వక్తృత్వంలో నాలుగు ముక్కలు దేశం గురించి మాట్లాడటం లేదు. అందుకే తల్లిదండ్రులు పూనుకుని తమ ప్రతి పిల్లల చేత అయితే తమ అపార్ట్‌మెంట్‌లో, లేదా తమ వీధిలో, ఇంట్లో ఏదో విధాన ఒక పాట పాడించడం, దేశం గురించి తప్పకుండా నాలుగు ముక్కలు మాట్లాడించడం అవసరం. పిల్లలు సరిగ్గా చెప్తే వింటారు. నేర్చుకుంటారు. వారికి ఆ వేళ విశేషమైన దుస్తులు, దేశభక్తుల వేషాలు వేస్తే ఎంతో సంబరపడతారు. ఆ స్ఫూర్తిని నింపుకుంటారు. ఆగస్టు 15 అంటే సెలవు దినం, ఆ రోజు ఎటైనా వెళ్లొద్దాం అని ప్లాన్ చేసుకునే తల్లిదండ్రులు పిల్లలను దేశం వైపు నడిపించడంలో నిర్బాధ్యతగా ఉన్నట్టే లెక్క.

ఎన్నో పాటలు

పిల్లలు నేర్చుకుని పాడటానికి తెలుగు, హిందీ భాషల్లో ఎన్నో పాటలు ఉన్నాయి. ప్రయివేటు గీతాలతో పాటు సినీ గీతాలు కూడా ఉన్నాయి. వీటిలో ఏదో ఒకటి నేర్పించవచ్చు. 'దేశమును ప్రేమించుమన్నా' (గురజాడ), 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' (శంకరంబాడి), 'జయ జయ ప్రియభారత జనయిత్రి' (దేవులపల్లి), 'తేనెల తేటల మాటలతో' (ఇంద్రగంటి శ్రీకాంత శర్మ), 'మాకొద్దీ తెల్లదొరతనము' (గరిమెళ్ల), 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడ' (వేములపల్లి శ్రీకృష్ణ)... ఇవన్నీ ఉన్నాయి. ఇక సినిమా పాటల్లో 'పాడవోయి భారతీయుడా' (శ్రీశ్రీ) పిల్లలు పాడటానికి సులువుగా ఉంటుంది. మన పిల్లలకు 'వందేమాతరం', 'జనగణమన', 'సారే జహాసే అచ్ఛా' కనీసం వచ్చునా రావా అన్నది కూడా గమనించుకుంటే మంచిది.

దేశం గురించి మాట్లాడాలి

పిల్లలు దేశం గురించి, దేశ ఔన్నత్యం గురించి మాట్లాడాలి. మాట్లాడటంలో వారికి తర్ఫీదు ఇవ్వాలి. ఏం మాట్లాడాలన్న విషయంలో కొంచెం సాయం చేసినా పర్వాలేదు. 'భిన్నత్వంలో ఏకత్వం', 'మన జాతిపిత', 'దేశాభ్యున్నతికై పర్యావరణ పరిరక్షణ', 'డిజిటల్ ఇండియా', 'స్త్రీ శక్తి', 'సామాజిక బాధ్యత'... ఇలా ఏదో ఒక అంశం ఇచ్చి ఐదు నిమిషాలు మాట్లాడేలా చేయాలి. ఇది ఒక సంప్రదాయం. ఒక తరం నుంచి మరో తరానికి అందాలి. అమృతోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జెండా ఎగరేయడంలో పిల్లలను భాగస్వాములను చేయాలి.

దేశ పతాకం పిల్లల చేతుల్లో రెపరెపలాడాలి. దేశభవిష్యత్తుకు వారే విధాతలు కావాలి.

గెలుపు దారి


ప్రపంచంలోని ఎన్నో అద్భుత నిర్మాణాల వెనుక రోమా అగర్వాల్ సృజనాత్మక కృషి ఉంది.
'నీ ఆసక్తే నీ గురువు' అంటున్న రోమా అగర్వాల్ ప్రపంచంలోని ప్రసిద్ధ స్ట్రక్చరల్ ఇంజనీర్ (ఎనలైజ్, డిజైన్, ప్లాన్, రీసెర్చ్)లలో ఒకరిగా పేరు తెచ్చుకుంది.
చరిత్రలో ఎన్నో అద్భుతమైన నిర్మాణాలు ఉన్నాయి.
ఆ అద్భుత నిర్మాణాలకు ఎంతో చరిత్ర ఉంది.
ఆ చరిత్రను ఔపోసన పట్టినవాళ్లే విజేతలు అవుతారు.
రోమా అగర్వాల్ ఈ కోవకు చెందిన విజేత...

అద్భుత నిర్మాణ శిల్పి


రోమా అగర్వాల్

ముంబైలో పుట్టిన రోమా అగర్వాల్‌కు చిన్నప్పుడు 'లెగో' ఆడడం అంటే ఇష్టం. స్కూల్ రోజుల నుంచి తనకు ఫిజిక్స్, మ్యాథ్స్‌లు ఆసక్తికరమైన సబ్జెక్ట్‌లు. ఎలక్ట్రికల్ ఇంజనీర్ అయిన తండ్రి, అగర్వాల్‌కు వచ్చే ఎన్నో సందేహాలను క్షణాల్లో తీర్చేవాడు.

'యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్'లో ఫిజిక్స్‌లో డిగ్రీ చేసిన అగర్వాల్ 'ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్'లో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో ఎంఎస్సీ చేసింది.



స్ట్రక్చరల్ ఇంజనీర్‌గా పేరు తెచ్చుకున్న అగర్వాల్ మంచి రచయిత్రి కూడా. గతంలో బిల్ట్: ది హిడెన్ స్టోరీస్ బిహైండ్ అవర్ స్ట్రక్చర్స్, హౌ వాజ్ దట్ బిల్ట్? అనే పుస్తకాలు రాసింది. తాజాగా 'నట్స్ అండ్ బోల్ట్స్' పేరుతో పుస్తకం రాసింది. చక్రం నుంచి లెన్స్ వరకు ప్రపంచాన్ని మార్చేసిన

ప్రపంచాన్ని మార్చిన ఏడు ఆవిష్కరణలు

ఏడు శాస్త్రీయ ఆవిష్కరణలను ఈ పుస్తకంలో ప్రస్తావించింది. అసాధ్యం కాదు అనుకున్న దాన్ని సాధ్యం చేసి చూపించిన అసాధారణ శాస్త్రవేత్తలు, ఇంజనీర్‌ల గురించి రాసిన ఈ పుస్తకం యువతరానికి శాస్త్రీయ విషయాలపై ఆసక్తి కలిగించేలా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

యూనివర్శిటీలలో పాఠాల కంటే ప్రాక్టికల్ వర్క్ ఎక్కువగా ఉండేది. దీనికితోడు అద్భుతమైన ప్రతిభ ఉన్న విద్యార్థులతో స్నేహం తనకు ఎంతగానో ఉపకరించింది.

చదువు పూర్తయిన తరువాత ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ 'డబ్ల్యూఎస్పీ'లో చేరింది. ఒక ఫుట్‌బ్రిడ్జి కోసం పని చేయడం తన ఫస్ట్ ప్రాజెక్ట్. లండన్‌లోని ది షార్డ్ (షార్డ్ లండన్ బ్రిడ్జి) ప్రాజెక్ట్ కోసం ఆరు సంవత్సరాలు పని చేసింది. ఈ ప్రాజెక్ట్‌ను తన కెరీర్ హైలైట్‌గా చెబుతుంటుంది అగర్వాల్.

'ఇలాంటి ప్రాజెక్ట్‌లు కెరీర్‌లో అరుదుగా మాత్రమే వస్తాయి' అంటుంది. 'ఒక ప్రాజెక్ట్ కోసం పనిచేయడం ఆషామాషీ విషయం కాదు. ఎంతో మంది ఇంజనీర్‌లు, ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెంట్‌లు, సర్వేయర్‌లు, క్రియేటివ్ విజన్ ఉన్నవారితో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరికీ తమవైన నైపుణ్యాలు, ఆలోచనా విధానం ఉంటుంది. అందరినీ సమన్వయం చేసుకుంటూ ప్లానింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. పేపర్ మీద నిర్మాణ నమూనాను గీసుకోవడం నుంచి అది నిర్మాణ రూపంలో కనువిందు చేసే వరకు ప్రతి దశలో ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది' అంటుంది అగర్వాల్.

తాను 'డబ్ల్యూ ఎస్పీ'లో పనిచేస్తున్నప్పుడు ఆ సంస్థలో స్త్రీలు తక్కువగా ఉండేవారు. 'ది షార్డ్' కోసం పనిచేస్తున్న రోజుల్లో 'ఈ రకంగా పనిచేస్తున్నాం' అని వివరించడానికి స్కూల్స్‌కు వెళ్లి క్లాసులు నిర్వహించేది అగర్వాల్. తాను చెబుతున్నప్పుడు అమ్మాయిలలో ఎలాంటి ఆసక్తి లేకపోవడాన్ని గమనించి బాధగా అనిపించేది.

'అద్భుతమైన కెరీర్‌ను అమ్మాయిలు మిస్ అవుతున్నారు' అనుకునేది అగర్వాల్.

'అయ్యో!' అనుకోవడానికే పరిమితం కాకుండా 'యువర్ లైఫ్ క్యాంపెయిన్' ఫౌండింగ్ మెంబర్‌గా ఎన్నో పాఠశాలల్లో సైన్స్, ఇంజనీరింగ్‌లపై ఆసక్తి కలిగేలా, పెరిగేలా అవగాహన సదస్సులు నిర్వహించింది. ఈ సదస్సులు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. సైన్స్, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి టీవీలలో ఎన్నో ప్రోగ్రామ్స్ చేసింది.

'ఒకప్పుడు ఇంజనీరింగ్ చేసిన మహిళలు అంటూ ఉండేవారు కాదు. ఆ తరువాత వేళ్ల మీద లెక్కబెట్టగలిగే స్థాయిలో ఉండేవారు. ఆ తరువాత వారి సంఖ్య పెరుగుతూ పోయింది. రాత్రికి రాత్రే మార్పు రాదు అనేదానికి ఇదే నిదర్శనం' అంటుంది అగర్వాల్.

ప్రపంచంలోని పేరున్న స్ట్రక్చరల్ ఇంజనీర్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకున్న రోమా అగర్వాల్ తాను చేసిన ప్రయాణం గురించి ఇలా అంటోంది...

'సైన్స్, మ్యాథ్స్‌పై ఆసక్తి వల్ల ఏదో సాధించాలనే తపన మొదలైంది. ఏం సాధించాలి? ఎలా సాధించాలి? అనేది మాత్రం తెలియదు. అయితే ప్రయాణం మొదలు పెట్టినప్పుడు మన కోసం ఎన్నో ద్వారాలు తెరుచుకుంటాయి. మనం ఏం సాధించాలి, ఎలా సాధించాలి అనేది ఆ ప్రయాణ అనుభవాలే పాఠాలై బోధిస్తాయి'

కిచెన్ టిప్స్



- పండిన అరటిపండు గుజ్జు, కొద్దిగా పెరుగు వేసి చపాతీపిండిని ముద్దగా కలిపితే చపాతీలు మరింత మృదువుగా మెత్తగా, రుచికరంగా ఉంటాయి.



- సమోసా పిండిలో కొద్దిగా నిమ్మరసం వేసి కలిపితే సమోసాలు మరింత క్రిస్పీగా కరకరలాడతాయి.

పర్యావరణ హిత

మిత్ర విజయం

వ్యాపారం చేయాలంటే అదే పనిగా కంప్యూటర్ ముందు కూర్చుంటే సరిపోదు.
నాలుగు గోడలు దాటి బయటి ప్రపంచంలోకి రావాలి. జనవాణి వినాలి. సృజనాత్మక వ్యూహాలు రూపొందించుకోవాలి.
ఈ మిత్రులు అదే చేశారు. 'ఎకోసోల్ హోమ్'తో ఘన విజయం సాధించారు...


రాహుల్, ప్రియాంక, అరవింద్

సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనే కలతో మూడు సంవత్సరాల క్రితం రాహుల్ సింగ్, ప్రియాంకలు బోస్టన్ నుంచి నోయిడాకు వచ్చారు. 'ఇదేమిటీ వింత' అన్నట్లుగా చూశారు చుట్టాలు పక్కాలు. 'ఇటు నుంచి అటు వెళతారు గానీ, అటు నుంచి ఇటు రావడం ఏమిటి?' అనేది వారి ఆశ్చర్యంలోని సారాంశం.

'రిస్క్ చేస్తున్నారు. అమెరికాలో సంపాదించిన డబ్బులను వృథా చేయడం తప్ప సాధించేది ఏమీ ఉండదు' అన్నారు కొందరు.

అయితే ఆ ప్రతికూల మాటలేవీ ఈ దంపతులపై ప్రభావం చూపలేకపోయాయి. ఇండియాకు రావడానికి ముందు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి వారికి బోలెడు సమయం దొరికింది. 'మనం తీసుకున్న నిర్ణయం సరియైనదేనా?' నుంచి 'ఎలాంటి వ్యాపారం చేయాలి...' వరకు ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు.

వ్యాపారమైనా సరే... అది కొత్తగా, సృజనాత్మకంగా, సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడేలా ఉండాలనుకున్నారు. అలా వారి ఆలోచనలో నుంచి పుట్టిందే... ఎకోసోల్ హోమ్. అరవింద్ గణేషన్‌తో కలిసి రాహుల్ సింగ్ మొదలు పెట్టిన ఈ ఎకో-ఫ్రెండ్లీ హోమ్ ఎసెన్షియల్స్ కంపెనీ సూపర్ సక్సెస్ అయింది.

రాహుల్, అరవింద్‌లు అమెరికాలోని ఇ-కామర్స్ కంపెనీ 'వేఫేర్'లో పని చేశారు.

'వేఫేర్‌లో పనిచేసిన అనుభవం మాకు ఎంతగానో ఉపయోగపడింది. వినియోగదారుల ఆలోచన ధోరణి ఎలా ఉంటుంది? ఏది చేయాలి? ఏది చేయకూడదు? అనే విషయంలో స్పష్టత రావడానికి ఆ అనుభవం ఉపయోగపడింది. పర్యావరణ హితానికి సంబంధించిన వస్తువులకు డిమాండ్ పెరుగుతున్నట్లు విషయాన్ని గ్రహించాం. ఆ సమయంలోనే ఎకోసోల్ కంపెనీ ఆలోచన వచ్చింది' అంటున్నాడు ఎకోసోల్ హోమ్ కో-ఫౌండర్ అరవింద్ గణేశన్.

'అవగాహన కలిగించేలా, అందుబాటులో ఉండేలా, అందంగా ఉండేలా మా ఉత్పత్తులు ఉండాలనే లక్ష్యంతో బయలుదేరాం. ప్లాస్టిక్ వల్ల జరిగే హాని గురించి చాలామందికి అవగాహన ఉంది. అయితే దీనికి ప్రత్యామ్నాయం కావాలనుకున్నప్పుడు ధరలు ఆకాశంలో ఉండకూడదు. అందుకే మా వస్తువులకు అందుబాటులో ఉండే ధరలు నిర్ణయించాం' అంటాడు రాహుల్ సింగ్.

ఒకవైపు కోవిడ్ కల్లోలం భయపెడుతున్నా మరో వైపు ఇండియా, చైనా, థాయిలాండ్, మెక్సికోలలో తమ ఉత్పత్తులకు సంబంధించి సప్లై చైన్‌ను నిర్మించుకోవడానికి రంగంలోకి దిగారు. అయితే అది అంత తేలికైన విషయం కాదని అర్థమైంది. రా మెటీరియల్ నుంచి ట్రాన్స్‌పోర్టేషన్ వరకు అడుగడుగునా సవాళ్లు ఎదురయ్యాయి.

ఒక్కొక్క సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లారు.

2021లో తాటి ఆకులతో తయారుచేసిన ప్లేట్లతో సహా 20 ఉత్పత్తులను విక్రయించడం మొదలు పెట్టారు. మనం రోజూ వినియోగించే ప్లాస్టిక్ ఫోర్క్‌లు, కప్‌లు, స్ట్రాలు, ప్లేట్స్... మొదలైన వాటికి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలు ఇందులో ఉన్నాయి.

కంపెనీ నిర్మాణ సమయంలో వివిధ జిల్లాలకు చెందిన రైతులతో కలిసి పనిచేశారు రాహుల్, అరవింద్‌లు. వారు ఎన్నో అద్భుతమైన సలహాలు ఇచ్చారు. 'తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటే అడుగు తీసి అడుగు వేస్తే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు' అంటారు రాహుల్, అరవింద్.

కిచెన్,డైనింగ్, టేబుల్‌టాప్, బాత్, పర్సనల్ కేర్....మొదలైన విభాగాల్లో 42 రకాలైన ఉత్పత్తులను అందిస్తోంది ఎకోసోల్ హోమ్. ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో అయిదు వేల స్టోర్‌లు ఉన్నాయి. రాబోయే రోజుల్లో పదివేల స్టోర్స్ లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

'మా ప్రయాణం నల్లేరు మీద నడక కాదు. కంపెనీ ప్రారంభంలో వెంచర్ క్యాపిటల్స్‌ను సంప్రదించినప్పుడు ఎవరూ ఇన్వెస్ట్ చేయడానికి ఆసక్తి చూపలేదు. ఒక రిటైలర్ మాత్రం లక్ష రూపాయల చెక్ ఇచ్చాడు. అది మాకు ఎంతో విశ్వాసాన్ని ఇచ్చింది' అంటూ గతాన్ని గుర్తుచేసుకున్నారు రాహుల్, అరవింద్‌లు.

అమ్మో... అలర్జీ!



డోంట్ వర్రీ! నివారించండి ఇలా!

మనం తీసుకునే ఆహారం వల్ల... పీల్చే గాలి వల్ల లేదా వాడే మందుల వల్ల మన రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించి అలర్జీకి దారి తీస్తుంది. అలర్జీపై అలసత్వం కూడదని, కొన్ని అలర్జీలు ప్రాణాంతకం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మనం కామన్‌గా ఎదుర్కొనే రకరకాల అలర్జీలు, కారణాలు, నివారణలపై అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం.

గుర్తించేదిలా...

ఎక్స్‌రే వంటి పరీక్షలు నిర్వహించి ఆ తరువాత మీ అలర్జీ కారకాలను గుర్తించడానికి చర్మ పరీక్షలు, ప్యాచ్ లేదా రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల నివేదికల ఆధారంగా మీరు ఏరకమైన అలర్జీలతో బాధపడుతున్నారో నిర్ధారించుకొని తగిన చికిత్సను సిఫార్సు చేస్తారు. అలర్జీలకు సరైన చికిత్సను నిర్ధారణ పరీక్షల ఆధారంగానే కాకుండా బాధితుడి మెడికల్ హిస్టరీ, లక్షణాల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని అందిస్తారు. ఈ రుగ్మతకు శాశ్వత పరిష్కారం లేదు. దీన్ని ఏదో ఒక చికిత్సా విధానం ద్వారా అదుపులో మాత్రమే ఉంచుకోవచ్చు.

ఏం చేయాలి?

శరీరంలో అలర్జీ లక్షణాలు కనిపించిన వెంటనే అలర్జీ స్పెషలిస్ట్‌ను సంప్రదించడం ఉత్తమం. డాక్టర్‌తో మీ ఫ్యామిలీ హిస్టరీ, జీవనశైలి, వాడుతున్న మందులు తదితర వివరాలను తెలియజేస్తే, దానికి తగిన నిర్ధారణ పరీక్షలను సూచిస్తారు. ముందుగా ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష,

ఆహారం.. అలర్జీ!

మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు ఫుడ్ అలర్జీలకు దారితీస్తాయి. సాధారణంగా అందరూ తీసుకునే గుడ్లు, పాలు, వేరుశెనగ, చేపలు, రొయ్యలు, పీతలు, సోయా, కొన్ని రకాల నట్స్ (అక్రోట్స్, బాదం, బ్రెజిల్ నట్స్), గోధుమ వంటి ఆహార పదార్థాలు కొందరి శరీర తత్వానికి సరిపడవు. వీరు వీటిని తీసుకోవడం వల్ల ఆహారానికి సంబంధించిన అలర్జీలు వస్తాయి. శరీరానికి ఈ పదార్థాలు సరిపడకపోతే దురద, చర్మంపై దద్దుర్లు, వాంతులు లేదా కడుపు తిమ్మిర్లు, శ్వాస తీసుకోలేకపోవటం, గురక, దగ్గు, గొంతునొప్పి, పల్స్ పడిపోవడం, చర్మం నీలం రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఫుడ్ అలర్జీల నిర్ధారణకు చర్మ పరీక్షతో పాటు రక్త పరీక్షలు (ఐజీఈ యాంటీబాడీస్) కూడా చేయాల్సి ఉంటుంది.



కొంతమందిలో తేనెటీగలు, కందిరీగలు (ఇన్సెక్ట్ అలర్జీ), రబ్బరుతో తయారయ్యే వస్తువులు (బెలూన్, చేతి తొడుగులు, కాండమ్స్), కొన్ని రకాల మందులు(డ్రగ్ అలర్జీ), ఫంగస్ (మోల్డ్ అలర్జీ) లాంటివి కూడా కనిపిస్తుంటాయి.

డస్ట్ అలర్జీ

సాధారణంగా డస్ట్ అలర్జీ అనేది దుమ్ము, ధూళి వల్ల, వాటిలోని సూక్ష్మజీవుల వల్ల సంభవిస్తుంది. వీటిని డస్ట్ మైట్స్ అంటారు. ఈ డస్ట్ మైట్స్ మనుషుల నుంచి రాలిన చర్మ మృతకణాలను తింటూ ఇంట్లో దుమ్ము, ధూళికి కారణమవుతాయి. ఇవి శ్వాస తీసుకునే క్రమంలో శరీరంలోకి ప్రవేశించి శ్వాసనాళాల వాపునకు కారణమవుతాయి. దీనివల్ల తుమ్ములు, ముక్కు కారడం, కంటిలో దురద, కళ్లలో నుంచి జిగటతో కూడిన నీరు, ఒళ్లంతా దురద, ముక్కు దిబ్బడ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మన ఇళ్లలో ఉండే తేమ పరిస్థితులు ఈ డస్ట్ మైట్స్‌కు ఆవాసాలు. కాబట్టి ఇళ్లలో ఉండే దుప్పట్లు, దిండు కవర్లు, టవల్‌లు, తివాచీలు, ఇతర సామాన్లను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి. డస్ట్ అలర్జీ కారకాలను గుర్తించడానికి స్కిన్ ప్రిక్ టెస్ట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. డస్ట్ అలర్జీతో బాధపడేవారు 80 శాతం మంది ఆస్తమా రోగులుగా మారుతున్నారు.



కంటి అలర్జీ



సాధారణంగా కంటి అలర్జీలు పుప్పొడి, డస్ట్‌మైట్స్, పెంపుడు జంతువుల చర్మ కణాలు వంటి వాటి వల్ల సంభవిస్తాయి. వీటి వల్ల కళ్లలో దురద, వాపు, మంట, జిగట నీరు కారడం, ఎరుపెక్కడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ రకమైన అలర్జీలు అంటువ్యాధులు కావు. కంటి అలర్జీలకు ప్రత్యేకమైన నిర్ధారణ పరీక్షలు ఏవీ ఉండవు. పైన పేర్కొన్న కారకాల్లో ఏవి అలర్జీకి కారణం అవుతున్నాయో పరిశీలించి వాటికి దూరంగా ఉండటమే నివారణ.

స్కిన్ అలర్జీ

స్కిన్ అలర్జీ అంటే కేవలం చర్మ సంబంధిత అలర్జీ అనే అపోహ చాలామందిలో ఉంటుంది. స్కిన్ అలర్జీతో బాధపడే వారిలో విపరీతమైన దురద, చర్మంపై దద్దుర్లు, పొడి చర్మం, మంట, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. రోగనిరోధక వ్యవస్థలో లోపాలు, మందులు, అంటువ్యాధులు వంటి పలు కారణాల చేత ఇవి సంభవిస్తాయి. పెంపుడు జంతువులు, రసాయనాలు, సబ్బులు, కొత్తబట్టలు, స్కిన్ లేదా ఫేస్ క్రీమ్‌లు వంటివి చర్మ అలర్జీలకు ప్రధాన కారకాలు. చాలా మందిలో ఈ అలర్జీల కారకాలను పరీక్షల ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. అయితే సాధారణ రక్త పరీక్ష (తెల్ల రక్త కణాల పరీక్ష) ద్వారా బాధితుడి లక్షణాలను కొద్దిమేరకు గుర్తించే ప్రయత్నం చేయవచ్చు. మన చర్మం దేనికి ప్రతిస్పందిస్తుందో జాగ్రత్తగా పరిశీలించి వాటికి దూరంగా ఉండటమే దీనికి నివారణ.



హెల్త్ టిప్స్

చలవ చేసే మిరియాలు



మిరియాలు మంచి ఘాటు వాసనను కలిగి ఉంటాయి. ఈ కారణంగానే వీటిని మసాజ్ ఆయిల్ తయారీలో ఒక వనరుగా ఉపయోగిస్తారు. ఈ ఆయిల్‌తో మర్దనా చేసుకోవడం లేదా కొన్ని చుక్కలు నీటిలో కలుపుకొని స్నానం చేస్తే కండరాల నొప్పులు, ఒళ్లు నొప్పులు, గాయాలు తగ్గుతాయి.

గ్లాసు మంచినీరు, ఐదు లేక ఆరు మిరియాలు, ఒక ముక్క తెల్ల ఉల్లిపాయ, చితక్కొట్టిన అల్లం ముక్క ఒకటి, చిన్న బెల్లం ముక్క ఇవన్నీ వేసి నీరు సగం అయ్యేంత వరకు కాచండి. వేడిగా ఉండగానే తాగండి. దీనిని సేవించడం వల్ల దగ్గు, జలుబు, గొంతు నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

భరించరానంత తలనొప్పి తగ్గాలంటే పది తులసి ఆకులు, పది నల్ల మిరియాలను నూరి అందులో టీ స్పూను తేనె కలిపి రోజుకు మూడు సార్లు తినాలి.

ఆరోగ్యానికి రక్ష డ్రాగన్ ఫ్రూట్

పండ్లలో డ్రాగన్ ఫ్రూట్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎందుకంటే ఇవి చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అందువల్ల వీటిని చిన్న పిల్లల నుంచి పెద్దవారి దాకా ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. వీటిని తినడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే మూలకాలు అన్ని రకాల అనారోగ్య సమస్యల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తాయి.



ప్రస్తుతం చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ జుట్టు సమస్యలతో బాధపడుతున్నారు. ఇందులో అధిక పరిమాణంలో అనేక విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. కాబట్టి జుట్టు సమస్యలతో బాధపడేవారు క్రమం తప్పకుండా డ్రాగన్ ఫ్రూట్‌ను తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది...
డ్రాగన్ ఫ్రూట్‌లో అధికమోతాదులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల వీటిని తీసుకునేవారికి రోగనిరోధక శక్తి పెరిగి జలుబు, ఫ్లూ, జలుబు వంటి సమస్యల నుంచి సులభంగా ఉపశమనం లభిస్తుంది. అంటు వ్యాధులు రాకుండా శరీరాన్ని కూడా కాపాడుతుంది.



జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది...
డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే ఫైబర్ పరిమాణాలు తీవ్ర జీర్ణక్రియ సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా మలబద్ధకం, పొట్ట నొప్పులతో బాధపడేవారు ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది.

గర్భధారణ సమయంలో...
గర్భధారణ సమయంలో మహిళలు తరచు ఏదో ఒక విధమైన అనారోగ్య సమస్యలకు గురవుతారు. అయితే ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి ప్రతి రోజు డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో విటమిన్ సి కూడా అధికంగా పరిమాణంలో లభిస్తుంది. దీంతో ఈ విటమిన్ సి లోపం నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తుంది.

వాపు నుంచి ఉపశమనం...
చాలా మందికి శరీరంలోని కొన్ని భాగాలలో వాపు, శరీరమంతటా మంటలు వస్తుంటాయి. ఇలాంటి సమస్యలతో బాధపడేవారు వైద్యుని సంప్రదించేముందు డ్రాగన్ ఫ్రూట్ తీసుకుని చూడాలి. అప్పటికీ తగ్గకపోతే అప్పుడు డాక్టర్‌ను కలవాలి. ఎందుకంటే ఇందులో ఉండే సమ్మేళనాలతో ఆయా సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.

కొలెస్ట్రాల్‌ను అదుపు చేస్తుంది...
తరచు కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడేవారు గుండె జబ్బుల బారిన పడే అవకాశాలున్నాయి. అయితే ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి డ్రాగన్ ఫ్రూట్‌ను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

మీకు తెలుసా?

కంటికి మరీ దగ్గరగా పెట్టుకుంటే...



కంటి సామర్థ్యం, పనితీరు వంటి అంశాలు మహిళలకైనా, పురుషులకైనా సాధారణంగా ఒకేలా ఉంటాయి. ఒకవేళ కంటికి ఏవైనా సమస్యలు వస్తే అవి కూడా ఒకేలా రావాలి. కానీ... కంటికి దగ్గరగా పెట్టుకుని పుస్తకాల్ని చదివేవారిలో పురుషులతో పోలిస్తే మహిళల్లో సమస్యలు కాస్తంత ఎక్కువని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన అధ్యయనవేత్తలు గుర్తించారు. ఇందుకు కారణాన్ని సైతం అధ్యయనవేత్తలు శాస్త్రీయంగా విశ్లేషించారు.

అదేమిటంటే... పురుషుల చేతుల నిడివితో పోలిస్తే మహిళల చేతులు నిడివి కాస్తంత తక్కువ. ఫలితంగా చదివే సమయంలో పురుషులతో పోలిస్తే మహిళల కళ్లకు పుస్తకం ఒకింత దగ్గరగా ఉంటుంది. దాంతో ప్రెస్బయోపియా అనే కండిషన్ మహిళలకు వేగంగా వస్తుంది. అంటే దగ్గరి చూపు తగ్గడం అన్న సమస్య చాలా త్వరగా రావచ్చు. మహిళలు దీర్ఘకాలం పాటు ఇలా పుస్తకాలను చాలా దగ్గరగా చదువుతుండటం మూలాన బైఫోకల్ లెన్సను లేదా రీడింగ్ గ్లాసెస్‌ను చాలా త్వరితంగా ఉపయోగించాల్సి వస్తోందని పరిశోధనలు తెలుపుతున్నాయి. అయితే ప్రెస్బయోపియా అన్న సమస్యకు అనేక కారణాలు ఉంటాయని, ఒక్కొక్కరి వ్యక్తిగత అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆ సమస్యకు కరెక్షన్స్ సూచించాల్సి ఉంటుందని కూడా పరిశోధకులు పేర్కొన్నారు.

సినిమా

రీల్స్

వింటేజ్ కింగ్?


ప్రభాస్

ఇంతకీ ఆ టైటిల్‌ని ఫిక్స్ చేశారా? ఈ టైటిల్ అనుకుంటున్నారా అంటూ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం గురించి చర్చ జరుగుతోంది. ఈ చిత్రం టైటిల్‌ని అధికారికంగా ప్రకటించలేదు. అయితే 'రాజా డీలక్స్' అని ఫిక్స్ చేశారనే ప్రచారం జరుగుతోంది. తాజాగా 'వింటేజ్ కింగ్' అనే టైటిల్‌ని అనుకుంటున్నారనే వార్త వెలుగులోకి వచ్చింది. మరి.. వార్తల్లో ఉన్నట్లు 'రాజా డీలక్స్'ని ఫిక్స్ చేశారా? లేక 'వింటేజ్ కింగ్' అనుకుంటున్నారా? అనేది తెలియాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

డబ్బింగ్ ఆరంభం
ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' సినిమాలోని తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' సెప్టెంబరు 28న విడుదల కానున్న సంగతి తెలిసిందే. విజయ్ కిరగందూర్ ఈ సినిమాను నిర్మించారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ వర్క్‌ను ఆరంభించారు. మరోవైపు నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'కల్కి 2898 ఏడీ' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే.

శ్రీకాంత్ అడ్డాల డైరెక్షన్‌లో?


అఖిల్

'ఏజెంట్' తర్వాత అఖిల్ కొత్త సినిమా గురించిన అధికారిక ప్రకటన ఇంకా వెల్లడి కాలేదు. అయితే అనిల్ అనే ఓ కొత్త దర్శకుడితో అఖిల్ సినిమా చేయనున్నారని, ఈ సినిమాకు 'ధీర' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని ప్రచారం జరిగింది. తాజాగా దర్శకుడు శ్రీకాంత్ అడ్డాలతో అఖిల్ ఓ సినిమా చేయనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. శ్రీకాంత్ ఓ కథను రెడీ చేసి, అఖిల్‌కు వినిపించారట. ఈ స్క్రిప్ట్ అఖిల్‌కి నచ్చిందని సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే అఖిల్ – శ్రీకాంత్ అడ్డాల కాంబినేషన్‌లోని సినిమా ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం శ్రీకాంత్ అడ్డాల తెరకెక్కించిన 'పెద కాపు 1' ఈ నెలలోనే విడుదల కానుంది. ఒకవేళ అఖిల్‌తో సినిమా కన్ఫార్మ్ అయితే.. 'పెద కాపు 1' విడుదల తర్వాత ప్రకటన వస్తుందేమో?

నీకిదే స్వాగతాంజలి


కంగనా రనౌత్

'లాస్య విలసిత.. నవ నాట్యదేవత.. నటనాంకిత అభినయ వ్రత చారుధీర చరిత స్వాగతాంజలి.. స్వాగతాంజలి' అంటూ సాగే పాట 'చంద్రముఖి 2' చిత్రంలోనిది. రాఘవా లారెన్స్, లక్ష్మీ మీనన్, కంగనా రనౌత్, వడివేలు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చంద్రముఖి 2'. పి. వాసు దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబరు 15న విడుదల కానుంది. ఈ చిత్రంలో చంద్రముఖి పాత్రధారి కంగనా రనౌత్‌పై చిత్రీకరించిన 'ఓ చంద్రముఖి నీకిదే స్వాగతాంజలి' పాట తెలుగు, తమిళ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. యం.యం. కీరవాణి స్వరకల్పనలో చైతన్య ప్రసాద్ లిరిక్స్ అందించిన ఈ పాటను శ్రీనిధి తిరుమల పాడారు. ఇక రజనీకాంత్ హీరోగా జ్యోతిక, ప్రభు, నయనతార లీడ్ రోల్స్‌లో పి. వాసు దర్శకత్వంలో రూపొందిన 'చంద్రముఖి' చిత్రం 2005లో విడుదలై ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'చంద్రముఖి 2' తెరకెక్కింది.

పోలీస్ స్టేషన్‌లో...

హీరోయిన్ కేథరిన్ ట్రెసా పోలీస్ స్టేషన్‌లో ఉన్నారు. ఆమె పోలీసాఫీసర్ కాదు.. ఖైదీ కూడా కాదు. మరి.. పోలీస్ స్టేషన్‌కి ఎందుకు వెళ్లారంటే.. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా. కేథరిన్ హీరోయిన్‌గా 'జార్జిరెడ్డి, వంగవీటి' చిత్రాల ఫేమ్ సందీప్ మాధవ్ హీరోగా ఓ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో సందీప్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేస్తున్నారు. కేథరిన్ క్యారెక్టర్ ఏంటనేది తెలియాల్సి ఉంది. అయితే ఎవరూ ఊహించని రీతిలో ఆమె పాత్రను డిజైన్ చేశారట చిత్రదర్శకుడు అశోక్ తేజ. ఈ సినిమా కోసం వేసిన ప్రత్యేకమైన పోలీస్ స్టేషన్ సెట్‌లో సందీప్, కేథరిన్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని కేసీఆర్ ఫిలిమ్స్, శ్రీమహా విష్ణు మూవీస్ బ్యానర్లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మిస్తున్నారు. ''స్క్రీన్‌ప్లే బేస్డ్ చిత్రమిది. సరికొత్త యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం కొత్త అనుభూతినిచ్చే విధంగా ఉంటుంది'' అన్నారు నిర్మాతలు. ''ఈ సినిమాలో ఎవరూ ఊహించని మలుపులు ఉంటాయి. ప్రతి సీన్ ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు దర్శకుడు.


కేథరిన్

అందుకే స్పందించా!


విశాల్

''సాధారణంగా నేను వదంతులకు, అబద్ధపు వార్తలకు స్పందించను. ఎందుకంటే అవి పూర్తిగా అనవసరమైన విషయాలు. కానీ ఇప్పుడు స్పందించడానికి కారణం ఈ వార్తతో ఒక అమ్మాయి జీవితం ముడి పడి ఉండడమే'' అని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు విశాల్. హీరోయిన్ లక్ష్మీ మీనన్, విశాల్ పెళ్లి చేసుకోనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ వార్తను ఉద్దేశించే విశాల్ పై విధంగా పేర్కొన్నారు. ''లక్ష్మీ మీనన్‌తో నా పెళ్లనేది నిజం కాదు. మా ఇద్దరి పెళ్లంటూ వస్తున్న వార్తను ఖండిస్తున్నాను. ఒక అమ్మాయి వ్యక్తిగత జీవితానికి నష్టం కలిగించడం సరి కాదు. భవిష్యత్తులో నేను ఎవర్ని, ఏ తేదీ, ఏ టైమ్‌లో పెళ్లి చేసుకుంటాననేది తెలుసుకోవడం అందరికీ పెద్ద కష్టమేం కాదు. అయినా సమయం వచ్చినప్పుడు నా పెళ్లి గురించి నేనే చెబుతాను'' అని కూడా విశాల్ అన్నారు.

చందమామ కథలోన..


రక్షిత్, రాఘవేంద్ర రావు

రక్షిత్ అట్లూరి, సంకీర్తన విపిన్ జంటగా వెంకట సత్య దర్శకత్వంలో రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'చందమామ కథలోన..' పాట లిరికల్ వీడియోను దర్శకుడు కె. రాఘవేంద్ర రావు విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'చందమామ కథలోన.. అందమైన పిల్లేనా.. కళ్ల ముందు వాలిందా.. తుళ్లి తుళ్లి పడ్డాన..' అంటూ సాగే ఈ పాటను పూర్ణాచారి రాయగా హరి చరణ్, గీతా మాధురి పాడారు. శరవణ వాసుదేవన్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు. రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి.

వినోదం..సందేశం


ఇషా, మల్లిక్, సుమన్


మల్లిక్ బాబు, వినయ్, ఇషా, ప్రియాన్స్ హీరో హీరోయిన్లుగా, సుమన్ కీలక పాత్రలో నటిస్తున్న సినిమా 'దుమారం'. జీఎల్బీ శ్రీనివాస్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. సుమన్ మాట్లాడుతూ– ''నాయీ బ్రాహ్మణుల వృత్తి, వారు జీవితంలో పడుతున్న ఇబ్బందులను కమర్షియల్ ఫార్మాట్‌లో ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఇందులో బార్బర్‌గా చేస్తున్నా. వినోదం, సందేశం అన్నీ ఉన్న చిత్రం అన్నారు. ''హీరో తండ్రి పాత్రను సుమన్ చేస్తున్నారు'' అన్నారు జీఎల్బీ శ్రీనివాస్. ''తొలి చిత్రంలోనే మాస్ క్యారెక్టర్ దొరకడం హ్యాపీ'' అన్నారు మల్లిక్. ''ఈ సినిమా కో ప్రొడ్యూసర్‌గా చేస్తూనే, విలన్ కొడుకు పాత్ర చేస్తున్నా'' అన్నారు పాండు గౌడ్.

మూడు దశలు.. పెద్ద సవాల్


శ్రీ సింహ కోడూరి

''ఉస్తాద్ కథ మూడు దశల్లో ఉంటుంది. నా పాత్రలో మూడు వేరియేషన్స్ ఉంటాయి. ఇది పెద్ద సవాల్‌గా అనిపించింది. ముఖ్యంగా కాలేజీ ఎపిసోడ్స్ కోసం బరువు తగ్గాను'' అన్నారు శ్రీ సింహా కోడూరి. శ్రీ సింహా కోడూరి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా నటించిన చిత్రం 'ఉస్తాద్'. ఫణిదీప్ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి, రాకేష్ రెడ్డి గడ్డం, దువ్వూరు హిమాంక్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీ సింహా కోడూరి మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో సూర్య అనే యువకుడి పాత్ర చేశాను. సూర్య కాలేజీకి ముందు ఏం చేశాడు? కాలేజీ లైఫ్ ఎలా సాగింది? పైలట్ ఎలా అయ్యాడు? అనేది ఈ చిత్రకథ'' అన్నారు.

ఫన్... థ్రిల్


శ్రీ కమల్, శివాని

'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, మన్మథుడు' వంటి పలు విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన కె. విజయ భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జిలేబి'. అంజు అశ్రాని సమర్పణలో పారిశ్రామికవేత్త గుంటూరు రామకృష్ణ నిర్మించారు. విజయభాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో శివానీ రాజశేఖర్ కథానాయికగా, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర చేశారు. ఈ చిత్రం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ''ఫన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది. మణిశర్మ సంగీతం ఓ ప్రధాన ఆకర్షణ'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ నెల 18న ఈ చిత్రం విడుదల కానుంది.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


సుమన్, గరీమా

సుమన్, గరీమా చౌహాన్ జంటగా సతీష్ పరమవేద దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సీతా కళ్యాణ వైభోగమే'. రాచాల యుగంధర్ నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ పోచంపల్లిలో మొదలైంది. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ సినిమా చివరి షెడ్యూల్‌లో భాగంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఫైట్ మాస్టర్ డ్రాగన్ ప్రకాష్ నేతృత్వంలో 100 మంది ఫైటర్లతో భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నాం. ఈ సినిమాను దసరాకి రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

దీపావళికి...


శ్రీరామ్

శ్రీరామ్, అయ్యప్ప పి. శర్మ, అజయ్ కీలక పాత్రల్లో బేబీ డమరి సమర్పణలో రూపొందిన చిత్రం 'ఎర్ర చీర'. సుమన్ బాబు, ఎన్వీవీ సుబ్బారెడ్డి నిర్మించిన ఈ చిత్రం దీపావళికి నవంబర్ 9న రిలీజ్ కానుంది. సుమన్ బాబు దర్శకత్వం వహించారు. ''అమ్మ సెంటిమెంట్, హారర్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. 36 నిమిషాల గ్రాఫిక్స్, లక్షలాది మంది అఘోరాలతో తీసిన క్లైమాక్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి'' అన్నారు ఎన్వీవీ సుబ్బారెడ్డి, సుమన్ బాబు.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▼	366	65,323
నిఫ్టీ ▼	115	19,428

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్‌	13,664	▼	74
డోజోన్స్‌	35,249	▲	73
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,524	▼	94
డాక్స్‌	15,832	▼	124
షాంఘై	3,189	▼	65
నికాయ్‌ (గురువారం ముగింపు)	32,474	▼	269

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో — ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	58,905 ▼	4
బంగారం (99.5 స్వచ్ఛత)	58,669 ▼	4
వెండి (కిలో)	70,098 ▼	78

ఈ-గేమింగ్‌పై విదేశీ ప్లేయర్లకూ జీఎస్‌టీ వర్తింపు

న్యూఢిల్లీ: దేశీ ఆన్‌లైన్‌ గేమింగ్‌ ప్లాట్‌ఫాంలలో ఆడే విదేశీ ప్లేయర్లకు కూడా 28% జీఎస్‌టీ వర్తించనుంది. గేమింగ్‌ సంస్థలు ఆయా ప్లేయర్ల నుంచి ఈ మొత్తాన్ని మినహాయించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన సమీకృత జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) చట్ట సవరణకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. ఆన్‌లైన్‌ గేమింగ్, కేసినోలు, హార్స్‌ రేస్‌ క్లబ్‌లు మొదలైన వాటిల్లో బెట్టింగ్‌లపై 28% (జీఎస్‌టీ) విధించాలని జీఎస్‌టీ మండలి నిర్ణయించడం తెలిసిందే.

లాట్‌ మొబైల్స్‌ 11వ వార్షికోత్సవ ఆఫర్లు

హైదరాబాద్‌: మల్టీబ్రాండ్‌ మొబైల్‌ రిటైల్‌ చైన్‌ లాట్‌ మొబైల్స్‌ 11వ వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లను ప్రకటించింది. రూ.3,999 విలువైన ఎయిర్‌ పాడ్స్, వైర్‌లెస్‌ బ్లూటూత్‌ హెడ్‌సెట్‌ను కేవలం రూ.11కే అందిస్తుంది. స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌టీవీ, ఏసీలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్స్‌ కొనుగోలుపై రూ.2,500 వరకు తక్షణ డిస్కౌంట్‌తో పాటు ఖచ్చితమైన బహుమతి ఇస్తుంది. పేటీఎం, మొబిక్విక్‌ వాలెట్‌ ద్వారా కొనుగోలుపై 5% వరకు తక్షణ క్యాష్‌ బ్యాక్‌ ఇస్తుంది. ఏటీఎం కార్డుపై ఒక్క రూపాయి డౌన్‌ పేమెంట్‌తో మొబైల్, ల్యాప్‌టాప్, స్మార్ట్‌ టీవీలు కొనుగోలు చేయవచ్చు. వార్షికోత్సవ ఆఫర్లు వినియోగించుకోవాలని సంస్థ డైరెక్టర్‌ ఎం.సుప్రజ కోరారు.



బీ న్యూ స్టోర్లలో శాంసంగ్‌ జెడ్‌ ఫోల్డ్‌/ఫ్లిప్‌ 5 స్మార్ట్‌ఫోన్లు

హైదరాబాద్‌: బీ న్యూ మొబైల్స్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌ స్టోర్లలో శాంసంగ్‌ గెలాక్సీ జెడ్‌ ఫోల్డ్‌ 5, జెడ్‌ ఫ్లిప్‌ 5 స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌ బీ న్యూ స్టోర్‌లో శుక్రవారం నటి హెబ్బా పటేల్‌ ఈ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేశారు. బజాజ్, టీవీఎస్‌ క్రెడిట్, హెచ్‌డీబీ, ఐడీఎఫ్‌సీ, బీనా, క్లైవర్‌పే ద్వారా ఈఎంఐ పద్ధతిలో ఫోన్లను కొనుగోలు చేయొచ్చు. జీరో ఫైనాన్స్‌ కూడా అందుబాటులో ఉంది. ఎంపిక చేసిన ప్రతి మొబైల్‌పై రూ. 23 వేల వరకు ప్రత్యేక డిస్కౌంట్‌ ఉంది. ఈ అవకాశాన్ని కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని బీ న్యూ స్టోర్‌ సీఎండీ బాలాజీ చౌదరి కోరారు. ఆవిష్కరణలో సంస్థ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ సాయి నితేష్‌తో పాటు శాంసంగ్‌ ఆర్‌ఎంఎస్‌ సుమిత్‌ కురేజ్‌లు పాల్గొన్నారు.



ఆర్‌బీఐ వదిలినా.. బ్యాంకులు తగ్గేదేలే!

0.10 శాతం వడ్డీరేట్లు పెంచిన బీఓబీ, కెనరా, బీఓఎం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా (బీఓబీ), కెనరా బ్యాంక్, బ్యాంక్‌ ఆఫ్‌ మహారాష్ట్ర (బీఓఎం) నిధుల సమీకరణ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్‌)ను 10 బేసిస్‌ పాయింట్ల వరకూ (100 బేసిస్‌ పాయింట్లు ఒకశాతం) పెంచుతూ శుక్రవారం కీలక నిర్ణయం తీసుకున్నాయి. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు– రెపోను వరుసగా మూడవసారి 6.5 శాతం వద్ద కొనసాగిస్తూ ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకున్నప్పటికీ బ్యాంకులు మాత్రం వడ్డీరేట్ల పెంపువైపే మొగ్గుచూపుతుండడం గమనార్హం. వ్యవస్థలో తగిన రుణ డిమాండ్‌ ఉందన్న విషయాన్ని బ్యాంకుల తాజా వడ్డీరేట్ల పెంపు నిర్ణయాలు సూచిస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బ్యాంకింగ్‌ నిర్ణయాలతో ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమైన రుణ రేట్లు పెరగనున్నాయి. సాధారణంగా వినియోగ రుణాలు ఏడాది కాల వ్యవధి ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమై ఉంటాయి. తాజా మార్పుతో ఏడాది బ్యాంకింగ్‌ ఎంసీఎల్‌ఆర్‌ రేట్ల పెరుగుదల తీరిదీ...



- **బీఓబీ:** రుణ రేటు 8.65 శాతం నుంచి 8.70 శాతానికి పెరగనుంది. ఆగస్టు 12 నుంచి ఈ రేటు అమలవుతుంది.
- **కెనరా బ్యాంక్‌:** ఆగస్టు 12 నుంచి 8.65 శాతం నుంచి 8.7 శాతానికి పెరగనుంది.
- **బీఓఎం:** తక్షణం అమల్లోకి వచ్చే విధంగా రేటు 10 బేసిస్‌ పాయింట్లు ఎగసి 8.60కి ఎగసింది.

నెమ్మదించిన పారిశ్రామిక ఉత్పత్తి

- జూన్‌లో 3.7 శాతం వృద్ధి
- 3 నెలల కనిష్ట స్థాయి
- తయారీ రంగం పేలవ పనితీరు

న్యూఢిల్లీ: భారత్‌ పారిశ్రామిక ఉత్పత్తి జూన్‌లో పేలవ పనితనాన్ని ప్రదర్శించింది. ఇందుకు సంబంధించి పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ) సూచీ పెరుగుదల రేటు కేవలం 3.7 శాతంగా నమోదయ్యింది. అంతక్రితం గడచిన మూడు నెలల్లో ఈ స్థాయికి సూచీ పడిపోవడం ఇదే తొలిసారి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70 శాతం వెయిటేజ్‌ ఉన్న తయారీ రంగం పేలవ పనితీరును ప్రదర్శించింది. గత ఏడాది జూన్‌లో ఐఐపీ పెరుగుదల రేటు 12.6 శాతం. అయితే 2022 కరోనా కాలం నాటి లోబేస్‌ ఎఫెక్ట్‌ (అతితక్కువ స్థాయి) దీనికి ప్రధాన కారణం కావడం గమనార్హం. కాగా మార్చిలో ఐఐపీ పెరుగుదల 1.9 శాతంకాగా, ఏప్రిల్, మే నెలల్లో వరుసగా 4.5 శాతం, 5.3 శాతాలుగా నమోదయ్యాయి. ఇక ఏప్రిల్‌ నుంచి జూన్‌ మధ్య ఐఐపీ వృద్ధి రేటు 4.5 శాతంగా ఉంటే, 2022–23 ఇదే కాలంలో ఈ రేటు బేస్‌ ఎఫెక్ట్‌తో 12.9 శాతంగా నమోదయ్యింది.



- కాగా, ఎనిమిది పారిశ్రామిక రంగాలతో (స్టీల్, సహజ వాయువు, బొగ్గు, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువులు, సిమెంట్, విద్యుత్, క్రూడ్‌ ఆయిల్‌) కూడిన మౌలిక రంగం వృద్ధి జూన్‌లో ఐదు నెలల గరిష్ట స్థాయిని చూసింది. వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) ఈ ఎనిమిది పరిశ్రమల వెయిటేజ్‌ దాదాపు 44 శాతం. కాగా, ఆర్థిక సంవత్సరంలో గడచిన మూడు నెలల్లో (ఏప్రిల్‌–జూన్‌) గ్రూప్‌ 5.8 శాతం పురోగమించింది.

రంగాల వారీగా జూన్‌ పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు
(క్రితం గణాంకాలతో పోల్చి.. శాతాల్లో)

	2023 జూన్‌	2023 మే	2022 జూన్‌
తయారీ	3.1	5.7	12.9
మైనింగ్‌	7.6	6.4	7.8
విద్యుత్‌	4.2	0.9	16.4
క్యాపిటల్‌ గూడ్స్‌	2.2	8.2	28.6
కన్సూమర్‌ డ్యూరబుల్స్‌	-6.9	1.1	25.2
నాన్‌ డ్యూరబుల్స్‌	1.2	7.6	2.9
ఇన్‌ఫ్రా/నిర్మాణం	11.3	14	9.4
ప్రైమరీ గూడ్స్‌	-5.2	3.5	13.8
ఇంటర్మీడియట్‌ గూడ్స్‌	4.5	1.6	10.5

మార్కెట్లో రెండోరోజూ అదే తీరు

- కొనసాగిన ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాల ప్రభావం
- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూలతలు
- ప్రైవేట్‌ బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయాల ప్రభావం స్టాక్‌ మార్కెట్‌పై రెండోరోజూ కొనసాగింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్‌ నుంచి బలహీన సంకేతాలు అందాయి. ఫలితంగా ప్రైవేట్‌ బ్యాంకులు, ఫైనాన్షియల్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో శుక్రవారం నష్టాలను చవిచూశాయి. ఉదయం సెన్సెక్స్‌ 40 పాయింట్ల స్వల్ప లాభంతో 65,728 వద్ద, నిఫ్టీ 11 పాయింట్లు పెరిగి 19,554 వద్ద మొదలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రోజంతా సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, పారిశ్రామిక షేర్లు మినహా అన్ని రంగాలూ అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 414 పాయింట్లు నష్టపోయి 65,274 వద్ద, నిఫ్టీ 130 పాయింట్లు క్షీణించి 19,413 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరికి సెన్సెక్స్‌ 366 పాయింట్ల నష్టపోయి 65,323 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 115 పాయింట్లు క్షీణించి 19,428 వద్ద నిలిచింది. బీఎస్‌ఈ మిడ్‌ క్యాప్‌ ఇండెక్స్‌ 0.13 %, స్మాల్‌ క్యాప్‌ సూచీ 0.31 శాతం చొప్పున క్షీణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,073 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.500 కోట్ల షేర్లను కొన్నారు. రూపాయి విలువ 19 పైసలు క్షీణించి 82.85 స్థాయి వద్ద స్థిరపడింది. కాగా ఈ వారం మొత్తంగా సెన్సెక్స్‌ 399 పాయింట్లు, నిఫ్టీ 89 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

''వ్యవస్థలోకి వచ్చిన అదనపు ద్రవ్య లభ్యతను తగ్గించేందుకు ఆర్‌బీఐ ఇంక్రిమెంటల్‌ సీఆర్‌ఆర్‌ను పదిశాతం పెంపు చర్యలతో స్టాక్‌ మార్కెట్‌ రెండోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ద్రవ్యోల్బణ అంచనా పెంపుతో ఆందోళనలు మరింత అధికమయ్యాయి. అమెరికా ద్రవ్యోల్బణం అంచనాలకు తగ్గట్లే నమోదైంది. బ్రిటన్‌ జీడీపీ డేటా అంచనాలకు మించి నమోదైంది. అయినప్పటికీ అంతర్జాతీయ సెంటిమెంట్‌ బలహీనంగా ఉంది'' అని జియోజిత్‌ ఫైనాన్సియల్‌ రీసెర్చ్‌ హెడ్‌ వినోద్‌ నాయర్‌ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జూన్‌ క్వార్టర్‌లో నికరలాభం 14 రెట్లు పెరగడంతో ఎల్‌ఐసీ షేరు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈలో 3% లాభపడి రూ.660 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 5% పెరిగి రూ.677 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.
- ఎంఎస్‌సీఐ ఇండియా సూచీలో చోటు దక్కించుకున్న సుప్రీం ఇండస్ట్రీస్‌(6%), ఆర్‌ఈసీ(4%), అశోక్‌ లేలాండ్‌(0.50%) షేర్లు ఇంట్రాడేలో 52 వారాల గరిష్టాన్ని తాకాయి. కాగా ఇదే ఇండెక్స్‌ నుంచి స్థానం కోల్పోయిన ఏసీసీ షేరు స్వల్పంగా 0.25% కోల్పోయి రూ.1955 వద్ద స్థిరపడింది. ఆస్ట్రాల్, కమ్మిన్స్‌ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ అసెట్‌ మేనేజ్‌మెంట్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌ బ్యాంక్, పవర్‌ ఫైనాన్స్‌ కార్పొరేట్‌లు సైతం ఇండెక్సులో చేరనున్నాయి.

ఈ–వేస్ట్‌కు డిస్కౌంట్‌ కూపన్‌

సెలెక్ట్‌ మొబైల్స్‌ 'మిషన్‌ ఈ-వేస్ట్‌'

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: మల్టీ బ్రాండ్‌ మొబైల్స్‌ రిటైల్‌ చైన్‌ సెలెక్ట్‌ మొబైల్స్‌ భారత్‌లో తొలిసారిగా 'మిషన్‌ ఈ–వేస్ట్‌' కార్యక్రమాన్ని ప్రారంభించింది. పరిశుభ్ర వాతావరణాన్ని, జీవన ప్రమాణాలను పెంచే లక్ష్యంతో ఈ–వేస్ట్‌ను సేకరించి, రీసైక్లింగ్‌ చేపడతారు. ఇందుకోసం కంపెనీ స్టోర్లలో బిన్స్‌ను ఏర్పాటు చేస్తామని సెలెక్ట్‌ మొబైల్స్‌ సీఎండీ వై.గురు తెలిపారు. పాడైన, వినియోగించని మొబైల్‌ ఫోన్లు, చార్జర్లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్స్‌ను సెలెక్ట్‌ స్టోర్లకు తీసుకువస్తే చాలు. రూ.10,000 వరకు డిస్కౌంట్‌ కూపన్‌ అందుకోవచ్చు. దేశంలో ఏటా 20 లక్షల టన్నుల ఈ–వేస్ట్‌ పోగవుతోందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు తెలిపారు. వ్యర్థాల నిర్వహణ పెద్ద సవాల్‌గా మారిందన్నారు. శాస్త్రీయ పద్ధతిలో ఈ–వేస్ట్‌ నిర్వహణను తమ ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. మొత్తం పరిశ్రమకు మిషన్‌ ఈ–వేస్ట్‌ ప్రేరణగా నిలుస్తుందని సెలెక్ట్‌ ఈడీ మురళి రేతినేని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ జయేశ్‌ రంజన్‌ పాల్గొన్నారు.



మిషన్‌ ఈ-వేస్ట్‌ ప్రారంభిస్తున్న కేటీఆర్‌. చిత్రంలో గురు, మురళి, జయేశ్‌ రంజన్‌ (ఎడమ నుంచి)

ఎన్‌ఎండీసీ లాభం రూ.1,661 కోట్లు



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: మైనింగ్‌ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీ జూన్‌ త్రైమాసికం కన్సాలిడేటెడ్‌ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 13 శాతం అధికమై రూ.1,661 కోట్లు సాధించింది. వ్యయాలు రూ.2,969 కోట్ల నుంచి రూ.3,476 కోట్లకు ఎగశాయి. టర్నోవర్‌ రూ.4,913 కోట్ల నుంచి రూ.5,689 కోట్లకు చేరింది. ఫలితాల నేపథ్యంలో ఎన్‌ఎండీసీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే శుక్రవారం బీఎస్‌ఈలో ఎటువంటి మార్పు లేకుండా రూ.113.70 వద్దే ఉంది.



బోపన్న జోడీ శుభారంభం

నేషనల్‌ బ్యాంక్‌ ఓపెన్‌ ఏటీపీ–1000 మాస్టర్స్‌ సిరీస్‌ టెన్నిస్‌ టోర్నమెంట్‌లో రోహన్‌ బోపన్న (భారత్‌)–మాథ్యూ ఎబ్డెన్‌ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లింది. టొరంటోలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్‌ ద్వయం 6–3, 6–3తో జేమీ ముర్రే (బ్రిటన్‌)–మైకేల్‌ వీనస్‌ (న్యూజిలాండ్‌) జోడీపై విజయం సాధించింది. 58 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్‌ ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్‌ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని ఈ ఇండో–ఆసీస్‌ ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్‌ చేసింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన బోపన్న–ఎబ్డెన్‌ క్వార్టర్‌ ఫైనల్లో మార్సెల్‌ గ్రానోలెర్స్‌ (స్పెయిన్‌)–హొరాసియో జెబలాస్‌ (అర్జెంటీనా)లతో తలపడతారు. 43 ఏళ్ల బోపన్న ఈ ఏడాది ఎబ్డెన్‌తో కలిసి ఇండియన్‌ వెల్స్‌ మాస్టర్స్‌ టోర్నీలో, దోహా ఓపెన్‌లో టైటిల్స్‌ సాధించాడు.

అజేయంగా టైటిల్‌ పోరుకు భారత్‌

- సెమీఫైనల్లో 5–0తో జపాన్‌పై విజయం
- నేడు మలేసియాతో ఫైనల్‌
- రాత్రి గం. 8:30 నుంచి స్టార్‌ స్పోర్ట్స్‌ ఫస్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం

చెన్నై: స్వదేశంలో తొలిసారి జరుగుతున్న ఆసియా చాంపియన్స్‌ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు తుది పోరుకు అర్హత సాధించింది. ఇప్పటికే మూడుసార్లు విజేతగా నిలిచిన భారత్‌ శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో 5–0 గోల్స్‌ తేడాతో జపాన్‌పై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో మలేసియాతో భారత్‌ ఆడుతుంది. తొలి సెమీఫైనల్లో మలేసియా 6–2తో డిఫెండింగ్‌ చాంపియన్‌ దక్షిణ కొరియాను ఓడించి ఈ టోర్నీలో మొదటిసారి ఫైనల్‌ చేరింది. 2018 ఆసియా క్రీడల సెమీఫైనల్లో చివరిసారి మలేసియా చేతిలో ఓడిన భారత్‌ ఆ తర్వాత ఈ జట్టుతో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూడలేదు. 5–6 స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్‌ 6–1తో చైనాపై గెలిచి ఐదో స్థానాన్ని దక్కించుకోగా... చైనా చివరిదైన ఆరో స్థానంతో సరిపెట్టుకుంది.

జపాన్‌పై గెలుపుతో హర్మన్‌ప్రీత్‌ సేన నాలుగో టైటిల్‌పై కన్నేసింది. ఈ టోర్నీలో లీగ్‌ దశలో 1–1తో తమని నిలువరించిన జపాన్‌పై టీమిండియా ఎదురు లేని విజయం సాధించింది. బంగ్లాదేశ్‌లో జరిగిన గత టోర్నీ (2021)లో సెమీస్‌లో ఎదురైన పరాజయానికి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకుంది. భారత శిబిరం అటాకింగ్‌కు జపాన్‌ వద్ద బదులే లేకపోయింది. తొలి క్వార్టర్‌ 0–0తో ముగిసింది. ఆ తర్వాత మూడు క్వార్టర్లు భారత ఆటగాళ్లదే జోరు. ఆకాశ్‌దీప్‌ సింగ్‌ (19వ ని.లో), కెప్టెన్‌ హర్మన్‌ప్రీత్‌ సింగ్‌ (23వ ని.లో), మన్‌దీప్‌ సింగ్‌ (30వ ని.లో), సుమిత్‌ (39వ ని.లో), కార్తీ సెల్వం (51వ ని.లో) తలా ఒక గోల్‌ చేశారు. ఈ మ్యాచ్‌తో భారత జట్టు గోల్‌కీపర్‌ పీఆర్‌ శ్రీజేష్‌ 300 అంతర్జాతీయ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్నాడు.


భారత జట్టు సంబరం

మళ్లీ మొదటికి...

నేడు జరగాల్సిన డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికలపై స్టే



చండీగఢ్‌: అడ్డంకులు తొలగి ఎన్నికలకు సిద్ధమైన భారత రెజ్లింగ్‌ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ)కు పంజాబ్‌ –హరియాణా హైకోర్టు షాక్‌ ఇచ్చింది. తద్వారా వివాదాస్పద సమాఖ్య మళ్లీ వార్తల్లో నిలిచినట్లయింది. నేడు ఎన్నికలు జరిగి కొత్త కార్యవర్గం ఎన్నిక కావాల్సి ఉండగా... హైకోర్టు ఓ రోజు ముందే నామినేషన్లు వేసిన అభ్యర్థులకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో హరియాణా అమెచ్యూర్‌ రెజ్లింగ్‌ సంఘానికి ఓటేసే హక్కు ఇవ్వడం పట్ల హరియాణా రెజ్లింగ్‌ సంఘం హైకోర్టులో పిటిషన్‌ వేయడంతో... శుక్రవారం విచారించిన కోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చేదాకా ఎన్నికలు నిర్వహించరాదని స్టే విధించింది.

బ్రిజ్‌భూషణ్‌కు ఎదురుదెబ్బ!

భారత రెజ్లింగ్‌ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ సింగ్‌ను విచారించేందుకు ఢిల్లీ పోలీసులు సిద్ధమయ్యారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్‌భూషణ్‌పై కోర్టు ఆదేశాలతో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా కీలక సాక్ష్యాధారాలను ఢిల్లీ అడిషనల్‌ చీఫ్‌ మెట్రోపాలిటన్‌ మెజిస్ట్రేట్‌ హర్జీత్‌ సింగ్‌కు తెలపడంతో ఆయన విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

మరో విజయంపై గురి!

- సిరీస్‌ సమం చేసే లక్ష్యంతో టీమిండియా
- నేడు భారత్, వెస్టిండీస్‌ నాలుగో టి20
- రాత్రి గం.8.00 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



సూర్యకుమార్, హార్దిక్‌

లాడర్‌హిల్‌ (ఫ్లోరిడా): భారత్, వెస్టిండీస్‌ సమరం అమెరికా గడ్డకు చేరింది. సిరీస్‌ను సమం చేసే లక్ష్యంతో భారత్‌ బరిలోకి దిగుతుండగా... గత మ్యాచ్‌లో ఓటమి పాలైన తర్వాత ఇక్కడైనా సిరీస్‌ అందుకోవాలని వెస్టిండీస్‌ భావిస్తోంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే నాలుగో టి20 మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. ఈ టూర్‌లో ఇప్పటి వరకు జరిగిన అన్ని మ్యాచ్‌లతో పోలిస్తే అమెరికాలోని ఈ రీజినల్‌ పార్క్‌ స్టేడియం బ్యాటింగ్‌కు బాగా అనుకూలించే మైదానం. గతంలోనూ ఇక్కడ భారీ స్కోర్లే నమోదయ్యాయి కాబట్టి సిరీస్‌లోని చివరి రెండు టి20ల్లో బ్యాటర్ల నుంచి మెరుపు ప్రదర్శనలు ఆశించవచ్చు. అయితే శనివారం రోజున వర్ష సూచన ఉంది. మ్యాచ్‌కు వాన అంతరాయం కలిగించవచ్చు. ఇక్కడ జరిగిన 13 టి20ల్లో 11 సార్లు ముందుగా బ్యాటింగ్‌ చేసిన జట్టే గెలిచింది.

అదే జట్టుతో...

గత మ్యాచ్‌లో ఏకపక్ష విజయం సాధించిన భారత జట్టు మార్పుల్లేకుండానే బరిలోకి దిగే అవకాశం ఉంది. తన సత్తా చాటేందుకు యశస్వి జైస్వాల్‌కు ఇది మరో అవకాశం. అయితే రెండో ఓపెనర్‌ శుబ్‌మన్‌ గిల్‌ మూడు మ్యాచుల్లోనూ 'సింగిల్‌ డిజిట్‌' స్కోరుకే పరిమితమయ్యాడు. ఇక్కడైనా అతను ఫామ్‌ను అందుకుంటాడా చూడాలి. ఈ ఫార్మాట్‌లో తాను ఎంత ప్రమాదకరమైన ఆటగాడో సూర్యకుమార్‌ నిరూపించాడు. అయితే ఇప్పుడు అందరి దృష్టి హైదరాబాదీ బ్యాటర్‌ తిలక్‌ వర్మపై నిలిచింది. సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లలో సత్తా చాటిన అతనిపై అన్ని వైపుల నుంచి ప్రశంసలతో పాటు వన్డేల్లోనూ తీసుకోవాలనే సూచనలు వస్తున్న నేపథ్యంలో తిలక్‌ తన జోరును కొనసాగించాల్సి ఉంది. సంజు సామ్సన్‌కు కూడా ఇది చావోరేవోలాంటి మ్యాచ్‌. ఇక్కడా అవకాశం వృథా చేస్తే ముున్ముందు కష్టమే. బౌలింగ్‌లో పేసర్లు ముకేశ్, అర్ష్‌దీప్‌ అంతంత మాత్రమే ప్రభావం చూపిస్తుండగా... చహల్, కుల్దీప్‌ తమ స్పిన్‌తో ప్రత్యర్థిని కట్టిపడేస్తున్నారు. వీరు మరోసారి చెలరేగితే విండీస్‌కు కష్టాలు తప్పవు.

హెట్‌మైర్‌ రాణిస్తాడా...

విండీస్‌ జట్టులో పూరన్, హెట్‌మైర్‌లు టి20 ఫార్మాట్‌లో స్టార్‌లుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. పూరన్‌ తనపై ఉన్న అంచనాలను నిలబెట్టుకోగా, హెట్‌మైర్‌ ఇప్పటి వరకు ప్రభావం చూపలేకపోయాడు. ఈసారైనా అతను దూకుడుగా ఆడాలని మేనేజ్‌మెంట్‌ కోరుకుంటోంది. కెప్టెన్‌ పావెల్‌ ఫామ్‌లోకి సానుకూలాంశం కాగా... మేయర్స్, చార్లెస్‌ కనీస ప్రదర్శన కూడా ఇవ్వడం లేదు. ఓపెనర్‌ కింగ్‌ కూడా శుభారంభం అందించాల్సి ఉంది. చార్లెస్‌ స్థానంలో వన్డే కెప్టెన్‌ షై హోప్‌ను ఆడించే అవకాశం ఉంది. ఫిట్‌గా ఉంటే చేజ్‌ స్థానంలో హోల్డర్‌ తిరిగొస్తాడు. నెమ్మదైన పిచ్‌లపై మెరుగైన రీతిలో రాణించిన విండీస్‌ పేసర్లు జోసెఫ్, మెకాయ్, షెఫర్డ్‌ ఈ పిచ్‌పై భారత బ్యాటర్లను ఎలా నిలువరిస్తారనేది చూడాలి. అన్ని విధాలుగా ఆకట్టుకున్న స్పిన్నర్‌ అకీల్‌ హొసీన్‌పై కూడా టీమ్‌ ఆధారపడుతోంది.

4 భారత్, విండీస్‌ మధ్య ఈ మైదానంలో 6 టి20లు జరగ్గా, భారత్‌ నాలుగింటిలో గెలిచి ఒక మ్యాచ్‌లో ఓడింది. మరో మ్యాచ్‌లో ఫలితం రాలేదు. గత రెండు మ్యాచ్‌లలో భారత్‌ 191, 188 స్కోర్లు చేసింది.

5 మరో 5 వికెట్లు తీస్తే చహల్‌ టి20ల్లో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా నిలుస్తాడు.

క్వార్టర్‌ ఫైనల్లో హారిక

ప్రపంచ రెండో ర్యాంకర్‌ నకమురాపై ప్రజ్ఞానంద సంచలన విజయం

బకూ (అజర్‌బైజాన్‌): ప్రపంచకప్‌ చెస్‌ టోర్నమెంట్‌ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్‌ ద్రోణవల్లి హారిక క్వార్టర్‌ ఫైనల్‌ చేరుకోగా... కోనేరు హంపి ప్రిక్వార్టర్‌ ఫైనల్లో వెనుదిరిగింది. ఎలైన్‌ రోబర్స్‌తో జరిగిన ప్రిక్వార్టర్‌ ఫైనల్లో హారిక 2.5–1.5తో గెలిచింది. నిర్ణీత రెండు క్లాసికల్‌ గేమ్‌ల తర్వాత ఇద్దరూ 1–1తో సమంగా ఉండటంతో శుక్రవారం ర్యాపిడ్‌ ఫార్మాట్‌లో టైబ్రేక్‌ను నిర్వహించారు. తొలి గేమ్‌ను హారిక 61 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... రెండో గేమ్‌లో హారిక 73 ఎత్తుల్లో నెగ్గి క్వార్టర్‌ ఫైనల్‌ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బెలా ఖొటెనాష్‌విలి (జార్జియా)తో జరిగిన ప్రిక్వార్టర్‌ ఫైనల్లో హంపి 1–3తో ఓడిపోయింది. ర్యాపిడ్‌ ఫార్మాట్‌ టైబ్రేక్‌ తొలి గేమ్‌లో హంపి 54 ఎత్తుల్లో... రెండో గేమ్‌లో 43 ఎత్తుల్లో పరాజయం పాలైంది.

గుకేశ్‌ ముందంజ...

ఓపెన్‌ విభాగంలో 18 ఏళ్ల భారత గ్రాండ్‌మాస్టర్‌ ప్రజ్ఞానంద పెను సంచలనం సృష్టించాడు. టైటిల్‌ ఫేవరెట్, ప్రపంచ రెండో ర్యాంకర్‌ హికారు నకముర (అమెరికా)పై ప్రజ్ఞానంద గెలుపొంది ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ బెర్త్‌ను దక్కించుకున్నాడు. ర్యాపిడ్‌ ఫార్మాట్‌లోని రెండు గేముల్లో 2787 ఎలో రేటింగ్‌ ఉన్న నకమురను 2690 రేటింగ్‌ కలిగిన ప్రజ్ఞానంద ఓడించడం విశేషం. తమిళనాడుకు చెందిన ప్రజ్ఞానంద తొలి గేమ్‌లో 33 ఎత్తుల్లో, రెండో గేమ్‌లో 41 ఎత్తుల్లో విజయం సాధించాడు. తమిళనాడుకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్‌ దొమ్మరాజు గుకేశ్‌ 2.5–1.5తో ఆంద్రీ ఎసిపెంకో (రష్యా)ను ఓడించి ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ చేరగా... నిహాల్‌ సరీన్‌ 1–3తో నెపోమ్‌నిశి (రష్యా) చేతిలో ఓడిపోయాడు.




ప్రజ్ఞానంద

కరీబియన్‌ ప్రీమియర్‌ లీగ్‌లో రాయుడు

పేట్రియాట్స్‌ టీమ్‌తో ఒప్పందం



ముంబై: భారత మాజీ క్రికెటర్, ఆరు ఐపీఎల్‌ టైటిల్స్‌లో భాగమైన అంబటి తిరుపతి (ఏటీ) రాయుడు ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్‌ 24 వరకు జరిగే కరీబియన్‌ ప్రీమియర్‌ లీగ్‌ (సీపీఎల్‌)లోకి అడుగు పెడుతున్నాడు. వచ్చే సీజన్‌ కోసం అతను సెయింట్‌ కిట్స్‌ అండ్‌ నెవిస్‌ పేట్రియాట్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. టోర్నీకి దూరమైన దక్షిణాఫ్రికా ఆటగాడు స్టబ్స్‌ స్థానంలో టీమ్‌ మేనేజ్‌మెంట్‌ రాయుడును ఎంచుకుంది. ఈ సీజన్‌లో చెన్నై సూపర్‌ కింగ్స్‌ ఐపీఎల్‌ గెలవగానే లీగ్‌కు రిటైర్మెంట్‌ ప్రకటించిన రాయుడు అమెరికాలోని మేజర్‌ క్రికెట్‌ లీగ్‌ (ఎంసీఎల్‌)లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. అయితే రిటైర్మెంట్‌ తర్వాత కూడా భారత ఆటగాళ్లు విదేశీ లీగ్‌లలో పాల్గొనేందుకు కనీసం ఏడాది విరామం ఉండాలనే నిబంధనను ఆ సమయంలో బీసీసీఐ తెచ్చేందుకు ప్రయత్నించింది. దాంతో ఎంసీఎల్‌ ప్రారంభానికి ఐదు రోజుల ముందు అతను లీగ్‌ నుంచి తప్పుకున్నాడు. ఇప్పుడు కూడా రాయుడు ఆడేందుకు బీసీసీఐ అనుమతి ఇస్తుందా లేదా వేచి చూడాలి.

బంగ్లాదేశ్‌ వన్డే కెప్టెన్‌గా షకీబ్‌



ఢాకా: సీనియర్‌ ఆల్‌రౌండర్‌ షకీబ్‌ అల్‌ హసన్‌ ఆసియా కప్, వన్డే వరల్డ్‌ కప్‌లో బంగ్లాదేశ్‌ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. తమీమ్‌ ఇక్బాల్‌ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో అతని స్థానంలో షకీబ్‌ను వరల్డ్‌ కప్‌ వరకు ఎంపిక చేస్తున్నట్లు బంగ్లాదేశ్‌ క్రికెట్‌ బోర్డు ప్రకటించింది. ఇప్పటికే షకీబ్‌ జాతీయ జట్టు టెస్టు, టి20 కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గతంలోనూ షకీబ్‌ బంగ్లా టీమ్‌కు 50 వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2017 మేలో చివరిసారిగా అతను కెప్టెన్‌గా వన్డే బరిలోకి దిగాడు. ఇప్పటి వరకు 235 వన్డేలు ఆడిన షకీబ్‌ 7211 పరుగులు చేసి, 305 వికెట్లు పడగొట్టాడు.

గ్రామాల్లో వైద్య సేవలు బాగున్నాయి

కేరళ జనాభా పరిశోధన కేంద్రం బృందం ప్రశంస



సమావేశంలో మాట్లాడుతున్న కేరళ జనాభా పరిశోధన కేంద్రం సభ్యులు డాక్టర్ రాజేష్ జె నాయక్

కర్నూలు(హాస్పిటల్): వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌లలో రోగులకు అందుతున్న వైద్యసేవలు బాగున్నాయని కేరళ నుంచి వచ్చిన జనాభా పరిశోధన కేంద్రం బృందం సభ్యులు డాక్టర్ రాజేష్ జె నాయక్, మానిటరింగ్ ఆఫీసర్ ఎన్‌హెచ్‌ఎంపీ డాక్టర్ సచిన్ కెవి ప్రశంసించారు. శుక్రవారం వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య, ప్రోగ్రామ్ అధికారులతో సమావేశమయ్యారు. తాము ఈ నెల 10న ఇ.తాండ్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని గొందిపర్ల గ్రామాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించామన్నారు. కుటుంబ సంక్షేమ శాఖ నిర్వహించే అన్ని ప్రోగ్రామ్‌లను తనిఖీ చేశామన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఎంతో బాగుందని, ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌లో పీహెచ్‌సీ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. సమావేశంలో డీపీఎంవో డాక్టర్ ఉమా, ఫ్యామిలీ ఫిజీషియన్ కో ఆర్డినేటర్ డాక్టర్ బాలమురళి, ఇన్‌చార్జి డీపీవో డాక్టర్ శైలేష్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, మాస్ మీడియా అధికారి ప్రమీలమ్మ, ఐడీఎస్‌పీ డాక్టర్ నాగప్రసాద్ పాల్గొన్నారు.

‘అన్‌లాగ్’లో ఇంటర్న్‌షిప్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

తొమ్మిది మంది ఎంపిక... నెలకు రూ.40వేలు స్టయిఫండ్



అన్‌లాగ్ డివైజెస్ కంపెనీకి ఎంపికైన నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులు తొమ్మిది మంది అమెరికన్ బహుళజాతి సెమీ కండక్టర్ కంపెనీ అయిన అన్‌లాగ్ డివైజెస్‌కి ఎంపికయ్యారు. ఆ సంస్థ ప్రతినిధులు ట్రిపుల్‌ఐటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి ఆప్టిట్యూడ్, టెక్నికల్ పరీక్షల అనంతరం తొమ్మిది మంది విద్యార్థులను ఏడాదిపాటు లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఈ విద్యార్థులకు నెలకు రూ.40వేలు చొప్పున స్టయిఫండ్ ఇస్తారు. ఇంటర్న్‌షిప్ పూర్తయిన తర్వాత వారి పనితీరు ఆధారంగా విద్యార్థులను ఉద్యోగాల్లోకి తీసుకుంటారు. ఇదే సంస్థ గతేడాది నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసుకుని వారికి రూ.27లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలను ఇచ్చింది. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ ఈసీఈ హెచ్‌వోడీ పి.శ్యామ్ మాట్లాడుతూ భారతదేశ సెమీ కండక్టర్ పాలసీ ఫ్రేమ్ వర్క్‌కు అనుగుణంగా అగ్రశ్రేణి విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణుల సలహాలు, సూచనల మేరకు ట్రిపుల్‌ఐటీలో పాఠ్యాంశాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఎనిమిది రకాల అత్యాధునిక ల్యాబ్‌లతో నిరంతరం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

‘గగన్‌యాన్’లో మరో కీలక పరీక్ష విజయవంతం

డ్రోగ్ ప్యారాచూట్లకు ప్రయోగాత్మక పరీక్ష సక్సెస్



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి మరో కీలక పరీక్ష విజయవంతమైంది. ఈ నెల 8వ తేదీన డ్రోగ్ ప్యారాచూట్లకు ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో శుక్రవారం తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. గగన్‌యాన్ మిషన్‌లో వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లి తిరిగి సురక్షితంగా భూమికి చేరుకునేందుకు డ్రోగ్ ప్యారాచూట్ విస్తరణ పరీక్షల అవసరం ఉందని తెలిపింది. క్రూ మాడ్యూల్‌ను స్థిరీకరించడానికి, రీ-ఎంట్రీ సమయంలో దాని వేగాన్ని తగ్గించి సురక్షితంగా తీసుకురావడానికి ఈ ప్యారాచూట్ కీలకపాత్ర పోషిస్తుందని వెల్లడించింది. గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ మందగింపు వ్యవస్థ కోసం సంక్లిష్టమైన ప్యారాచూట్ సీక్వెన్స్‌లో మొత్తం 10 వరకు ఉంటాయని పేర్కొంది. గగన్‌యాన్ ప్రయోగంలో క్రూ మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి పంపించి, దానిని మళ్లీ భూమి మీదకు తీసుకువచ్చేందుకు, సురక్షితంగా ల్యాండింగ్ చేసేందుకు ఈ ప్యారాచూట్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, అందుకు వీటి పనితనాన్ని పరీక్షించుకుని నిర్ధారించుకుంటున్నామని ఇస్రో వివరించింది.

శ్రీశైలం డ్యామ్ సందర్శించిన జలశక్తి సంయుక్త కార్యదర్శి



శ్రీశైలం డ్యామ్ వద్ద జలశక్తి సంయుక్త కార్యదర్శి ఆనంద్‌మోహన్

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయాన్ని కేంద్ర జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ఆనంద్‌మోహన్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. వర్షాకాలం ప్రారంభమై, జలాశయానికి వరద ప్రవాహం పెరిగే నేపథ్యంలో ఆయన శ్రీశైలం డ్యామ్‌తో పాటు కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాలను పరిశీలించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు తలమానికమైన శ్రీశైలం డ్యామ్‌కు వచ్చిన వరద నీరు, రాబోవు రోజుల్లో వచ్చే వరద ప్రవాహం, వర్షాభావ పరిస్థితులపై ఆనంద్ మోహన్ ఇంజినీర్లతో చర్చించారు. డ్యామ్ రేడియల్ క్రస్ట్‌గేట్ల పనితీరు, గ్యాలరీ నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. డ్యామ్‌పై ఆధారపడి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న తెలంగాణలోని భూగర్భ జలవిద్యుత్ కేంద్రం, ఆంధ్రలోని కుడిగట్టు జల విద్యుత్ కేంద్రాలను సందర్శించి పవర్ హౌస్‌ల పనితీరు, విద్యుత్ ఉత్పత్తి వంటి అంశాలను జెన్‌కో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డ్యామ్ ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఈఈ మనోహర్ రాజు ఉన్నారు.

ముువ్వన్నెల ముస్తాబు

స్వాతంత్ర్య దినోత్సవానికి విజయవాడ మువ్వన్నెలతో ముస్తాబవుతోంది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కృష్ణలంక జాతీయ రహదారి సాయిబాబా మందిరం సమీపంలో ఇనుప గ్రిల్స్‌పై ఏర్పాటు చేసిన జాతీయ పతాకం విశేషంగా ఆకర్షిస్తోంది.

- కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ



పోస్టాఫీసుల నుంచే ఫారిన్‌కు పార్శిల్

తెలుగు రాష్ట్రాల్లో 55 పోస్టాఫీసుల ఎంపిక

- ఏపీలో 24... తెలంగాణలో 31
- అనుమతించిన కేంద్ర ఎక్సైజ్-కస్టమ్స్ శాఖ

సాక్షి, అమరావతి: విదేశాల్లో ఉన్న మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు పార్శిళ్లు పంపించడం మరింత సులభతరం కానుంది. మీ సమీపంలోని పోస్టాఫీసు నుంచే ఫారిన్‌కు పార్శిళ్లు పంపించవచ్చు. ఇందుకోసం దేశంలో భారీగా పోస్టాఫీసులకు కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ శాఖ అనుమతించింది. పోస్టాఫీసుల నుంచి విదేశాలకు పార్శిల్ సర్వీసులను కొన్నేళ్ల క్రితమే ప్రవేశపెట్టారు. కానీ, వాటిని అతి తక్కువ పోస్టాఫీసులకే పరిమితం చేశారు. దీంతో విదేశాలకు పార్శిళ్లు పంపించాలంటే దూరంగా ఉన్న పోస్టాఫీసులకు వెళ్లాల్సి వస్తోంది. లేదా అధిక రుసుము చెల్లించి ప్రైవేట్ కొరియర్ సేవలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ సమస్యను గుర్తించి పోస్టాఫీసుల నుంచి విదేశాలకు పార్శిల్ సర్వీసులను దేశవ్యాప్తంగా మరింత విస్తృతం చేయాలని కేంద్ర ఎక్సైజ్-కస్టమ్స్ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా కొత్తగా 715 పోస్టాఫీసుల నుంచి విదేశాలకు పార్శిల్ సర్వీసులను అనుమతించింది. త్వరలోనే కొత్తగా అనుమతించిన పోస్టాఫీసుల్లో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.



ఏపీలో 4 నుంచి 24కు పెంపు

తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 55 పోస్టాఫీసుల నుంచి విదేశాలకు పార్శిల్ సర్వీసులకు అనుమతించారు. వాటిలో హెడ్ పోస్టాఫీసులు(హెచ్‌వో), సబ్ పోస్టాఫీసులు(ఎస్‌వో) కూడా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు నాలుగు పోస్టాఫీసుల నుంచే విదేశాలకు పార్శిల్ సర్వీసులు అందిస్తున్నారు. కొత్తగా 24 పోస్టాఫీసుల నుంచి ఈ సేవలు అందించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు తెలంగాణలో కేవలం ఒక్క పోస్టాఫీసు నుంచే విదేశాలకు పార్శిల్ చేసేందుకు అవకాశం ఉంది. తాజాగా 31 పోస్టాఫీసులకు అనుమతించారు.

తెలంగాణలో కొత్తగా అనుమతించిన పోస్టాఫీసులు

హైదరాబాద్ జీపీవో, భూపాలపల్లి ఎస్‌వో, జగిత్యాల హెచ్‌వో, జేఎన్‌టీయూ కూకట్‌పల్లి ఎస్‌వో, కొత్తగూడెం కోల్స్ హెచ్‌వో, మహబూబాబాద్ హెచ్‌వో, మహబూబ్‌నగర్ హెచ్‌వో, నిర్మల్ ఎల్‌ఎస్‌జీ ఎస్‌వో, వనస్థలిపురం ఎస్‌వో, వికారాబాద్ హెచ్‌వో, మంచిర్యాల హెచ్‌వో, మెదక్ హెచ్‌వో, ములుగు బి-క్లాస్ ఎస్‌వో, నాగర్‌కర్నూల్ ఎస్‌వో, నల్లగొండ హెచ్‌వో, నారాయణపేట ఎస్‌వో, భువనగిరి హెచ్‌వో, హన్మకొండ హెచ్‌వో, జనగాం హెచ్‌వో, కామారెడ్డి హెచ్‌వో, ఖమ్మం హెచ్‌వో, సిరిసిల్ల ఎస్‌వో, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎస్‌వో, సూర్యాపేట హెచ్‌వో, లక్ష్మీపూర్ ఎస్‌వో, వనపర్తి హెచ్‌వో, గద్వాల్ హెచ్‌వో, నిజామాబాద్ హెచ్‌వో, పెద్దపల్లి హెచ్‌వో, ఆర్సీ పురం హెచ్‌ఈ ఎస్‌వో, షాద్‌నగర్ ఎస్‌వో.

ఏపీలో కొత్తగా అనుమతించిన పోస్టాఫీసులు

శ్రీకాకుళం హెచ్‌వో, విజయనగరం హెచ్‌వో, పార్వతీపురం హెచ్‌వో, అనకాపల్లి హెచ్‌వో, పాడేరు హెచ్‌వో, అమలాపురం హెచ్‌వో, కాకినాడ హెచ్‌వో, సామర్లకోట హెచ్‌వో, రాజమహేంద్రవరం హెచ్‌వో, తాడేపల్లిగూడెం హెచ్‌వో, మచిలీపట్నం హెచ్‌వో, విజయవాడ పాలిటెక్నిక్ ఎస్‌వో, గుంటూరు హెచ్‌వో, నరసరావుపేట హెచ్‌వో, బాపట్ల హెచ్‌వో, ఒంగోలు హెచ్‌వో, చిత్తూరు హెచ్‌వో, రాయచోటి హెచ్‌వో, కడప హెచ్‌వో, కర్నూలు హెచ్‌వో, నంద్యాల హెచ్‌వో, అనంతపురం హెచ్‌వో, ప్రశాంతినిలయం ఎస్‌వో, విజయవాడ బకింగ్‌హామ్‌పేట ఎస్‌వో.

ప్రపంచ స్థాయి మ్యూజియంగా ‘ఎస్వీ’

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- శ్రీవేంకటేశ్వర మ్యూజియం అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ కార్యక్రమంలో కరుణాకరరెడ్డి

తిరుమల: మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ప్రపంచ స్థాయి మ్యూజియంగా అభివృద్ధి చేస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వర మ్యూజియం అభివృద్ధి పనులకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడారు. శ్రీవేంకటేశ్వర స్వామివారి మహిమ, ఆలయ పురాతన సంప్రదాయాలు, సంస్కృతిని, చారిత్రక ప్రాముఖ్యతను యాత్రికులకు తెలియజేయడమే మ్యూజియం ప్రధాన లక్ష్యమన్నారు. విరాళం ప్రాతిపదికన రూ.145 కోట్ల ప్రాజెక్టును చేపట్టేందుకు ముందుకు వచ్చినందుకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, మ్యాప్ సిస్టమ్స్ సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 19 గ్యాలరీలు ఉన్నాయని, వాటిలో ఐదింటిని బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ రూ.20 కోట్లతో, మిగిలిన 14 గ్యాలరీలను టీసీఎస్ రూ.125 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాయని చెప్పారు. ఈ పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయని వివరించారు. మరుగున పడిన సనాతన ధార్మిక అంశాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు మ్యూజియం ఎంతగానో దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతకుముందు టీటీడీ ఈవో ఎస్వీ మ్యూజియం నిర్మాణ ప్రణాళిక, డిజైన్‌ను డిస్‌ప్లే ద్వారా చైర్మన్‌కు వివరించారు. కాగా, తిరుమల శ్రీవారి అభిషేక సేవలో శుక్రవారం భూమన కరుణాకరరెడ్డి అధికారికంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా స్వామి వారికి అభిషేక తీర్థాన్ని తీసుకెళ్లారు.

పేదల ఇళ్లపై ఎల్లో మీడియా విషపు రాతలు

1,048వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పేదల ఇళ్ల విషయంలో ఎల్లో మీడియాలో నిస్సిగ్గుగా విషపురాతలు రాస్తుండడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,048వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లో అభివృద్ధి జరగకుండా కోర్టుల్లో తప్పుడు కేసులు వేస్తూ అడ్డుపడుతున్నది చంద్రబాబు ఆయన సామాజిక వర్గం కాదా అని ప్రశ్నించారు. పుంగనూరు దాడిలో 50 మంది పోలీసులకు దెబ్బలు తగిలి, పోలీసు వ్యానులు తగలబడడానికి చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలే కారణమని ధ్వజమెత్తారు. హింసను ప్రేరేపిస్తున్న బాబును అరెస్టు చేసేలా న్యాయస్థానాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాబుకు మద్దతుగా మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని, పేదల హక్కులకు అడ్డుపడుతున్నా చూస్తూ కూర్చున్న వామపక్షాలను, పావలా పవన్ కళ్యాణ్‌ను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. చిట్‌ఫండ్ సంస్థ ద్వారా అక్రమాలకు పాల్పడిన రామోజీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బొలిమేర శ్యామ్యూల్, మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, నూతక్కి జోషి, మల్లవరపు చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

టమాటా నేలచూపులు

కిలో రూ.128 నుంచి రూ. 40కు పడిపోయిన ధర




మదనపల్లె మార్కెట్‌కు శుక్రవారం రైతులు తీసుకువచ్చిన టమాటా

మదనపల్లె/రాయచోటి: టమాటా ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. గతవారం కిలో రూ.200కు పైగా పలికిన ధరలు కేవలం నాలుగురోజుల్లో సీన్ మొత్తం రివర్స్ అయి మొదటి రకం కిలో రూ.128 నుంచి రూ.40కు పడిపోయింది. రెండురోజులుగా మార్కెట్లో కిలో రూ.20 నుంచి రూ. 40 మధ్య మాత్రమే ధరలు నమోదవుతున్నాయి. శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె మార్కెట్‌కు రైతులు 402 మెట్రిక్‌టన్నుల టమాటాలను అమ్మకానికి తీసుకువస్తే..వాటిలో మొదటిరకం కిలో రూ.30-40, రెండోరకం కిలో రూ.21-28 మధ్య ధరలు పలికాయి. బహిరంగ మార్కెట్లో వినియోగదారులు కిలో రూ.30-50 మధ్య కొనుగోలు చేశారు. మదనపల్లె టమాటా మార్కెట్‌లో సీజన్ ముగింపుదశకు చేరుకోవడం , రాష్ట్రంలోని అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటుగా కర్ణాటకలోని కోలార్, చింతామణి, శ్రీనివాసపురం,చిత్రదుర్గ, బాగేపల్లె, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో టమాటా దిగుబడులు అందుబాటులోకి రావడం ధరలు తగ్గేందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అధిక ధరలతో దేశవ్యాప్తంగా టమాటాకు డిమాండ్ తగ్గడం, టమాటా కొనుగోళ్లకు ఇతర రాష్ట్రాల నుంచి మదనపల్లెకు చేరుకున్న వ్యాపారులు వెళ్లిపోవడంతో పోటీ లేని కారణంగా గిరాకీ తగ్గి టమాటాల ధర తగ్గుతోందని అంచనా. అనంతపురం టమాటా మార్కెట్‌కు గురువారం ఒక్కరోజే 2,500 మెట్రిక్‌టన్నుల దిగుబడులు వచ్చినట్లుగా మార్కెటింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణమ్మ పరుగులు

5 గేట్లు పైకెత్తి 12,000 క్యూసెక్కుల నీటి విడుదల



జూపాడుబంగ్లా (నంద్యాల): పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కృష్ణమ్మ ఎస్సారెమ్సీ (దిగువకు) కాల్వలోకి పరుగులు తీసింది. శుక్రవారం ఉదయం శ్రీశైలం డ్యాంలో 865 అడుగుల వద్ద 122.4160 టీఎంసీల నీటిమట్టం నమోదైంది. సీఎం వైఎస్ జగన్ నీటి విడుదలకు అనుమతివ్వగా జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, ఎస్ఈ వెంకటరమణయ్య, ఈఈ మనోహర్‌రాజు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ 4, 5, 6, 7, 8 గేట్లను అడుగు మేర ఎత్తి 2,500 క్యూసెక్కుల నీటిని ఎస్సారెమ్సీ కాల్వలోకి విడుదల చేశారు. గంట గంటకు నీటివిడుదల సామర్థ్యాన్ని పెంచి సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పోతిరెడ్డిపాడు నుంచి 12,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నీటిని బనకచర్ల నీటి నియంత్రణ సముదాయం నుంచి తెలుగుగంగ కాల్వకు 10,000 క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 2,000 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నారు. నీటి విడుదల సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు క్షీరాభిషేకం చేశారు.

ముందుగా రిజర్వాయర్లు నింపుతాం

వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున శ్రీశైలం జలాశయంలోకి వరదజలాలు తక్కువగా చేరాయని పోతిరెడ్డిపాడు ఎస్ఈ వెంకటరమణయ్య చెప్పారు. ప్రస్తుతం డ్యాంలోకి వరదనీటి ప్రవాహం నిలిచిపోయిందన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసే నీటితో రిజర్వాయర్లు నింపటానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ నెలాఖరులోగా శ్రీశైలం డ్యాంలోకి వరదనీటి ప్రవాహం ప్రారంభమైతే సంపూర్ణంగా సాగు, తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. నీటిలభ్యత తక్కువగా ఉన్నందున మెట్ట పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు.

పులస వేటలో.. కాసుల పంట

నరసాపురం తీరంలో ముమ్మరంగా వేట

భారీ వరదలతో అంతంతమాత్రంగానే ఉత్పత్తి



:గోదావరిలో లభ్యమయ్యే పులసలు

నరసాపురం: వర్షాకాలంలో ఆగస్టు నెల వచ్చిందంటే చాలు గోదావరిలో పులసలు సందడి చేస్తుంటాయి. మత్స్యకారులు సంప్రదాయ పడవల్లో వాటి వేటలో బిజీగా ఉంటారు. అయితే ఈ ఏడాది గోదావరిలో పులసల జాడ ఆగస్టు నెల వచ్చినా కానరావడం లేదు. ప్రస్తుతం వరదల ఉధృతి తగ్గడంతో చేపల వేట సాగుతోంది. గోదావరిలో కేవలం ఎర్ర నీరు ఉన్నప్పుడు మాత్రమే లభ్యమయ్యే పులసల కోసం మత్స్యకారులు వేటను ముమ్మరం చేశారు. కొన్ని రోజులుగా అటు అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది నుంచి ఇటు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నుంచి సిద్ధాంతం వరకూ గోదావరిలో పులసలు పట్టడం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. పులసలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా మంచి క్రేజ్ ఉంది.

పుస్తెలమ్మయినా పులస తినాలనే నానుడి గోదావరి జిల్లాలో ఎప్పటి నుంచో ఉంది. ఎంత ధరైనా కొని తినాలని ఆరాటపడుతుంటారు. అంత డిమాండ్ ఉన్నందుకే వీటి ధరలు కూడా అంతే స్థాయిలో ఉంటాయి. పులసల సీజన్‌లో ఈ ప్రాంతం వారు వాటిని కొనుగోలు చేసి హైదరాబాద్, విశాఖపట్నం లాంటి దూర ప్రాంతాల్లోవున్న బంధువులు, స్నేహితులకు పంపుతుంటారు. పలువురు ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా పులస రుచి చూసి ప్రశంసించారు. సముద్రంలో ఇలసగా పిలిచే చేప గోదావరిలోకి ఎర్రనీరు రాగానే ఈదుకుంటూ వస్తాయి. సముద్రంలో వందల మైళ్ల ప్రయాణించి.. ఎర్రనీటికి ఎదురు ప్రవహించి రావడం వీటి ప్రత్యేకత. గోదావరిలోకి రాగానే వీటి శరీరంలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. దానిలో ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు శాతం పెరగడంతో మంచి రుచి వస్తుంది. నీటికి ఎదురు ప్రవహించే క్రమంలో రెండు మూడు రోజుల్లోనే ఇలస.. పులసగా మారుతుంది. మారిన ఇలస రుచి మంచి వాసనతో నోరూరిస్తుంది. పులస, ఇలస ఒకేలా ఉండడంతో వీటిని గుర్తించడం కొంచెం కష్టం. గోదావరిలో ఎర్రనీరు ఎప్పటి వరకూ ఉంటుందో అప్పటి వరకూ దొరికేవి మాత్రమే పులసలని, మిగతావన్నీ ఇలసలుగా భావించాలని చెబుతారు.

పులసలు దొరికేది ఇక్కడే..

ప్రధానంగా నరసాపురం, సిద్ధాంతం, అంతర్వేది ప్రాంతాల్లో పులసలు ఎక్కువగా దొరుకుతాయి. ఈ ప్రాంతంలోనే పెద్ద సంఖ్యలో మత్స్యకారుల వలలకు చిక్కుతాయి. ఇటు సిద్ధాంతం వరకూ అలాగే తూర్పు గోదావరి జిల్లాలోని రాజోలు, గన్నవరం ప్రాంతాల వరకూ పులసల వేట ముమ్మరంగా సాగుతుంది. నరసాపురం, అంతర్వేది మార్కెట్లలోనూ రావులపాలెం, సిద్ధాంతం, చించినాడ వంతెనల వద్ద పులసల అమ్మకాలు సాగుతాయి.

రంగపాల వలలకే పులస చిక్కేది

సముద్రంలో వేట సాగించే పెద్ద బోట్ల కంటే చెక్కనావల్లోని వలలకే పులసలు చిక్కుతాయి. పులసల వేట కోసం చెక్కనావలపై మత్స్యకారులు ప్రత్యేక వలలను ఉంచుతారు. వీటిని ‘రంగపాల’ వలలుగా పిలుస్తారు. ఓ వంద వరకూ చెక్కనావల ద్వారా వేట సాగిస్తే ఓ పదిహేను, ఇరవై పడవలకు మాత్రమే పులసలు పడతాయని మత్స్యకారుడు రేవు అప్పారావు చెప్పారు. పెద్ద బోట్ల వలలకు పరిమిత సంఖ్యలోనే పులసలు లభిస్తాయి. పులసలు తెల్లవారుజాము ప్రాంతంలో ఎక్కువగా పడతాయి. దీంతో మత్స్యకారులు అర్ధరాత్రి నుంచి వేట సాగిస్తారు.

వేల నుంచి రూ. లక్షల్లో ధర

పులసలు అరకిలో నుంచి రెండు కిలోల వరకూ బరువుంటాయి. సైజును బట్టి వీటి ధర లక్షల వరకూ వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. నగరాల్లో పులసలకు డిమాండ్ ఉన్నా ఎగుమతులకు ఆస్కారం లేదు. తక్కువ సంఖ్యలో పులసలు దొరకడమే అందుకు కారణం.

అర్ధరాత్రి వేటకు వెళ్తాం

ఈ సీజన్‌లో పులసలు పడతాయి. ఒక్క పులస దొరికినా మాకు రెండు, మూడు నెలలకు సరిపడా డబ్బులు వస్తాయి. మా చెక్క బోట్లకే పులసలు ఎక్కువగా పడతాయి. అందుకే అర్ధరాత్రి గోదావరిలోకి వెళ్ళి ఉదయం వరకూ వేటాడతాం.

-మోకా సత్యనారాయణ, మత్స్యకారుడు

రంగపాల వలలకే చిక్కుతాయి

మా పెద్ద బోటు వలలకు పులసలు పెద్దగా పడవు. చిన్నగా వుండే రంగపాల వలలకే పులసలు చిక్కుతాయి. ఎర్రనీటిలో దొరికేవి మాత్రమే పులసలు. ఇతర రాష్ట్రాల నుంచి పులసలను పోలిఉండే చేపలు పట్టుకొచ్చి అమ్మేస్తున్నారు.

-తిరుమాని గంగయ్య, మత్స్యకారుడు

కళ్యాణ వైభోగమే...!

17 నుంచి శ్రావణమాసం • 18 నుంచి శుభ ముహూర్తాలు

మదనపల్లె సిటీ: ఆషాడమాసం, అధిక శ్రావణంతో నిలిచిపోయిన శుభకార్యాలు మళ్లీ ఊపందుకోనున్నాయి. పట్టణంతో పాటు గ్రామాల్లో సన్నాయి మేళాలు మోగనున్నాయి. 17 నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుంది.ఈనెల 19 నుంచి మంచి డిసెంబర్ వరకు వరుస మహూర్తాలు ఉండటంతో పెళ్లి సందడి నెలకొంది. ఆగస్టు 16న అమావాస్య అనంతరం నిజ శ్రావణమాసం వస్తుండటంతో 19 తేదీ నుంచి దాదాపు 10 రోజుల పాటు వరుసగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇవి డిసెంబర్ వరకు కొనసాగనున్నాయి. డిసెంబర్ వరకు 50 ముహూర్తాలు ఉండటంతో సుమారు వెయ్యికిపైగా వివాహాలు జరగనున్నాయి. జిల్లాలో ప్రధానంగా మదనపల్లె, రాయచోటి, రాజంపేటతో పాటు పట్టణాలు,గ్రామాల్లో సైతం కల్యాణ మండపాలు వెలిశాయి

వివిధ వర్గాలకు పని: శుభ ముహూర్తాలు ప్రారంభం కావడంతో చాలా మందికి చేతినిండా పని దొరుకుతుంది. పురోహితులు, మంగళవాయిద్యాలు, వంట మనుషులు, డెకరేషన్స్, పూల అలంకరణలు, ట్రావెల్స్, షామియానాలు, క్యాటరింగ్, బ్యూటీషియన్లు, బ్యాండ్‌మేళాలు(డీజె)తో పాటు కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943